13-9Pg1exHMNWJQEG:13-9Pg1exHMNWJQEG.qxd 9/12/2026 11:49 PM Page 1




## గమనిక

ఆదివారం అనుబంధం బదులుగా నేటి సంచికతో **'వినాయక వ్రతకల్పం'** పుస్తకం ఉచితంగా అందుకోండి.

**- ఎడిటర్**


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

13-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 225 పేజీలు: 10+4 వెల: 8.00


**4,500 యేళ్ల పిరమిడ్‌లో గణిత సంకేతాలు** 5లో

**సముద్రం ఎండిపోయిందంటూ అర్జెంటీనాలో హాల్‌చల్**



శనివారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో భేటీ అయిన జిన్‌పింగ్, మోడీ

# కలిసి నడుద్దాం

2లో

## ప్రధాని మోడీతో భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

వాణిజ్యం, పెట్టుబడులు, పలు ద్వైపాక్షిక అంశాలపై ఉభయుల చర్చలు

ఏడు సంవత్సరాల తర్వాత భారత్ వచ్చిన చైనా అధినేత

వాస్తవాధీన రేఖ వివాదంపై కూడా చర్చించిన మోడీ, జిన్‌పింగ్

# ట్రంప్ టారిఫ్‌లు ప్రమాదకరం

- ప్రపంచ వాణిజ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం
- పశ్చిమాసియా ఉద్రిక్తతలను నివారించాలి
- యుఎన్ ఛార్టర్‌కు అనుగుణంగా రక్షణ కల్పించాలి
- శాంతి, స్థిరత్వాలు దౌత్య మార్గంలో సాగాలి
- ఏకాభిప్రాయంతో బ్రిక్స్ డిక్లరేషన్‌కు ఆమోదం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** భారత్‌కు కీలకమైన దౌత్య విజయంగా నిలిచే పరిణామంలో బ్రిక్స్ దేశాలు శనివారం ఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకాభిప్రాయంతో ఆమోదించాయి. పశ్చిమాసియాలో కొన సాగుతున్న ఘర్షణల నేపథ్యంలో ఇరాన్, యుఎఇ మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నప్పటికీ తెర వెనుక జరిగిన వరుస చర్చల అనంతరం ఉమ్మడి ప్రకటనపై అంగీకారం కుదిరింది. భారత్ ఆతిథ్య మిస్తున్న రెండు రోజుల బ్రిక్స్ సదస్సు తొలి రోజు చర్చలు ముగిసిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ డిక్లరేషన్ ఆమోదమైనట్లు ప్రకటిం చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కావడంపై ఢిల్లీ డిక్లరేషన్‌లో బ్రిక్స్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. పరిస్థితులు మరింత దిగజారకుండా గరిష్ఠ సంయమనం పాటించాలని అన్ని పక్షాలకు పిలుపునిచ్చాయి. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని సూత్రాలకు అనుగుణంగా పౌరులు, పౌర మౌలిక >>2

## ఏ దేశానికి బ్రిక్స్ వ్యతిరేకం కాదు

### - ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** ప్రపంచవృద్ధికి చోదక శక్తులుగా ఉన్న దేశాలకు ప్రపంచ పాలనలో మరింత కీలక పాత్ర దక్కాలన్న ఏకాభిప్రాయం తోనే బ్రిక్స్ కూటమి ముందుకు సాగుతుందని, ఏ దేశానికీ వ్యతిరేకంగా పనిచేయదని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాన్ని ప్రధానమంత్రి శనివారం న్యూఢిల్లీలో లాంఛనంగా ప్రారంభిం >>2

## బ్రిక్స్ కూటమికి గ్రోత్ ఇంజిన్‌గా భారత్ 5లో




శనివారం విజయవాడ నుంచి 9 సిసి బ్లాకులు, 12 పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్రమంత్రి జెపి నడ్డా. చిత్రంలో సిఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ తదితరులు.

# ఇంద్ర ధనుష్‌లో ఎపి టాప్

## క్వాంటం బయోవ్యాలీ అభివృద్ధికి కేంద్రం సాయం: కేంద్రమంత్రి జెపి నడ్డా

రూ. 1271 కోట్లతో క్రిటికల్ బ్లాక్‌లు, 25 ఇంటెగ్రేటెడ్ ల్యాబ్‌లు

చంద్రబాబు సారథ్యంలో ఎపి 'సేఫ్ హ్యాండ్స్'లో ఉంది: కేంద్రమంత్రి

### 9 సిసి బ్లాక్‌లు వర్చువల్‌గా ప్రారంభం

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా స్పష్టం చేశారు. అమరావతిలో క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు చేయాలనే సిఎం చంద్రబాబు ఆలోచన బాగుందని ప్రశంసించారు. ఆరోగ్య మౌలిక సదు పాయాల కల్పనలో కీలక అడుగు వేశామని కేంద్ర మంత్రి జెపి నడ్డాఅన్నారు. ఇంద్రధనుష్ కార్యక్ర మంలో ఎపి దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఆయన ప్రశంసించారు. పుట్టిన బిడ్డకు 16 ఏళ్ల వచ్చే వరకూ టీకాలు తీసుకునేందుకు డిజిటల్ ట్రాకింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కొవిడ్ తర్వాత ఆరోగ్య వ్యవస్థల పటిష్టతపై ప్రధాని మోడీ ప్రత్యేకదృష్టి సారించారనితెలిపారు. రాబోయే ఐదేళ్లలో రూ.64 వేల కోట్లతో వైద్య వ్యవస్థలను బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఎపిలో రూ.1,271 కోట్లతో 24 క్రిటికల్ బ్లాకులు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 44 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మిస్తామన్నారు. వంటగదే ఫార్మసీ, ఆహారమే ఔషధమని సిఎం చంద్రబాబు చెప్పే మాటలు అక్షరాలా నిజమని నడ్డా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి జెపి నడ్డా విజయవాడలో పర్యటించారు. పాత ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఐపిహెచ్ ల్యాబరేటరీలను జెపి నడ్డా ప్రారంభించారు. అనంతరం ఈ వైద్య కేంద్రాలను వారుస్వయంగా సందర్శించారు. అక్కడఏర్పాటుచేసిన సదుపాయాలగురించి అధికారులు, వైద్యులు >>2

## గేమ్‌ఛేంజర్‌గా 'సంజీవని'

### అర్హులకు రూ. 5 లక్షల ఆరోగ్య బీమా: సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 12,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తాంమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. సంజీవని ప్రాజెక్టు గేమ్‌ఛేంజర్‌గా మారబోతోందన్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌గా మారబోతోందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంతో చాలామందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో అత్యవసర వైద్యానికి మరింత బలం చేకూర్చేలా నేటి నుంచి క్రిటికల్ కేర్ యూనిట్లు అందుబాటులోకివచ్చాయి. విజయవాడలో రూ.249 కోట్ల వ్యయంతో నిర్మించిన 9 క్రిటికల్ కేర్ యూనిట్లు, 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగ శాలలను కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డాతోకలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు >>2



శనివారం విజయవాడలో కురిసిన భారీ వర్షానికి జలమయమైన రహదారులు

# పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

**విజయవాడలో కుంభవృష్టి**

**మరో రెండు రోజులు**

**అల్పపీడనం ప్రభావం**

**విశాఖ, పోలవరం జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు**

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణ ఒడిశాఉత్తర ఆంధ్ర తీర ప్రాంతాలపై అల్పపీడనం కొనసాగుతుండటంతో రాష్ట్రంలో శనివారం విజయవాడ నగరంతో సహా పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వానలు కురిసాయి. అల్పపీడన ప్రభావంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. విజయవాడలో వాన దంచికొట్టింది. భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వాననీరు చేరింది. దట్టంగా కమ్ముకున్న మేఘాలతో చీకటి వాతావరణం నెలకొంది. నగరంలో ఉదయం నుంచే వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. హఠాత్తుగా కురిసిన భారీ వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. సరిగ్గా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయానికే వర్షం ముంచెత్తడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై చేరిన మోకాల్లోతు నీటితో వాహనదారులు, బాటసారులు తీవ్ర అవస్థలు పడ్డారు. చాలా రోజుల తర్వాత గుడివాడలో భారీవర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అల్పపీడన ప్రభావంతో >>2

## ప్రభుత్వ సేవలకు ఆధార్ తప్పనిసరి కాదు

### - ఉత్తర్వులు జారీ

**విజయవాడ,,సెప్టెంబరు12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రభుత్వ సేవలు, రాయితీలు,ఇతర లబ్ధి పొందడానికి ఇకపై ఆధార్ కార్డు తప్పనిసరి కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ సేవలకు ఆధార్‌ను కేవలం స్వచ్ఛంద ప్రాతిపదికన మాత్రమే తీసుకోవాలని ఆదేశిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మీ సేవ కేంద్రాలతో పాటు దివ్యాంగుల సర్టిఫికేట్ల జారీలోనూ ఇదే విధానం వర్తిస్తుందని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఆర్థిక, ఇతర సబ్సిడీలు, సంక్షేమ ప్రయోజనాలు, సేవల కోసం దరఖాస్తు దారులు స్వచ్ఛందంగా ఇస్తేనే ఆధార్‌ను తీసుకోవాలి ప్రభుత్వ ఆదేశాల్లో స్పష్టం చేసారు.మీ సేవ సహా ఇతర సేవల నమోదు సమయంలో లబ్ధిదారుల గుర్తింపు నిర్ధారణకు ఆధార్ కాకుండా ఇతర ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల గురించి దరఖాస్తు దారునికి తప్పనిసరిగా వివరించాలి.సేవల నిరాకరణ వీల్లేదు. కేవలం ఆధార్ కార్డు ఇవ్వలేదనే కారణంతో ఎలాంటి ప్రభుత్వ సేవలను లేదా సంక్షేమ లబ్ధిని నిరాకరించేందుకు వీల్లేదని ప్రభుత్వం గట్టిగాహెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని స్వర్ణ గ్రామం.స్వర్ణ >>2



## ఆయుష్మాన్ మౌలిక వసతులకు రూ. 1,271.80 కోట్ల అనుమతులు

### -మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వం హయంలో అత్యవసర వైద్య సేవలకు కీలకమైన క్రిటికల్ కేర్ బ్లాకులు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరిగిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఆరోగ్య మౌలిక వసతుల విషయంలో గత ప్రభుత్వం తీవ్ర నిరక్ష్యం చేసిందని విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన రూ.1,272 కోట్ల ఆరోగ్య మౌలిక వసతుల పథకంలో 2019-24 మధ్య మూడేళ్లకు కేవలం రూ.28.85 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత పనులకు ప్రాధాన్యం ఇచ్చి వేగవంతం చేసిందని చెప్పారు. సిసిబిలు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. వైకాపా హయాంలో నత్తనడకన సాగిన పనులు.. కూటమి ప్రభుత్వం వచ్చాక పరుగులు తీస్తున్నాయని అన్నారు. అవసరమైన నిధులు సమకూర్చడంతో పాటు అధికారులకు స్పష్టమైన గడువులు విధించి పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల కాలానికి రూ.1,271.80 కోట్ల పరిపాలనా అనుమతులు లభించాయని మంత్రి తెలిపారు. ఇందులో 24 క్రిటికల్ కేర్ బ్లాకులు, 26 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు సహా పలు ఆరోగ్య మౌలిక వసతుల పనులు ఉన్నాయని వివరించారు. 2019-24 మధ్య ఈ కార్యక్రమానికి సంబంధించి రూ.28.85 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని తెలిపారు. కరోనా వంటి విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన అత్యవసరవైద్య సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాల్సిన సమ >>2




13-9pg2exHMNWJQE:13-9pg2exHMNWJQE.qxd 9/12/2026 11:47 PM Page 1





శనివారం అమరావతిలో కేంద్రమంత్రి జెపి నడ్డాకు బహుమతిని అందిస్తున్న సిఎం చంద్రబాబు

## సిఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి నడ్డా భేటీ

**అమరావతి,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జెపి నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సిఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సిఎం నివాసానికి చేరుకున్న నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సావధానంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జెపి నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కలిసి నడుద్దాం

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 12:** బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీతో జరిగిన భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనా రెండు దేశాలు పరస్పరం తమ బలాల నుంచి పూర్తిస్థాయిలో నేర్చుకోవడంతో పాటు ఒకరికొకరు సహకరించుకోవాలని అన్నారు. ఏడు సంవత్సరాల తర్వాత తొలిసారిగా భారత్‌కు వచ్చిన జిన్‌పింగ్ ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా జరిగిన ఈ భేటీలో సరిహద్దు అంశాలు, వాణిజ్యం, పెట్టుబడులు తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తన పుట్టినరోజు జూన్ 15న భారత్‌కు రావాలంటూ ఆహ్వానం అందిందని జిన్‌పింగ్ తెలిపారు. ఇప్పటివరకు తాను, ప్రధాని మోడీ 21 సార్లు సమావేశమయ్యామని, ఈ సమావేశాల ద్వారా భారత్-చైనా సంబంధాలను స్థిరమైన అభివృద్ధి దిశగా నడిపేందుకు పలు కీలక ఏకాభిప్రాయాలు కుదిరాయని చెప్పారు.చైనా ఎప్పుడూ భారత్‌తో సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో చూస్తుంది. రెండు దేశాల జాతీయ పరిస్థితులు భిన్నంగా ఉన్నప్పటికీ పరస్పరం ఒకరి బలాల నుంచి మరొకరం పూర్తిస్థాయిలో నేర్చుకోవచ్చు. ఒకరికొకరం మద్దతు ఇచ్చుకుంటూ, కలిసి విజయాలు సాధించి, ఉమ్మడి అభివృద్ధిని కొనసాగించాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు.

**ప్రపంచ శాంతికి కలిసి పనిచేయాలి**

శతాబ్ద కాలంలో ఎన్నడూ చూడని విధంగా ప్రపంచంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని జిన్‌పింగ్ అన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో కీలక సభ్యులుగా భారత్, చైనాలపై గణనీయమైన బాధ్యత ఉందన్నారు. మానవాళి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రెండు దేశాలు కలిసి పనిచేయాలి. ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి, సుసంపన్నతకు మరింత సానుకూల శక్తిని అందించాలి. సమానత్వంతో కూడిన, క్రమబద్ధమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని ప్రోత్సహించాలని జిన్‌పింగ్ అన్నారు. మోడీ-జిన్‌పింగ్ భేటీలో భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్ష జరిగింది. ముఖ్యంగా వాస్తవాధీన రేఖ అంశం చర్చల్లో కీలకంగా ఉంది. సరిహద్దులో శాంతి, ప్రశాంతత నెలకొనడం భారత్-చైనా సంబంధాల విస్తృత అభివృద్ధికి అత్యంత అవసరమని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. మరోవైపు, సరిహద్దు వివాదాన్ని ద్వైపాక్షిక సంబంధాల్లోని ఇతర అంశాల నుంచి వేరుగా పరిష్కరించాలన్నది చైనా సంప్రదాయ వైఖరిగా ఉంది.

**అజిత్ దోవల్-వాంగ్ యీ చర్చలు**

మోడీ-జిన్‌పింగ్ సమావేశానికి ముందు ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు కూడా జరిగాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ గత నెల చివర్లో బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు.ఈ చర్చల్లో సరిహద్దు విభజన, సరిహద్దు ప్రాంతాల్లో పరస్పర సహకారం, వాస్తవాధీన రేఖ వెంబడి శాంతి, ప్రశాంతతను కొనసాగించాల్సిన అవసరం వంటి అంశాలు చర్చకు వచ్చాయి.భారత్-చైనా సరిహద్దు చర్చలకు అజిత్ దోవల్, వాంగ్ యీ ప్రత్యేక ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. 2003లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇరు దేశాల మధ్య సుమారు 3,488 కిలోమీటర్ల సరిహద్దు వివాదానికి పరిష్కారం కనుగొనడం ఈ చర్చల ప్రధాన లక్ష్యం.

## వాల్తేరు డిపోవద్ద ఆర్టీసీ బస్సు దగ్ధం

### బస్సు ఖాళీగా ఉండడంతో తప్పిన పెను ప్రమాదం



పూర్తిగా గద్ధమవుతున్న ఆర్టీసి బస్సు

**విశాఖపట్నం, సెప్టెంబరు12 ప్రభాతవార్త:** విశాఖ నగరంలో శనివారం తెల్లవారుజామున ఒక భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది నెల్లూరు నుంచి ప్రయాణికులతో విశాఖ పట్నం చేరుకున్న ఒక ఎపిఎస్‌ఆర్టీసీ బస్సు వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచగా ఆకస్మాత్తుగా మంటలు అంటుకుని నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా దగ్ధ మైంది నెల్లూరు నుంచి సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఈ బస్సు విశాఖకు చేరుకుంది. అనంతరం వాల్తేరు డిపో వెలుపల బస్సును నిలిపి ఉంచారు అయితే, శనివారం తెల్లవారు జామున ఒక్కసారిగా బస్సు ఇంజిన్ భాగం నుండి దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. బస్సు ఖాళీగా ఉన్న సమయంలోనే ఈ ప్రమాదం జరగడంతో ఒక పెద్ద ముప్పు తప్పింది నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి విస్తరించి వాహనం పూర్తిగా దగ్ధం అయ్యింది బస్సు తగల బడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు సిబ్బంది వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు ఆర్టీసీ ఉన్నతాధి కారులు, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీ లించారు. బస్సులో మంటలు చెలరేగడానికి షార్ట్ సర్క్యూట్ కారణమా లేదా మరేదైనా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు ఆర్టీసీ సాంకేతిక విభాగం అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'ఇంద్ర ధనుష్'లో ఎపి టాప్

>> వారికి వివరించారు. ఇదే కార్యక్రమంలో 9 సిసి బ్లాకులు, 12 పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కూడలివేదికపై ఏర్పాటు చేసిన సభలో నడ్డా ప్రసంగిస్తూ వైద్యరంగంలో ఎపి ముందంజలో ఉంటుందన్నారు. అనేక సంస్కరణలను ఇక్కడ అందుబాటులో ఉంచడం నిజంగా సిఎం కృషి అభినందనీయమన్నారు.అమరావతి క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి కేంద్రం నుంచి కేంద్ర సహకారం అందజేస్తామని ఆయన తన ఉపన్యాసంలో ప్రస్తావిస్తూ అమరావతిలో క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు చేయాలనే సిఎం చంద్రబాబు ఆలోచన బాగుందన్నారు.క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటు... ఆలోచనలపై చర్చించేందుకు... కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉంది... దీన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తాం.

**సిఎం చంద్రబాబు సారథ్యంలో ఎపి సేఫ్ హ్యాండ్స్**

సిఎం చంద్రబాబు సారథ్యంలో ఎపి సేఫ్ హ్యాండ్స్‌లో ఉందన్నారు.చంద్రబాబు విజన్‌ఉన్న నాయకుడు అన్నారు. 6వేవ్ ఫార్ములాతో మెండుగా ఉన్న చంద్రబాబు మాటలు నూటికి నూరు శాతం నిజం అన్నారు. వైద్యారోగ్యానికి ఎపి హై ప్రయారిటీ ఇచ్చింది. అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చంద్రబాబు నాయకత్వం, సత్యకుమార్ కృషి, వైద్య ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగం కొత్త శిఖరాలకు చేరుకుంటోందని నడ్డా ప్రశంసించారు. గత దశాబ్ద కాలంగా దేశంలో ఎన్నో ఆరోగ్య విధానాలు తీసుకొచ్చామని కేంద్రమంత్రి జెపి నడ్డా అన్నారు. ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు గర్విస్తున్నానన్నారు. కొవిడ్ తర్వాత ఆరోగ్య వ్యవస్థలను పటిష్టం చేయడంపై మోడీ దృష్టి సారించారన్నారు. వచ్చే ఐదేళ్లలో రూ.64 వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయబోతున్నామన్నారు. ఎపిలో రూ.1,271 కోట్లతో 24 క్రిటికల్ బ్లాకులు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 44 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మిస్తామన్నారు. యువిన్ టెక్నాలజీ ద్వారా పిల్లలకు పుట్టినప్పటి నుంచి 16 యేళ్ల వయసు వచ్చే వరకూ 27 డోసుల వ్యాక్సినేషన్‌ను డిజిటల్‌గా పర్యవేక్షిస్తున్నారు. మిషన్ ఇంద్రధనుస్సులో ఎపి అగ్రగామిగా నిలిచిందని, ఇందుకు కృషి చేసిన వారికి అభినందనలు తెలిపారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ హైపర్‌టెన్షన్, డయాబెటిస్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల కోసం పెద్దఎత్తున స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు.

**ఎపి ఆరోగ్యం సురక్షితుల చేతుల్లో ఉంది, చంద్రబాబు నాయకత్వానికి కితాబు**

ఎపి సిఎం చంద్రబాబు నాయకత్వం,మంత్రి సత్యకుమార్ కృషిపై పూర్తి విశ్వాసం కేంద్రమంత్రి నడ్డా అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను నడ్డా అభినందించారు. ముఖ్యంగా రాష్ట్రంలో టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న తీరును కేంద్ర మంత్రి అభినందించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర ఆరోగ్య రంగానికి కొత్త దిశను చూపిస్తున్నాయని నడ్డా పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు.సత్య కుమార్ చొరవ పై విశ్వాసం ఉందన్నారు.ఆరోగ్యశాఖను సమర్థంగా ముందుకు నడిపిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషిని కూడా నడ్డా ప్రత్యేకంగా అభినందించారు. సత్యకుమార్ చొరవతో ఆరోగ్య కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఆయన పనితీరుపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.

# గేమ్‌ఛేంజర్‌గా 'సంజీవని'

>> ప్రారంభిచారు.అంతకుముందు ఉండవల్లిలోని సిఎం నివాసంలో ఇరువురు నేతలు భేటీ అయ్యారు.ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం విజయవాడ పాత ఆసుపత్రి వద్ద క్రిటికల్ కేర్ బ్లాక్‌ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. 9 సిసి బ్లాకులు, 12 పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారునడ్డా నాయకత్వంలో ఆరోగ్య రంగంలో కొత్త ఆవిష్కరణలు వచ్చాయి. ఆరోగ్య రంగంలో పెను మార్పులకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణం. అర్హులైన వారికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా. 2047 నాటికి ప్రపంచంలోనే మన దేశం ప్రథమ స్థానంలో ఉండాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన క్రిటికల్ కేర్ బ్లాకుల్లో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక విభాగాల సేవలు అందుతాయి. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ఇవి కీలకంగా మారుతాయి. కేంద్రం మంజూరు చేసిన 26 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీల్లో ఇప్పటికే 14 పనిచేస్తున్నాయి. తాజాగా మిగిలిన ల్యాబరేటరీలు కూడా అందుబాటులోకి వచ్చాయి.దీంతో మైక్రోబయాలజీ, హీమటాలజీ వంటి కీలక పరీక్షలు జిల్లా స్థాయిలోనే నిర్వహించే అవకాశం ఏర్పడుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. జిల్లా స్థాయిలోనే వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఐపీహెచ్ ల్యాబరేటరీలు దోహదపడనున్నాయి. ముఖ్యంగా వివిధ రకాల వ్యాధుల నిర్ధారణలో అవసరమైన పరీక్షలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు వేగంగా వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. వైద్య మౌలిక వసతులను క్రమంగా విస్తరిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఈ ప్రాజెక్టులు కీలక అడుగుగా నిలవనున్నాయి. ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ, ప్రజలు కూడా తమ జీవనశైలి, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. వ్యాధుల నివారణకు సేంద్రీయ వ్యవసాయం ఉత్తమ మార్గమన్నారు. ఒత్తిడిని జయించేందుకు ప్రతి ఒక్కరూ రోజూ 10 నిమిషాల పాటు యోగా, ప్రాణాయామం చేయాలని పిలుపునిచ్చారు. 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి' సాధనలో వైద్య విద్యార్థులు సారథులుగా నిలవాలన్నారు.

## ఏ దేశానికి బ్రిక్స్ వ్యతిరేకం కాదు

>> చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అనేక అంతర్జాతీయ సంస్థలలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందు వరుసలో ఉంటున్నప్పటికీ, నిర్ణయాధికారంలో మాత్రం వెనుకబడే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అధికారాల పిరమిడ్‌ను ప్రతి దేశానికీ గళం వినిపించే, ప్రతి సభ్యునికీ భాగస్వామ్యం ఉండే భాగస్వామ్య వేదికగా మార్చాలని పిలుపునిచ్చారు. మానవాళి పురోగతే దీనికి కేంద్రంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధన కోసం బ్రిక్స్ సంస్కరణల రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని మోడీ ప్రతిపాదించారు. ప్రాతినిధ్యం, ప్రతిస్పందన, నియమనిర్మాణం అనే మూడు స్తంభాలపై ఈ రోడ్‌మ్యాప్ దృష్టి సారించాలని సూచించారు. ప్రాతినిధ్యం గురించి వివరిస్తూ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇకపై వాయిదా వేయరాదని, స్పష్టమైన కాలపరిమితితో కూడిన లక్ష్యాలతో చర్చలు జరగాలని ఆయన నొక్కిచెప్పారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలలో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పాత్రలు, విధాన ప్రాధాన్యతలను కూడా ప్రస్తుత ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు.

## వారం - వర్జ్యం

13-09-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, పుబ్బ కార్తె,
తి.విదియ ఉ.7.29, న.హస్త మ.1.10
వ.రా.9.26 - రా.11.06
దు.సా.4.29 - సా.5.18
రాహు సా.4.30 - సా.6.00,
శుభ స. ఉ.8.00 - ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. బహుముఖంగా మీ ప్రతిభా పాటవాలు వెలుగు చూస్తాయి.

**వృషభం :** ఆర్థిక మార్గాలు మెరుగ్గా ఉంటాయి. రాజకీయపరమైన చర్చలు సాగిస్తారు. క్రయవిక్రయాలు.

**మిథునం :** గతంలో ఆత్మీయులతో ఏర్పడి నటువంటి తగాదాలు నేడు సమసి పోతాయి. వ్యాపారస్తులకు అనుకూలం.

**కర్కాటకం :** విలువైన ఆస్తుల తాలూకూ వత్రాల భద్రతా విషయమై విశేషమైన జాగ్రత్తలు పాటించాలి.

**సింహం :** ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. ఉన్నత స్థానంలోని వారు మీ నుండి సలహాలను స్వీకరిస్తారు.

**కన్య :** మిత్రబృందాలను మరింతగా విస్తరింప చేయాలనే ఆలోచనలు బలపడతాయి. శుభ ప్రదమైన చర్చలలో పాల్గొంటారు.

**తుల :** ఆర్థిక విషయ వ్యవహారాలలో తగు జాగ్రత్తలు అవసరం. క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చి లాభపడతారు.

**వృశ్చికం :** వృత్తి, ఉద్యోగాల పరంగా ఉపకరించే సంఘటనలు చోటు చేసు కుంటాయి. మరుపు ఎక్కువగా ఉంటుంది.

**ధనుస్సు :** మీ మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకో గలుగుతారు. విలాస వంతమైన వస్తువులను కొనుగోలు చేస్తారు.

**మకరం :** వాహనం కొనుగోలు చేసే సూచనలు గోచరిస్తున్నాయి. ప్రతి విషయం లోనూ ఆచితూచి నేర్పుగా వ్యవహరిస్తారు.

**కుంభం :** ఆర్థికపరమైన సర్దుబాట్లు నేర్పుగా చేయగలుగుతారు. కారణంలేని చికాకులు చోటు చేసుకుంటాయి. ధనలాభ సూచన.

**మీనం :** ఉచిత సలహాలు ఇచ్చేవారి వలన విసుగు కలుగుతుంది. కాంట్రాక్టుదారులకు లాభసాటిగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం భగవతి అమ్మవారి ఆలయ అధికారులు పవన్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

## చెట్టికులంగర భగవతి అమ్మవారి సేవలో పవన్

### ఆలయంలో పుష్పాంజలి సేవ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు

### దసరా శరన్నవరాత్రులకు వచ్చే వేలాది మంది భక్తుల అన్నదానానికి విరాళం

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** కేరళం రాష్ట్రంలోని అలప్పుజ జిల్లా పరిధిలో చారిత్రక ఆలయంగా పేరున్న చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మవారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం పుష్పాంజలి సేవలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరోగ్య ప్రదాయినిగా పేరున్న శ్రీ భగవతి అమ్మవారికి పుష్పాంజలి సమర్పణ సర్వదోష నివారణ నిమిత్తంచేస్తారని ప్రతీతి. దసరా శరన్నవరాత్రుల తొమ్మిది రోజులు శ్రీ భగవతి అమ్మవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అన్నదానానికి అయ్యే వ్యయం మొత్తాన్ని దేవస్థానం బోర్డుకు విరాళంగా పవన్ కల్యాణ్ అందజేశారు. త్రిశక్తి స్వరూపిణి అయిన అమ్మవారి దర్శనానికి దసరా నవరాత్రుల రోజుల్లో వేలాదిగా భక్తులు తరలివస్తారు.అంతకు ముందు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన పవన్ కల్యాణ్ అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా బాలశివుని దర్శించుకుని అర్చనలు చేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేల్ శాంతి ఉప ముఖ్యమంత్రితో పూజలు చేయించారు.చెట్టికులంగర భగవతి అమ్మవారి ఆలయానికి 1200 యేళ్లకు పైగా చరిత్ర ఉంది. రాక్షస సంహారం కోసం శివుడి మూడో కన్ను నుంచి అమ్మవారు జన్మించినట్టు పురాణాలు చెబుతున్నాయి. శ్రీ భగవతీ అమ్మవారు త్రిశక్తి స్వరూపిణిగా భక్తుల పూజలు అందుకుంటున్నారు.

# పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

>> ఉదయం నుంచి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి ఈదురుగాలులూ తోడవడంతో వినాయక చవితి ఏర్పాట్లకు ఆటంకం కలిగింది. అల్లూరి జిల్లాలో వర్షాల ధాటికి తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. జి.కె. వీధి మండలంలోని గంగవరం సమీపంలో ఉన్న వంతెన కొట్టుకుపోవడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లా మంగళగిరిలో వర్షం కురుస్తోంది. ఉదయాన్నే జడివాన మొదలైంది. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వారు తడిసిముద్దయ్యారు. వర్షానికి కొన్ని రోడ్లు జలమయమయ్యాయి. ప్రధాన రహదారిలో కొంత నీరు నిలిచింది. రెండురోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర ఆంధ్ర తీరంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉండగా, దక్షిణ కోస్తా ప్రాంతంలో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఉత్తర ఆంధ్ర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో శనివారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు, దక్షిణ కోస్తా ప్రాంతంలో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అంచనా వేసింది.శ్రీకాకుళం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కూడా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

# ఆధార్ తప్పనిసరి కాదు

>> వార్డుల్లో ప్రతి చిన్న అంశంలోనూ ఈ కొత్త విధానాన్ని నిరభ్యంతరంగా అమలు చేయాలని ఆదేశించింది. వికలాంగులకు జారీ చేసే ప్రత్యేక సర్టిఫికేట్ల ప్రక్రియలో కూడా ఆధార్‌ను బలవంతం చేయకూడదని, ఉత్తర్వుల్లో పేర్కొన్న విధివిధానాలనే ఖచ్చితంగా పాటించాలని సూచించింది. వైకల్య నిర్ధారణ, ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియలో దరఖాస్తుదారుల ఆధార్ ధృవీకరణను స్వచ్ఛందంగా వినియోగించుకునేందుకు మీసేవ కేంద్రాల నిర్వాహకులకు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆధార్ ధృవీకరణ విఫలమైనప్పటికీ ప్రజలకు సేవలను నిరాకరించకూడదని శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వులు స్పష్టం చేస్తోంది. ప్రత్యామ్నాయ గుర్తింపు పద్ధతుల గురించి వినియోగదారులకు తెలియజేయాలని, అలాగే ఆధార్ వివరాలను సురక్షితంగా ఎన్‌క్రిప్ట్ చేసి భద్రపరచాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

# రూ. 1,271.80 కోట్లు అనుమతులు

>> యంలో పనులు ముందుకు సాగకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరోగ్య రంగంలోని పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారని సత్యకుమార్ తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ, జాప్యానికి కారణాలను తెలుసుకుని అధికారులకు స్పష్టమైన గడువులు విధిస్తున్నారని చెప్పారు.గతంలో నత్తనడకన సాగిన పనులు ఇప్పుడు పరుగులు తీస్తున్నాయని మంత్రి అన్నారు. అవసరమైన నిధులు సమకూర్చి, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు.

# దక్షిణాఫ్రికాలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**విజయవాడ.సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడి పర్యటన దక్షిణాఫ్రికాలో కొనసాగుతోంది. ఎపి వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆయన.. దక్షిణాఫ్రికాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్సన్ మండేలా నివాసాన్ని అయ్యన్నపాత్రుడు సందర్శించారు. అలాగే, ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని కూడా వీక్షించారు.ఈ సందర్భంగా నెల్సన్ మండేలా సాగించిన వీరోచిత పోరాటాన్ని స్పీకర్ గుర్తు చేసుకున్నారు. వర్ణ వివక్షను అంతం చేయడానికి, అణచివేతదారుల పాలన నుంచి దక్షిణాఫ్రికా ప్రజలకు విముక్తి కల్పించడానికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం జోహన్నెస్‌బర్గ్ సమీపంలోని ప్రసిద్ధ లయన్ అండ్ సఫారీ పార్కునూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సందర్శించారు. ఈ సందర్భంగా విశాలమైన ప్రాంగణాల్లోని వివిధ జంతువులను ఆయన వీక్షించారు. ప్రపంచవ్యాప్తంగా భారీగా పర్యాటకులను ఆకర్షించేలా ఈ పార్కును ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారనే విషయాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సభాపతి వెంట శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఉన్నారు.

# తల్లిని చంపిన తనయురాలు

### పొన్నూరులో ఘటన, కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**పొన్నూరు, సెప్టెంబరు 12,ప్రభాతవార్త:** కన్న తల్లినే తనయురాలు అత్యంత కిరాతకంగా భర్తతో కలిసి హతమార్చిన సంఘటన గుంటూరు జిల్లా, పొన్నూరు పట్టణంలో జరిగింది. అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పట్టణానికి చెందిన ఈవూరు లక్ష్మి(45) నిడుబ్రోలు క్యాబిన్‌పేటలో నివాసంఉంటుంది. కుమార్తె పుష్పలత, ఆమె మూడో భర్త రాజా కూడా గత రెండు నెలలుగా లక్ష్మి ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. మృతురాలు లక్ష్మి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదును ఏదో విధంగా చేజిక్కించుకోవాలనే దుర్బుద్ధితో మృతురాలి కుమార్తె పుష్పలత, ఆమె భర్త రాజా పథక రచన చేశారు. లక్ష్మిని బ్రతిమాలినా, బామాలినా మనకు బంగారు ఆభరణాలు, నగదు ఇవ్వదనే విషయం తెలిసి పోయింది. ఇక లక్ష్మిని హతమార్చడమేననే నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున కూతురు పుష్పలత, ఆమె మూడో భర్త రాజా కలిసి ఇంట్లో నిద్రిస్తున్న ఈవూరు లక్ష్మిని చీరలతో గొంతు నులిమి చంపేశారు. లక్ష్మితోపాటు నిద్రిస్తున్న మనవడు(పుష్పలత మొదటి భర్త కుమారుడు) అమ్మమ్మను చంపడాన్ని చూశాడు. ఈ విషయాన్ని గుర్తించిన పుష్పలత, రాజా జరిగిన సంఘటన వివరాలను ఎవరికీ చెప్పవద్దని, నీకు సైకిల్ కొనిపెడతామని ఆశ చూపారు. అనంతరం పుష్పలత, రాజా ఇరువురు ముందే సిద్ధం చేసుకొన్న పథకం ప్రకారం ద్విచక్రవాహనంపై పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవు శ్రీనివాస కిషోర్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి వివరాలను సేకరించారు.

# ట్రంప్ టారిఫ్‌లు ప్రమాదకరం

>> సదుపాయాలకు రక్షణ కల్పించాలని సభ్య దేశాలు కోరాయి. దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని స్పష్టం చేశాయి. దీర్ఘకాలిక అవగాహన, శాశ్వత శాంతి, భద్రత, ప్రాంతీయ స్థిరత్వం కోసం చర్చలు, దౌత్యపరమైన ప్రయత్నాలను మరింతపెంచాలని పిలుపునిచ్చాయి. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన సరఫరా సజావుగా కొనసాగేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి.


**ఏకపక్ష టారిఫ్‌లపై బ్రిక్స్ ఆందోళన**

ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో పెరుగుతున్న ఏకపక్ష టారిఫ్‌లు, నాన్‌టారిఫ్ చర్యలు వాణిజ్యాన్ని వక్రీకరిస్తున్నాయని బ్రిక్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది.టారిఫ్‌లు, నాన్‌టారిఫ్ చర్యలను విచక్షణారహితంగా పెంచడం, పర్యావరణ లక్ష్యాల పేరుతో రక్షణాత్మక వాణిజ్య విధానాలను అమలు చేయడం వల్ల ప్రపంచ వాణిజ్యం మరింత తగ్గే ప్రమాదం ఉందని తెలిపింది.ఇలాంటి చర్యలు ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించడంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్యకార్యకలాపాల్లో అనిశ్చితిని పెంచుతాయని పేర్కొంది. ఇప్పటికే ఉన్న ఆర్థిక అసమానతలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని, ప్రపంచ ఆర్థిక అభివృద్ధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించింది.డబ్ల్యుటిఒ మరింత స్పందించేలా కలిసి పనిచేస్తామని, వాణిజ్య అంతరాయాలు, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల అవసరాలకు అనుగుణంగా సంస్థను బలోపేతం చేయాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. ఢిల్లీ డిక్లరేషన్ ముసాయిదాపై చర్చలు చివరి నిమిషం వరకు కొనసాగాయి. ప్రారంభంలో ఇరాన్, యూఏఈ తమ తమ వైఖరులపై గట్టిగా నిలబడటంతో ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా మారింది. బ్రిక్స్ ఒక ఏకాభిప్రాయ ఆధారిత కూటమి కావడంతో ఏ ఒక్క సభ్య దేశమైనా తుది ఉమ్మడి ప్రకటనను అడ్డుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో జరిగిన వరుస చర్చలఅనంతరం డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం కుదిరింది.

**జిన్‌పింగ్‌తో మోడీ కరచాలనం**

సదస్సు ప్రారంభ సెషన్ ముగిసిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కరచాలనం చేశారు.ముగింపు ప్రసంగంలో మోడీ మాట్లాడుతూ.. మారుతున్న ప్రపంచాన్ని పాతకాలపు సంస్థలతో నడిపించడం సాధ్యం కాదని అన్నారు. సంస్థల్లో ప్రాతినిధ్యం, స్పందన, నియమాల రూపకల్పన విషయంలో సంస్కరణలు అత్యవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధిలో, వాటిని నియంత్రించే నియమాల రూపకల్పనలో గ్లోబల్ సౌత్‌కు సమాన భాగస్వామ్యం ఉండాలని మోడీ స్పష్టం చేశారు.నిర్ణయాలకు, వాటి అమలు ఫలితాలకు మధ్య ఉన్న అంతరాన్ని భాగస్వామ్యం, సమష్టి చర్యల ద్వారా తగ్గించాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. ఈ రోజు ఆమోదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశను చూపుతోంది. ఈ తీర్మానాలను స్పష్టమైన ఫలితాలుగా మార్చడం ఇప్పుడు మన బాధ్యత'అని మోడీ పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం



## వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

### 15నుండి వాహనసేవలు ఆరంభం

### రేపు అంకురార్పణతో శ్రీకారం

**తిరుమల,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వెంకటేశ్వరస్వామికి జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిగా 15వతేదీ నుండి 23వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆ తరువాత అక్టోబర్ 12నుండి 20వరకు నవరాత్రి బ్రహ్మో త్సవాలు జరుగుతాయి. తొలివిడత సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా సోమవారం రాత్రి అంకురార్పణతో శ్రీకారం చుడతారు. 15వతేదీ మంగళవారం రాత్రి తొలివాహనంగా పెద్దశేషవా హన సేవతో మొదలై చివరగా 23వతేదీ ఉదయం చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తుల రద్దీకి తగ్గట్లు టిటిడి పెద్దలు, అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు. సోమవారం సాయంత్రం జరిగే అంకురార్పణతో మొదలవుతున్నాయి.

**15న ధ్వజారోహణం:**వైఖానస ఆగమశాస్త్రంగా గరుడకేతన ప్రతిష్ట, కంకణ ధారణ, శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్పస్వామి సమక్షంలో ఆలయ అర్చకులు,జీయ్యంగార్లు,వేదపండితులు వేదమంత్రోచ్చరణల మధ్య మంగళవాయిద్యాలు మోగుతుండగా బంగారుధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు.

**తొలివాహనం 'పెద్దశేషవాహనం':** బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజురాత్రి (మంగళవారం)తొలివా హనంగా ఏడుతలల శేషునిపై ఉభయనాంచారులతో కలసి విహారిస్తారు. **15న సిఎం పట్టువస్త్రాలు:** తిరుమలేశునికి రాష్ట్రప్రభుత్వం తరపున సిఎం చంద్రబాబునాయుడు 15వతేదీ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇందుకోసం టిటిడి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీవారిని దర్శించుకుని అనంతరం 2027 సంవత్సరం టిటిడి క్యాలండర్లు, డైరీలు విడుదల చేస్తారు. 16న తిరుమలలో ఆధునీకరించిన ఎస్వీమ్యూజియంను, బయోగ్యాస్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. సిఎం రాకకు టిటిడి ,జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లులో తలమునకలైంది.



## ధ్వజారోహణానికి దర్భ చాప,తాడు సిద్ధం

**తిరుమల,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిఘట్టంగా ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భ చాప తాడును టిటిడి అటవీ విభాగం కార్యాలయం సిద్ధం చేసింది. శనివారం ఉదయం టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, డిఎఫ్ఒ ఫణి కుమార్ నాయుడు సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలోపల రంగనాయకుల మండపంలోని శేషవాహనంపై దర్భతో తయారుచేసిన చాప, తాడును ఉంచారు. ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లుండి మంగళవారం 15వతేదీ సాయంత్రం 6.21 గంటల నుండి 6.35 గంటల వరకు మీనలగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు. వీటి తయారీ కోసం టిటిడి అటవీ శాఖ 10రోజుల ముందునుండే కసరత్తు చేస్తుంది. దీన్లో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భను ఉపయోగిస్తారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో విష్ణు దర్భను టిటిడి అటవీ సిబ్బంది సేకరించారు. దీన్ని తిరుమలకు తెచ్చి తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెట్టి బాగా శుభ్రపరిచి, చాప, తాడు తయారు చేశారు. అటవీశాఖ సిబ్బంది 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో 200 కిలోల బరువైన దర్భ చాప, 250 మీటర్ల పొడవైన 100 కిలోల తాడు సిద్ధం చేశారు. ఋగ్వేదం ఋకా పవిత్ర భవతు అని దర్భను శుద్ధికరమైనదిగా చెప్పగా, యజుర్వేదంలో దర్భాసనంపై కూర్చొని చేసే ఉపాసన శ్రేష్ఠఫలితాలను ఇస్తుందని పేర్కొంది.




## శ్రీవారికి గద్వాల జోడు పంచెలు

### అందించే భాగ్యం మా పూర్వజన్మసుకృతం

### గద్వాల్ సంస్థానం మునిమనవడు కృష్ణరామభూపాల్

**తిరుమల,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** అనాదికాలంనుండి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి తమ వంశంతరపున జోడు పంచెలు అందించే భాగ్యం కలగడం తమ పూర్వజన్మసుకృతమని గద్వాల్ సంస్థానం మహారాణి ఆదిలక్ష్మి మునిమనవడు కృష్ణరామభూపాల్ తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులుపాటు జరిగే మలయప్పస్వామి వాహనసేవలకు ఉత్సవ మూర్తులకు అలంకరించే గద్వాల్ జోడు పంచెలు, పట్టువస్త్రాలు చేనేత కళాకారులు భక్తితో నేయడం జరుగుతుందన్నారు. ఆ పవిత్రమైన పట్టువస్త్రాలను స్వామివారికి బ్రహ్మోత్సవాల ముందు సమర్పించుకునే భాగ్యం తమ అదృష్టమన్నారు. తెలంగాణ జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన చేనేత కళాకారులు బ్రహ్మోత్సవాల వేళ శ్రీవారి ఉత్సవ మూర్తులకు అలంకరించడానికి పట్టు జరితో కూడిన జోడు పంచెలను తయారు చేస్తారు. ఈ ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకమైన "గద్వాల జోడు పంచెలు" పట్టు వస్త్రాలను సిద్ధం చేశారు. గద్వాల సంస్థానాధీశుల కాలం (దాదాపు 400 ఏళ్ల క్రితం) నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గద్వాల చేనేతవస్త్రాలను సమర్పించే సాంప్రదాయం కొనసాగుతోంది.అత్యంత భక్తిశ్రద్ధలతో నియమ నిష్ఠలతో గద్వాల చేనేత కార్మికులు ఈ జోడు పంచెలను ఉత్తరీయాలను బ్రహ్మోత్సవాల సమయంలో జరిగేవాహనసేవల్లో స్వామివారికి అలంకరిస్తారు.శనివారం ఉదయం కృష్ణరామభూపాల్ జోడుపంచెలను టిటిడి ఆలయ అధికారులకు అందజేశారు.



## విపరీత రద్దీతో నేడు బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసి మాసం ఆరంభానికి ముందే వరుససెలవులతో తిరుమలనిండా భక్తులు నిండిపోయారు. శనివారం ఉదయం 4గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల శిలాతోరణంవరకు చేరాయి సాధారణ సర్వదర్శనం కోసం 28గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంత రాయంగా సేవలందిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 51వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సిఎం చంద్రబాబును ఆహ్వానించిన టిటిడి

### సిఎంకు స్వయంగా ఆహ్వాన పత్రికను అందించిన టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు



**అమరావతి, సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు అధికారికంగా ఆహ్వానించారు. అమరావతి సమీపంలోని ఉండవల్లి వద్ద గల సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని టీటీడీ చైర్మన్, ఈవోలతో పాటు బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకీదేవి కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు సీఎం చంద్రబాబుకు మంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను బహూకరించారు. అనంతరం తిరుమలలో త్వరలో ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై టీటీడీ నాయకత్వంతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దేశ విదేశాల నుంచి విచ్చేసే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ, లడ్డూ ప్రసాదాల నిల్వ, భద్రత మరియు పారిశుధ్య నిర్వహణపై సీఎం దిశానిర్దేశం చేశారు. తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15నుంచి 23వ తేదీ వరకు వైభవంగా జరగనుండగా, ఆతర్వాత నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ సాలకట్ల బ్రహ్మో త్సవాల వేళ స్వామి వారు వివిధ అలంకారాల్లో చేసే వాహన సేవలు, విశేష ఉత్సవాలు, ముఖ్యమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయ వేళలను భక్తులకు తెలియజేసేందుకు ఇప్పటికే ప్రత్యేక బుక్‌లెట్‌ను టీటీడీ విడుదల చేసింది.ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణతో సహా గరుడసేవ వంటి కీలక ఘట్టాల నిర్వహణకు దేవస్థానం సర్వం సిద్ధం చేస్తోంది.

# గురువాయూరప్పను దర్శించుకున్న డి.సిఎం పవన్



వేకువజామున పవిత్ర నిర్మాల్య సేవ

### తైలాభిషేకం, వాకచార్థు, శంఖాభిషేకం సేవల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి

**విజయవాడ, సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** కేరళం రాష్ట్రం, త్రిస్సూర్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం గురువాయూర్ బాలకృష్ణుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ దర్శించుకున్నారు. గురువాయూర్ ఆలయంలో అత్యంత పవిత్ర సేవగా భావించే వేకువజాము నిర్మాల్య దర్శనంలో ఆయన పాల్గొన్నారు. ముందురోజు చేసిన అలంకరణతో స్వామిని చేసుకునే తొలి దర్శనాన్ని నిర్మాల్య సేవగా పిలుస్తారు. ఈ సేవ కోసం శనివారం ఉదయం వేకువజామున 3 గంటలకు పవన్ కళ్యాణ్ గురువాయూర్ ఆలయానికి చేరుకున్నారు. దాదాపు 30 నిమిషాలపాటు ఈ విశిష్ట సేవలో పాల్గొని తరించారు. అంతకు ముందు గురువాయూర్ చేరుకున్న పవన్‌కు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. దక్షిణ ముఖద్వారం నుంచి ఆలయం లోపలికి ప్రవేశించిన ఆయన, స్వామి నిర్మాల్య దర్శనం చేసుకున్నారు. గర్భాలయంలో మూల విరాట్టుకి నిర్వహించే ప్రత్యేక కైంకర్యాలు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు. నిర్మాల్య దర్శనానంతరం సంప్రదాయం ప్రకారం నువ్వుల నూనెతో తైలాభిషేకం చేస్తారు. శంఖాభిషేకం, వాకచార్థు సేవలు నిర్వహిస్తారు. స్వామి వారికి ముందు రోజు అలంకరించిన గంధాన్ని తొలగించి అభ్యంగన స్నానం చేయించే అద్భుత సేవ గురించి ఆలయ అధికారులు పవన్ కళ్యాణ్ వివరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పవన్ పట్టువస్త్రాలు సమర్పించారు.అనంతరం నైరుతిలో ఉన్న వినాయకుడిని దర్శించుకుని, ఆలయ ఆచారాలను అనుసరిస్తూ గుడి వెనుక భాగంలో సాష్టాంగం చేశారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి, అనంత పద్మనాభ స్వామి, భగవతి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురువాయూర్ ఆలయ ప్రదక్షణలో అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గురువా యూర్ మేల్ శాంతితోపాటు ఇతర ప్రధాన అర్చకులు పవన్ కళ్యాణ్ గారిని ఆశీర్వదించి, స్వామివారి కళభం, తదితర ప్రసాదాలు అందజేశారు. పవన్ కళ్యాణ్ గారికి ఆయుర్వేద థెరపీ చేసిన వైద్యులు ఆయనతోపాటు గురు వాయూర్ బాలకృష్ణ స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

# పౌల్ట్రీ రైతుల సంక్షేమానికి పెద్దపీట

### రూ.657 కోట్ల ప్యాకేజీతో రంగం బలోపేతం,పాలసీని వేగంగా అమలు చేస్తాం

### యేటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లు

### ఆధునిక పౌల్ట్రీ ఫారాలకు భారీ ప్రోత్సాహకాలు: మంత్రి అచ్చెన్నాయుడు



శనివారం విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడిని సన్మానిస్తున్న పౌల్ట్రీ అసోసియేషన్ సభ్యులు

**అమరావతి, సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు అండగా నిలిచేందుకు ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు తెలిపారు. పాలసీకి ఆమోదం తెలిపిన సందర్భంగా పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విజయవాడలోని కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలసీని త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని వివరించారు. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన ప్రోత్సాహకాల కోసం రూ.209 కోట్లు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రూ.152.18 కోట్లు, పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేయనున్న కార్యక్రమాలకు రూ.296 కోట్లు కేటాయించనున్నారు. కోళ్ల ఫారాలు, హేచరీల మౌలిక వసతుల అభివృద్ధికి తీసుకునే రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ కల్పించనున్నామని, ఇందు కోసం మూడేళ్ల కాలానికి రూ.72 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పౌల్ట్రీ రైతుల విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు లోటెన్షన్ కోళ్ల ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు యూ నిట్‌కు రూ.4.75 చొప్పున టారిఫ్‌ను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ పౌల్ట్రీ షెడ్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు క్యాపిటల్ సబ్సిడీ అందించనున్నాం. ఇప్పటికే ఉన్న పౌల్ట్రీ షెడ్లను ఆధునీకరించేందుకు కూడా 25శాతం వరకు, గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు సబ్సిడీఅందించేలా ప్రతిపాదించామన్నారు. అర్హత కలిగిన నిది పౌల్ట్రీ ఫారాలకు టర్మ్ లోన్లపై వడ్డీ సబ్సిడీతో పాటు విద్యుత్ చార్జీలపై యూనిట్‌కు రూ.2వరకు, సంవత్సరానికి గరిష్ఠంగా రూ.10 లక్షలవరకు, మూడు సంవత్సరాల పాటు విద్యుత్ టారిఫ్ సబ్సిడీ అందించనున్నామన్నారు. అలాగే నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద అర్హత కలిగిన ప్రాజెక్టులకు 50శాతం వరకు క్యాపిటల్ సబ్సిడీ,గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు అందించే అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. పౌల్ట్రీ ఉత్పత్తులకు మెరుగైన మార్కె టింగ్ అవకా శాలు కల్పించేందుకు ఎగ్, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా చిత్తూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలను కేంద్రాలుగా చేసుకుని చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

# పాలకొల్లు అభివృద్ధికి రూ.1,170కోట్లు

### రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం: మంత్రి నిమ్మల



శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు, సెప్టెంబరు12, ప్రభాతవార్త:** పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. గత రెండేళ్లలో నియోజకవర్గానికి రూ.1,170 కోట్ల నిధులు తీసుకొచ్చామని తెలిపారు. పాలకొల్లు లైన్స్ కమ్యూనిటీ హాల్లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. పూర్త యిన, పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షి ంచారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరి ష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదల, సంక్షేమ పథకాలను అర్హులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహకారంతోనే పెద్ద ఎత్తున నిధులు తీసుకురాగలిగామని చెప్పారు. ఇరిగేషన్‌కు రూ.218 కోట్లు, మున్సిపాలిటీకి రూ.90 కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.84కోట్లు, పంచాయతీరాజ్‌కు రూ.66 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌కు రూ.296 కోట్లు సహా వివిధ శాఖలకు నిధులు సమకూర్చినట్లు వివరించారు. గత ఐదేళ్ల అధికారంలో ఉండి ప్రజలను పట్టించుకోలేని గొడ్డల పార్టీకి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ విధ్వంసంతో పాలన సాగించిందని, నేడు కూటమి ప్రభుత్వం వికాసం వైపు పరుగులు పెడుతోందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో పలువురు జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు,

# సామాజిక మాధ్యమాల్లో 1980 ట్రెండ్‌లో సిఎం చంద్రబాబు



ఎఫ్‌బిలో 1980ల ట్రెండ్‌లో భాగంగా సిఎం చంద్రబాబు పోస్టు చేసిన ఫోటోలు

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేకించి ఎఫ్‌బిలో 1980ల ట్రెండ్ పేరుతో ఒక కొత్త ట్రెండ్ నడుస్తోంది. రాజకీయ నాయకులు, సెలబ్రిటీలతో పాటు సాధారణ ప్రజలు కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తమ 1980ల నాటి ఫోటోలను సృష్టించుకుని పో స్ట్ చేస్తున్నారు. అయితే ఈ ట్రెండ్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూ త్నంగా పాలుపం చుకున్నారు. ఏఐ ఫోటోలకు బదులుగా 1980ల నాటి తన అసలైన ఫోటో లను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు.

తన సోషల్ మీడియా ఖాతాలో చంద్రబాబు మూడు ఫోటోలను పంచుకున్నారు. అందులో ఒకటి తన యవ్వనంలో తీయించుకున్న పాస్‌పోర్ట్ సైజు ఫోటో కాగా, మరొకటి సినీ దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావుతో కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొ న్నప్పటిది.

ఇంకో ఫోటోలో తన సొంత నియో జకవర్గమైన చంద్రగిరిలో బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం ఉంది.

1980ల ట్రెండ్‌లో అసలైన వాటితో జతకలుపుతున్నాను. ఆ దశాబ్దానికి చెందిన నా కొన్ని నిజమైన ఫోటోలు ఇవి అనే వ్యాఖ్యను ఈ పోస్టుకు జోడించారు. చంద్రబాబు తన పాత జ్ఞాపకాలను పంచుకో వడంపై నెటిజన్లు ఆసక్తికరంగా స్పందిస్తున్నారు.

మరోవైపు ఆయన తనయుడు, మంత్రి నారా లోకేశ్ మాత్రం ఈ ట్రెండ్‌ను అనుసరించారు. ఏఐ సాయంతో రూపొందించిన తన 1980ల నాటి ఫోటోను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు.



వినాయక వ్రతకల్పం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్

## గణేశ మండపాలకు ఉచిత విద్యుత్

### మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉత్సవ సమితి

**అమరావతి,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** వినాయక చవితి పర్వదినాన్ని మరింత శోభా యమానంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు సింగిల్ విండో ద్వారా అనుమతులకు చొరవ చూపిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఆంధ్రపదేశ్ గణేష్ ఉత్సవ సమితి కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు సచివాలయంలో మంత్రి లోకేష్ ను కలిసిన ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు.. వినాయక మండపాలకు ఉచిత్ విద్యుత్, సింగిల్ విండో అనుమతుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గణేష్ ఉత్సవాలు విజయవంతం కావడానికి వివిధ ప్రభుత్వ విభాగాలు ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితితో సమన్వయం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసేలా వినాయక మండపాల్లో రెండుపూటలా పూజానంతరం వరుణజపం చేయడానికి ముద్రించిన సంకల్పం, బీజాక్షర మంత్రం కరపత్రాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో గణేష్ మండపాల వద్ద ఏర్పాటుచేసేందుకు కావల్సిన కాషాయధ్వజాలు, పర్యావరణ హిత బ్యానర్లు, వినాయక వ్రతకల్పం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరమాచినేని రంగ ప్రసాద్, బీవీ రమణ కుమార్, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, కార్యదర్శి వలివర్తి దుర్గాప్రసాద్, ప్రభుత్వ సంబంధాల కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## డిఎస్సీ నియామకాల్లో అర్హతకు పెద్దపీట: మంత్రి లోకేష్

**అమరావతి,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** డీఎస్సీ నియామకాల్లో కూటమి ప్రభుత్వం అర్హతకు పెద్దపీట వేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కానీ వైఎస్సార్సీపీ మాత్రం ఫేక్ ప్రచారంతో క్రీడాకారులను అవమానిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేషనల్ ఛాంపియన్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్ పెద్ద అప్పలరాజుకు డీఎస్సీలో టీచర్ ఉద్యోగం లభించడాన్ని వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని లోకేశ్ మండిపడ్డారు. ఆయన సెమీఫైనల్ పోరాటానికి సంబంధించిన వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించే ప్రచారాన్ని జగన్ ఇప్పటికైనా ఆపాలని హితవు పలికారు. అసలు వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసేలా పెద్ద అప్పలరాజుపై ఫేక్ ప్రచారం అసలు వాస్తవం పేరుతో లోకేశ్ ఎక్స్ వేదికగా వీడియోను రిలీజ్ చేశారు. మెగా డీఎస్సీ 2025 నియామకంపై వైఎస్సార్సీపీ బురద జల్లుతూనే ఉం. అయితే ఈ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయని అర్హత లేనివారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపణలు గుప్పిస్తోందన్నారు.

## గణేశ ఉత్సవాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**విజయవాడ, సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. రాష్ట్రంలోని జిల్లాల ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాలు, ఊరేగింపులకు అనుమతులపై సుదీర్ఘంగా చర్చించారు. అనుమతుల కోసం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానంపై ఉత్సవ కమిటీలు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మండపాలు, ఊరేగింపుల విషయంలో నిబంధనలను ప్రజలకు వివరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిన్న సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన శాంతిభద్రతల సమీక్షలోని అంశాలపై కూడా ఎస్పీలతో చర్చించిన అనిత శాంతిభద్రతలపరిరక్షణలో ఎక్కడా నిరక్ష్యాన్లికి తావులేదని స్పష్టం చేశారు.

## 21వరకు ఎక్సైజ్ షాపుల రెన్యువల్

### 3,736మద్యం షాపులకు షెడ్యూల్ ఖరారు

### 30న రెన్యువల్ కాని షాపులకు లాటరీ

**అమరావతి, సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని 3,736 రిటైల్ మద్యం షాపుల రెన్యూవల్‌కు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. శనివారం నుంచి సెప్టెంబర్ 21 వరకు ఆరు పనిదినాల్లో ప్రస్తుత లైసెన్స్‌దారుల నుంచి రెన్యూవల్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సెప్టెంబర్ 22న కొత్త దరఖాస్తులకు గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించి, అదే రోజు నుంచి సెప్టెంబర్ 29 వరకు ఏడు పనిదినాల్లో కొత్త దరఖాస్తులు స్వీకరి స్తారు. సెప్టెంబర్ 30నలాటరీ నిర్వహించనున్నారు. రెన్యూవల్‌కు సంబంధించిన గెజిట్‌నంబర్లను సంబంధిత కలెక్టరేట్ల నుంచి ఎక్సైజ్ శాఖ ఇప్పటికే తీసుకుంది.శనివారం రెన్యూవల్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రచురించారు.మరో ఏడాదిపాటు షాపులను కొనసాగించాలనుకునే ప్రస్తుత లైసెన్స్‌దారులు నిర్ణీతగడువులో రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

## ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

### శ్రీకాకుళం జీజీహెచ్‌లో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం

**శ్రీకాకుళం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం వర్చువల్ విధానంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బ్లాక్‌ను ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు. ఈ మేరకు ఢిల్లీలోని కార్యాలయం నుండి తన సందేశాన్ని విడుదల చేశారు. ఈ బ్లాక్ అందుబాటులోకి రావడంతో అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో చికిత్స అందించే జీజీహెచ్ సామర్థ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులు, శ్రీకాకుళంజిల్లా ప్రజలకు కేంద్రమంత్రి ఈ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది బోయింగ్ సంస్థ సహకారంతో సుమారు రూ.45లక్షల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి అందించామని చెప్పారు. అదేవిధంగా ఐఓసీఎల్ సహకారంతో సుమారు రూ.4.50 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలను అందించేందుకు ఎంఓయూ పూర్తయిందని, ఈ పరికరాలను త్వరలోనే ఆసుపత్రికి తీసుకు రానున్నామని తెలిపారు. జీజీహెచ్‌లో లెక్చర్ హాల్, ఆడిటోరియం, హాస్టల్ బ్లాకులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సుమారు రూ.2 కోట్ల విలువైన ఫర్నిచర్ అవసరాలను కూడా పరిష్కరించి, వైద్య విద్యార్థులు, సిబ్బంది, ప్రజలకు మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



## శ్రీవారి దర్శనంతో ఆనందం: పలువురు ప్రముఖులు

**తిరుమల,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవడం మనసు ఆనందంగా ఉందని ప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం తిరుమలకు అమరరాజాగ్రూప్స్ ఛైర్మన్ గల్లా రామ చంద్ర నాయుడు,ఎంపి భాష్యం రామకృష్ణ, మంత్రి కొండపల్లి శ్రీనివాసులు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కెఎస్ శ్రీనివాసరాజు ఆలయంలోనికి చేరుకు న్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు.ఆలయ అర్చకులు వేదాశీర్వచనంచేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తానంటూ ఈ ప్రాంతానికి చరిత్రలో నిలిచిపోవాలన్న సంకల్పంతో వెలిగొండ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భావోద్వేగానికి గురయ్యారు. ఇన్ని పరిణామాల అనంతరం తిరిగి ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయడంతో మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికారు. శంకుస్థాపన చేసిన నాయకుడే ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించడం వెలిగొండ చరిత్రలో ప్రత్యేకఘట్టంగా నిలి చింది. కృష్ణా జలాలు సొరంగాల ద్వారా నల్లమల సాగరకు చేరడంతో ఒకప్పుడు కరవుతో అల్లాడిన ప్రాంతాలు సాగునీటి ఆశలు చిగురించాయి. తాగునీటి సమస్య కూడా పరిష్కారం లభించే అవకాశం ఏర్పడింది. రైతుల పొలా లకు నీళ్లు చేరి పంటలతో పచ్చబడితే గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం ప్రజల్లోనెలకొంది. వెలిగొండ ఇక ఒక తాగునీటి ప్రాజెక్టు కాదు. మూడు దశాబ్దాల రైతు కలకు ప్రతిరూపం. కరవు నేలపై కృష్ణమ్మ జలదారలను పారించిన అభివృద్ధి చరిత్రకు ప్రతీకగా నిలిచింది. వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేక టన్నల్ బోరింగ్ మిషన్లతో 19 కిలోమీటర్ల సొరంగాల నిర్మాణం. ఆధునిక సాంకేతికతకు ప్రతీకగా వెలిగొండ ప్రాజెక్ట్ నిలిచింది. మూడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం రైతాంగం ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు అనేక ప్రత్యేకతల సమాహారంగా ఆవిర్భ వించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూగర్భంలో భారీ సొరంగాలను నిర్మించడం నుంచి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తరలించే విధానం వరకు ప్రాజెక్టులో అడుగడుగునా ఇంజినీరింగ్ అద్భుతాలు కనిపిస్తాయి. వెలిగొండ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది భారీ టన్నల్ బోరింగ్ మిషన్ల (టియంబి) వినియోగం.

# మూడు దశాబ్దాల కలకు సాకారం వెలిగొండ!

**మూల అల్లూరిరెడ్డి**

వ్యవసాయానికే కాదు కనీసం తాగునీటికి కూడా పనికిరాని ప్రాంతాలను సస్యశ్యామలం చేసింది వెలిగొండ ప్రాజెక్ట్. ప్రారంభం నుంచి అనేక అవాంతరాలు, అడ్డంకులు, నిర్మాణంలో ఎన్నో సవాళ్లు అన్నింటినీ మించి చివరకు ప్రారంభోత్సవానికి నోచుకుంది. ఇది కలల సాకారం మాత్రమే కాదు కొన్ని తరాల ఎదురుచూపులకు అద్దంపట్టింది. పశ్చిమ ప్రాంత ప్రజలను కరవు దుర్భిక్షం, ఫ్లోరైడ్ కబళిస్తుంటాయి. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టించినా ప్రకృతి సహకరించక, తాగే గుక్కెడు మంచినీరు విషమని తెలిసినా తాగక తప్పని పరిస్థితి. నిన్నటి వరకు ఈ ప్రాంత ప్రజలది మూడు దశాబ్దాల పోరాట సాకారం కావడం, సొరంగ మార్గాల ద్వారా చిమ్ముకుంటూ కరవు నేలపై కృష్ణమ్మ పరుగులు పెడుతుంటే ఈ ప్రాంత ప్రజలు ఆనందడోలికల్లో తేలియాడుతున్నారు. కన్నీరు తప్ప.. సాగునీరు ఇరగని ఇక ప్రాంత అభాగ్యులకు కృష్ణమ్మ జలధారలు ఆనందభాష్పాలుగా మారాయి. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ కృష్ణమ్మ నీటిని నల్లమల సాగర్‌కు చేర్చే మహత్తర ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. సుమారు4.70 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగు నీరు అందించే బృహత్తర పథకంగా వెలిగొండ ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజలకు వర ప్రదాయినిగా మారింది. పశ్చిమ ప్రాంతంలో కరవు దుర్భిక్షం, ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తి కల్పించాలన్న సంకల్పం, అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ పూల సుబ్బయ్య నేతృత్వంలో నిర్వహించిన ఉద్యమాలను నెమరవేసుకున్న ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1996 మార్చి 5వ వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కొద్దిపాటి పనులతో సరిపెట్టి ఆ తర్వాత ప్రాజెక్టు పనులు ముందుకు సాగకపోవడంతో 2005లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు కూడా అప్పట్లో రూ. 4,000 కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించి పనులకు శ్రీకారం చుట్టారు. గొట్టిపడియ, కాకర్ల, సుంకేసుల డ్యామ్‌లతోపాటు రెండు సొరంగ నిర్మాణాలకు డిజైన్ చేసి జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో సొరంగ నిర్మాణ పనులు చేపట్టారు. నిర్ణీత వ్యవధిలోపు డ్యాములు పూర్తయిన సొరంగాల నిర్మాణాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. 2009 వరకు వెలిగొండ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగాయి. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నామమాత్రంగానే పనులతో సరిపెట్టాయి. 2019 నుంచి 24 మధ్యలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రాజెక్టు పూర్తయితుందని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్న



ఆవిరి అయిపోయాయి. 2024లో అధికారంలోకి వచ్చిన కోటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి శరవేగంగా పూర్తి చేశారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దగ్గరుండి సొరంగాల నిర్మాణ మార్గాలను శరవేగంగా పూర్తి చేయించేలా నిరంతరం కృషి చేశారు. ఒకవైపు గుత్తేదారులను, మరోవైపు అధికారులతో వరస సమీక్షా సమావేశాలు నిర్వహించి చెప్పిన గడువులోపు నీర్చి మాట నిలుపుకున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గుక్కెడు నీటి కోసం వందలాది అడుగులు తవ్విన అందుకొని దుస్థితి నుంచి జలజల పారుతున్న కృష్ణమ్మను చూసి మురిసిపోతున్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తానంటూ ఈ ప్రాంతానికి చరిత్రలో నిలిచిపోవాలన్న సంకల్పంతో వెలిగొండ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భావోద్వేగానికి గురయ్యారు. ఇన్ని పరిణామాల అనంతరం తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయడంతో మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికారు. శంకుస్థాపన చేసిన నాయకుడే ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించడం వెలిగొండ చరిత్రలో ప్రత్యేకఘట్టంగా నిలిచింది. కృష్ణా జలాలు సొరంగాల ద్వారా నల్లమల సాగరకు చేరడంతో ఒకప్పుడు కరవుతో అల్లాడిన ప్రాంతాలు సాగునీటి ఆశలు చిగురించాయి. తాగునీటి సమస్య కూడా పరిష్కారం లభించే అవకాశం ఏర్పడింది. రైతుల పొలాలకు నీళ్లు చేరి పంటలతో పచ్చబడితే గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం ప్రజల్లోనెలకొంది. వెలిగొండ ఇక ఒక తాగునీటి ప్రాజెక్టు కాదు. మూడు దశాబ్దాల రైతు కలకు ప్రతిరూపం. కరవు నేలపై కృష్ణమ్మ జలదారలను పారించిన అభివృద్ధి చరిత్రకు ప్రతీకగా నిలిచింది. వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేక టన్నల్ బోరింగ్ మిషన్లతో 19 కిలోమీటర్ల సొరంగాల నిర్మాణం. ఆధునిక సాంకేతికతకు ప్రతీకగా వెలిగొండ ప్రాజెక్ట్ నిలిచింది. మూడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం రైతాంగం ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు అనేక ప్రత్యేకతల సమాహారంగా ఆవిర్భవించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూగర్భంలో భారీ సొరంగాలను నిర్మించడం నుంచి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తరలించే విధానం వరకు ప్రాజెక్టులో అడుగడుగునా ఇంజినీరింగ్ అద్భుతాలు కనిపిస్తాయి. వెలిగొండ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది భారీ టన్నల్ బోరింగ్ మిషన్ల (టియంబి) వినియోగం. భూగర్భంలో సుదీర్ఘ దూరం వరకు సొరంగాలను అత్యాధునిక యంత్రాలతో తవ్వడం ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ఘట్టంగా నిలిచింది. దాదాపు 19కిలోమీటర్ల మేర సొరంగాల నిర్మాణం ప్రాజెక్టు సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అంతేకాదు మెతక నేలకు కెమికల్ ఫోమింగ్ వేశారు. సొరంగాల తవ్వకంలో ఎదురయ్యే మెతకనేల, బలహీన భూభాగాలను గట్టిపరిచేందుకు ప్రత్యేక ఆధునిక సాంకేతిక విధానాలను వినియోగించారు. ముఖ్యంగా కెమికల్ ఫోమింగ్ విధానం ద్వారా నేల స్వభావాన్ని నియంత్రిస్తూ టన్నల్ బోరింగ్ మిషన్ల పనితీరుకు అనుకూల పరిస్థితులు కల్పించారు. భూగర్భంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో ఈ సాంకేతికత కీలకంగానిలిచింది. సొరంగం తవ్విన వెంటనే దాని చుట్టూ ప్రత్యేక సిమెంట్ సెగ్మెంట్లను అమర్చడం మరోప్రత్యేకత. ఈ సెగ్మెంట్లు సొరంగ గోడలకు బలమైన రక్షణ కల్పిస్తూ నిర్మాణ స్థిరత్వాన్ని పెంచుతాయి. భూ గర్భంలో దీర్ఘకాలం సురక్షితంగా నీటిరవాణా జరిగేలా సొరంగ నిర్మాణాన్ని పటిష్టం చేయడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. సుంకేసుల, గోట్టిపడియ, కాకర్ల గ్యాపుల అనుసంధానంతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం రూపకల్పన ప్రత్యేకతను సంతరించుకుంది. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా సొరంగాలు, గ్యాపులు, కాలువల వ్యవస్థను సమన్వయం చేస్తూ కృష్ణా జలాలను నల్లమల్ల సాగరకు షేర్‌చేసేలా ప్రాజెక్టును తీర్చిదిద్దారు. వెలిగొండ ప్రాజెక్టులో మరోప్రధాన ప్రత్యేకత సొరంగాల ద్వారా కృష్ణా జలాలు నల్లమల సాగరకు చేరే విధానం. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేసే సమయంలో, నీటి ప్రవాహం సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు చేరేందుకు ప్రత్యేక పంపింగ్‌పై ఆధారపడకుండా రూపొందించిన వ్యవస్థవెలిగొండ ప్రాజెక్ట్. అదే గ్రామంలో కృష్ణా జలాలు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కొల్లంవాగు నుండి కరెంటు అవసరం లేకుండా నేరుగా నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి నీళ్లచేరడం ప్రత్యేకత. ఈ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం అత్యంతం అద్భుతాలే అద్భుతాలు. 1996లో శంకుస్థాపన చేయబడిన ఈ వెలిగొండప్రాజెక్టు మూడు దశాబ్దాలు గా కొనసాగి చివరికి 2026 ఆగస్టు31న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగడం ఓ ప్రత్యేకత. వెనుకబడిన ప్రాంతాల వరప్రసాదని, రైతుల ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్ట్ ఆచరణకు రావడం అరుదైనఅద్భుతంగా రైతులు అభివర్ణిస్తున్నారు. ●

---

పంజాబ్

# 'కెప్టెన్' వైపు చూపు!

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు ముదరడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఐదేళ్ళుగా అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ( ఆప్) ప్రజల అసంతృప్తిని బాగానే మూటకట్టుకొంది. రాజకీయంగా ఆ పార్టీ స్థానాన్ని భర్తీచేయడానికి ఏ పార్టీ తన బలాన్ని నిరూపించుకొంటుందన్నదే ప్రస్తుతం అందరిలో ఉన్న ప్రశ్న. ఆప్ ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకొనడానికి అటు బిజెపి, ఇటు అకాలీలు యధాశక్తి ప్రయత్నిస్తుండగా, మరో ప్రధాన పార్టీ కాంగ్రెస్ మాత్రం అంతర్గత కలహాలతోనే ఇంకా కునారిల్లుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న అమరిందర్ సింగ్ రాజా వారింగ్‌ను ఆ స్థానం నుంచి తొలగించాలనే డిమాండ్ చాలా కాలం నుంచే ఉన్నా తగిన ప్రత్యామ్నాయం దొరకని కారణంగా ఆయన నాయకత్వం లోనే ఎన్నికలకు వెళ్లాలని రెండు నెలల క్రితం పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఆ తర్వాత పార్టీలో అంతర్గత కలహాలు మరింత అధికమయ్యాయి. ఈ కారణంగా కెప్టెన్ అమరిందర్ సింగ్‌ను తిరిగి పార్టీలోకి రప్పించే యత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఆయన గతంలో పార్టీని అధికారంలోకి తేవడమేగాక రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి గట్టి కృషినే చేశారు. అయితే గత ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్‌ను వీడడంతో అధికారం కూడా చేతులు మారింది. మరో మాజీ సిఎం చరణ్ జిత్ సింగ్ చన్నీని ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించడానికి అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం పార్టీలో అసంతృప్తిని ఎగదోసింది. ఈ నేపథ్యంలో గతవారం సచిన్ పైలట్‌ను పంజాబ్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమించడం, అంతవరకు ఆ బాధ్యతలు నిర్వహించిన భూపేష్ భగేల్‌ను అసోం ఇన్చార్జిగా మార్చడం కూడా పార్టీ నేతలలో అసంతృప్తిని పెంచినట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరి మార్చిలో జరిగే ఎన్నికలకు చన్నీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని ఆయనమద్దతు దారులు కోరుతున్నారు. చన్నీ, వారింగ్ మధ్య వర్గపోరాటం తీవ్రమవుతున్న దశలో కెప్టెన్ అమరిందర్‌ను తిరిగి రప్పించడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఫలిస్తేనే కాంగ్రెస్‌కు విజయావకాశాలు మెరుగుపడతాయనిపిస్తుంది. జులై 31 నుంచి ఆగస్టు 8వరకు జరిగిన పార్టీ'హర్‌బూత్, కాంగ్రెస్ మజ్బూత్' ప్రచార కార్యక్రమంలో అంతర్గత కలహాలు మరింతగా ప్రస్ఫుటమయ్యాయి. మూడు నాలుగు వర్గాలుగా విడి పోయిన రాష్ట్ర కాంగ్రెస్ ను ఏకం చేయడానికి గతవారం సచిన్ పైలట్‌ను ఇన్చార్జిగా నియమించినట్లు అధిష్ఠానం చెబుతోంది. అయితే ఆయననియా మకాన్ని కూడా పార్టీలోని కొన్ని వర్గాలు వ్యతిరే కించడం ఇప్పుడు అధిష్ఠానానికి కొత్త సమస్యగా మారింది. రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి అయిన పైలట్‌కు సంక్షోభ పరిష్కర్తగా పేరున్నా, పంజాబ్‌లోని వర్గాలను ఏకతాటిపైకి తేవడంలో



కెప్టెన్ అమరిందర్ సింగ్

ఎంతవరకు కృతకృత్యులవుతారన్నదిసందేహమే. 2017లో కాంగ్రెస్ చివరిసారి అధికారంలోకి వచ్చినపుడు కెప్టెన్ అమరిందర్ సింగ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా పార్టీ ప్రకటించింది. అయితే ఈసారి సిఎం అభ్యర్థిపై నిర్ణయం ఎన్నికల ఫలితాల తర్వాతే ఉంటుందని పైలట్ అంటున్నారు. రాష్ట్రంలో అకాలీదళ్ ఇప్పుడు చాలా బలహీనపడింది. ప్రకాష్ బాదల్ ఉన్నప్పుడు బిజెపి అకాలీదళ్‌తో పొత్తు కుదుర్చుకుంది. కానీ ఆ తర్వాత ప్రజలు వారిని అధికారం నుంచి తొలగించారు. ఇప్పుడు ఆ రెండుపార్టీలు కలిసిపోటీ చేసే వాతావరణం కనిపిస్తోంది. ్ర 2022 ఎన్నికల్లో ఆప్ 92సీట్లతో అధి కారం కైవసం చేసుకొంది. కాంగ్రెస్ 18 సీట్లకే పరిమితమైంది. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావాలంటే చాలా గట్టిప్రయత్నమే చేయవలసి ఉంటుంది. తాజా సర్వే ప్రకారం ఆప్ సీట్లు 92 నుంచి 40, 50కి తగ్గవచ్చనీ, కాంగ్రెస్‌కు 18 నుంచి 35, 45కు పెరగవచ్చనీ విశ్లేషకులు అంటున్నారు. ఆప్‌కు 34 శాతం, కాంగ్రెస్‌కు 30 శాతం మద్దతు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. ఆప్‌కు క్రమంగా మద్దతు తగ్గుతున్నదనీ, అయినా ఆ మేరకు కాంగ్రెస్ పెంచుకోలేకపోతున్నదనీ అంటున్నారు. ఈ పరిస్థితిలో కెప్టెన్ అమరిందర్ సింగ్‌ను మళ్లీ పార్టీలోకి తేవడమే తగిన చర్యగా పార్టీభావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆయన 2021లో కాంగ్రెస్‌ను వీడి పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకొన్నారు. 22 ఆ పార్టీ బిజెపితో కలిసి పోటీ చేసింది. తర్వాత కొద్దిరోజులకే అమరిందర్ తన పార్టీని బిజెపిలో విలీనం చేసి దానిలో చేరారు. అయితే అక్కడ ఆయనకు తగిన ప్రాధాన్యత లభించకపోవడంతో కొంతకాలం నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. బిజెపిలో ఇమడలేని పరిస్థితిలో ఆయన కాలక్షేపం చేస్తున్నారనీ, అందువల్ల ఆయనను తిరిగి కాంగ్రెస్‌లోకి తేవడం తేలికనీ అంటున్నారు. అమరీందర్ పార్టీలోకి తిరిగి వస్తే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఉన్న సిక్కు ఇమేజ్ పెరిగే అవకాశం ఉంది. గతంలో రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవంరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిష్టను మళ్లీ పెంచవచ్చు. ముఖ్యంగా పాటియాలా, మాల్వా ప్రాంతాల్లో అమరీందర్‌కు ఇప్పటికీ చక్కనిమద్దతు ఉన్నదనే చెబుతున్నారు. బిజెపికి వెళ్లిన కాంగ్రెస్‌అనుకూల ఓట్లను తిరిగి ఆకర్షించే అవకాశం కూడా ఉం టుంది. చరణ్ జిత్ సింగ్ చన్నీ, రాజా వారింగ్ వంటి నేతల మధ్య విభేదాలు ఉండడంతో మధ్యేమార్గంగా అమరీందర్‌ను తిరిగి బరిలోకి తెస్తే సమస్య పరిష్కారమవుతుందని కాంగ్రెస్ అగ్రనాయకులు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఆయన కాంగ్రెస్‌లో చేరితే పార్టీ సీట్లు 60 దాటవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే చన్నీ, వారింగ్,అమరీందర్ మధ్య సమన్వయం సాధించడంలో పార్టీ ఎంత వరకు సఫలం కాగలదనే అంశం పైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కాంగ్రెస్ వ్యూహం ఎలా ఉంటుందో చూడాలి. ●

---

అమెరికా

# వారసత్వ పోరు షురూ!

**గన్ని మోహన్**

అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అనూహ్య ధోరణులు, ప్రపంచదేశాలపై ఆయన పోకడలతో మధ్యంతర ఎన్నికల్లోనే ఆయనకు చుక్కెదురయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి మధ్యప్రాచ్యంలో యుద్ధంపై అటు సెనేటర్లు, రిపబ్లికన్లు, ప్రతినిధుల సభలో సైతం ఆయనపట్ల విముఖత వ్యక్తం అవుతోంది. ఇటీవలి జరిగిన సర్వేల్లో ట్రంప్‌నకు రేటింగ్ కూడా పడిపోయింది. దీనికితోడు ఇప్పుడు వస్తున్న మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించాలంటే ట్రంప్ సైతం డాలర్లు ఎరవేస్తున్నారు. మిడ్‌టర్మ్ కోసమే అన్నట్లుగా ట్రంప్ ఐదువేల డాలర్లను 'ట్రంప్ డివిడెండ్' పేరిట ప్రకటించి ఓట్ల కొనుగోలు వ్యూహాలను ప్రారంభించారు. ఇతర దేశాల్లో అనుసరిస్తున్నట్లుగానే ఇప్పుడు అమెరికాలో కూడా ఓట్ల కొనుగోళ్ల ప్రారంభం అయినట్లు ఈ ట్రంప్ డివిడెండ్ స్పష్టంచేస్తోంది. కోర్టుల్లో మొట్టికాయలు, వీసా ఆంక్షలు వంటి వాటితో ట్రంప్‌రేటింగ్ మరింత క్షీణించింది. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీలో వారసత్వపోరుపై అప్పుడే చర్చలు మొదలయ్యాయి. రూబియో, డిసాంటిస్, క్రూజ్‌ల పేర్లు రేసులోకి వచ్చేసాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తర్వాత రిపబ్లికన్ పార్టీని నడిపించే నాయకుడు ఎవరనే దానిపై ఇప్పటి నుంచే చర్చలు మొదలయ్యాయి. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ 2028 అధ్యక్ష ఎన్నికలకు తొలి బలమైన పోటీదారుగా కనిపిస్తున్నారు. అయితే రిపబ్లికన్ ఓటర్లు,ప్రతినిధుల నుంచి స్పష్టమైన ఏకాభిప్రాయం రావాల్సి ఉంది. డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ మధ్యంతర ఎన్నికల కన్వెన్షన్‌లో వాన్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆయన ప్రసంగం సందర్భంగా జేడీ జేడీ జేడీ' అంటూ నినాదాలు భారీ ఎత్తున వినిపించాయి. జెడి48.. జెడి48.. అంటూ నినాదాలుచేయడం ద్వారా తదుపరి అమెరికా అధ్యక్షుడిగా వాన్స్‌ను చూడాలనే ఆకాంక్ష బలంగా వినిపించింది. అనంతరం ట్రంప్ కూడా తన ఉపాధ్యక్షుడిని ప్రశంసిస్తూ ఆయన చాలా ప్రతిభావంతుడని, చాలా మంచి పనిచేశాడని పేర్కొన్నారు. అయితే2028 ఎన్నికలపై వాన్స్ మాత్రం నేరుగా మాట్లాడేందుకు నిరాకరించారు. తన ప్రసంగం సమయంలో ఓ మద్దతుదారు జేడీ 48 అని నినదించగా వాన్స్ చిరునవ్వుతో స్పందిస్తూ ముందుగా ఈ నవంబర్లో మన బాధ్యతను పూర్తి చేయాలి. ఆ తర్వాత ఏం జరుగుతుందో ఆలోచిద్దాం అంటూ మధ్యంతర ఎన్నికల ప్రస్తావనతో అభిమానులను నిరాశపరిచారు. ట్రంప్ కేబినెట్‌లో ఉపాధ్యక్షుడిగా పనిచేస్తుండటం, ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండటం వాన్స్ ప్రధాన బలంగా మారినట్లు రిపబ్లికన్ ప్రతినిధులనుంచి వినిపిస్తోంది. వాన్స్‌ను ట్రంప్ భవిష్యత్ నాయకత్వం కోసం సిద్ధం చేస్తున్నట్లు వారు భావిస్తున్నారు. అందుకే ట్రంప్ వాన్స్‌ను ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఆయన ట్రంప్‌లా కాదు. ట్రంప్‌కు ఎవరూ సాటిరారు. కానీ వాన్స్ మెజార్టీ వర్గానికి చాలా ఇష్టం అని చెపుతున్నారు.



జెడివాన్స్

అయితే వాన్స్ ఒక్కరే రేసులో ఉన్ననాయకుడు కాదు. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్, టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రూజ్ పేర్లు కూడా రిపబ్లికన్ వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వాన్స్‌కు ప్రత్యామ్నాయంగా మార్కో రూబియోకు కొందరు రిపబ్లికన్ నేతలు, కార్యకర్తలు బలమైన మద్దతు ఇస్తున్నారు. హ్యూస్టన్‌కు చెందిన పెగ్గీ స్టాంటన్ రూబియో భవిష్యత్తులో అధ్యక్షుడు అవుతారని తాను చాలాకాలంగా భావిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ముప్పులు, కమ్యూనిజం వంటి అంశాలపై రూబియోకు మంచి అవగాహన ఉందని, ఆయనకు మంచి వాక్చాతుర్యం, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం ఉన్నాయని అధ్యక్షుడిగా రూబియో సమర్థుడని అభిప్రాయపడ్డారు. 2024లో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ట్రంప్తో పోటీ పడిన ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్‌కు కూడా పార్టీలో మద్దతు కొనసాగుతోంది. ఫ్లోరిడాలో ఆయన అమలు చేసిన విధానాలు అమెరికాకు ఒక మార్గదర్శకంగా నిలుస్తాయని చెపుతున్నారు. కొంతమంది రిపబ్లికన్ ఓటర్లు మాత్రం 2028లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్నది చివరకు ట్రంప్ ఎవరిని సమర్థిస్తారనే దానిపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. కొందరు రిపబ్లికన్లు అయితే వాన్స్,రూబియో మధ్య తేల్చుకోలేకపోతున్నామని ట్రంప్ ఎవరిని బలపరుస్తారో చూసి తన నిర్ణయం తీసుకునే అవకాశంఉందని తెలిపారు. ఇంకా చాలా సమయం ఉన్నందున ఇప్పుడే ఎవరికీ మద్దతు ప్రకటించడం తొందరపాటు నిర్ణయమని కొందరు అభిప్రాయపడుతున్నారు. పెన్సిల్వేనియాకు చెందిన స్టెఫానీ డోనోఫ్రీ మాట్లాడుతూ వాన్స్,రూబియో ఇద్దరూ నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని, ఇద్దరూ సమర్థులేనని అన్నారు. రిపబ్లికన్ పార్టీలో చర్చకు వస్తున్న పేర్ల జాబితా చూస్తే 2028 అధ్యక్ష రేసు ఎంతవరకు ఓపెన్‌గా ఉందో స్పష్టమవుతోంది. ప్రస్తుతం ట్రంప్ పార్టీలో అత్యంత ప్రభావశీల నాయకుడిగా కొనసాగుతున్నారు. 2028 అధ్యక్ష ఎన్నికల బరిలోకి ఇప్పటివరకు ఏ నాయకుడూ అధికారికంగా ప్రవేశించలేదు. కొంతమంది రిపబ్లికన్ కార్యకర్తలు టెక్సాస్ ప్రతినిధి బ్రాండన్ గిల్ పేరును కూడా ప్రస్తావిస్తున్నారు. కెంటకీ ప్రతినిధి థామస్ మాసీకి కూడా కొందరు మద్దతు తెలిపారు. టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రూజ్‌కు సైతం మద్దతు లభిస్తోంది. అయితే ట్రంప్‌నకు అత్యంత దగ్గరగా ఉండటం జేడీ వాన్స్‌కు స్పష్టమైన ప్రయోజనంగా కనిపిస్తోంది. ట్రంప్ లాగే వాన్స్ కూడా నేరుగా మాట్లాడే వ్యక్తి, వేగంగా ఆలోచించగల నాయకుడని పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే.. 2028 రిపబ్లికన్ అధ్యక్ష రేసులో జేడీవాన్స్ ముందంజలో ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, పోటీ ఇంకాప్రారంభ దశలోనే ఉంది. రూబియో, డిసాంటిస్,క్రూజ్‌తో పాటు మరికొందరు నేతలు కూడా రేసులోకి వచ్చే అవకాశం ఉండటంతో ట్రంప్ తర్వాత రిపబ్లికన్ పార్టీ పగ్గాలు ఎవరి చేతుల్లోకి వెళ్తాయన్నది ఇప్పుడే చెప్పడం కష్టమే. ●

---

# బ్రిక్స్ సమ్మిట్లో ఇండియా పాత్ర మరింత కీలకం



**రావులపాటి సీతారాంరావు**

ఏడేళ్ల తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సమ్మిట్లో పాల్గొనటానికి భారత దేశానికి రావటం శుభ సంకేతంగా భావించవచ్చు! అక్టోబరు 2019లో ప్రధాని నరేంద్ర మోడీతో తమిళనాడులోని మామిల్లాపురంలో సరదా సమావేశం జరిగింది. ఈసారి జరిగే సమావేశం సానుకూలమే! ఇరు దేశాల మధ్య ఏప్రిల్ 2020లో సరిహద్దు ఉద్రిక్తతలు మళ్లీ మొదలయ్యాయి! జూన్‌లో గాల్విన్ వ్యాలీలో సంఘర్షణలు జరగటంతో రెండు దేశాలూ ఎడమొహం పెడమొహంగా వున్నాయి! ఖజాన్లో అక్టోబరు 24న బ్రిక్స్ సమావేశం సందర్భంగా ఇద్దరు నాయకులు కలుసుకున్న తర్వాత క్రమేపీ సంబంధాలు మెరుగుపడ్డాయి. తర్వాత ఇద్దరు నాయకులూ చైనాలో జరిగిన యస్.సి.ఓ సమ్మిట్లో టియాన్ జిన్లో గత సంవత్సరం ఆగస్టులో కలుసుకున్నప్పుడు 'క్రమేపీ ఇరుదేశాల సంబంధాలు సన్నిహితమవుతున్నాయని, మంచి వాతావరణం కనపడుతున్నదని' హర్షం వెలిబుచ్చటం గమనార్హం! అయితే బీజింగ్లో హుషి షింగ్, డైరక్టర్ సౌత్ ఏషియా ఇనిస్టిట్యూట్, ఇరుదేశాల సంబంధాలు వ్యూహాత్మకంగా 'రిస్క్' ను తగ్గించటానికే కానీ వ్యూహాత్మక పునర్నిర్మాణానికి కాదు అన్న అభిప్రాయం వెలిబుచ్చటంతో చన్నీళ్ల మీద వేణ్నీళ్లు చల్లినట్లయింది! 'చైనా భారత్ దేశాలు, అమెరికా ఇరాన్ యుద్ధ నేపథ్యంలో, మరింత మెరుగుపర్చుకొని దగ్గరకు రావటమే మేలని విశ్లేషకులుభావిస్తున్నారు. దీనివల్ల రెండు దేశాలు ఒత్తిడులు, ఇతర దేశాల యుద్ధాల నేపథ్యంలో తగ్గించుకోవటమే కాకుండా, ప్రపంచ శాంతి నెలకొల్పటానికి సరియైన మార్గదర్శకత్వాన్ని యిచ్చిన వారవుతారు గూడా! భారత్‌కు ఈ బ్రిక్స్ సమావేశం 'బ్రిక్స్' ఒరిజినల్ ఐడియాను వినియోగించుకొనే అవకాశం కల్పిస్తుంది! ప్రారంభంలో ఏవిధంగా కొన్ని ఆశయాలతో బ్రిక్స్ ఏర్పడిందో, నెరవేర్చకుండా దారి తప్పింది! ఢిల్లీ సమావేశంలో పునరాలోచనతో గాడితప్పిన ఆశయాల బండిని తిరిగి అసలు మార్గానికి మళ్లించే అవకాశం సద్వినియోగం చేసుకోవాలి! దృఢమైన సంకల్పంతో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా అభివృద్ధి మార్గంలో నడుస్తున్న దేశాలుగా, దగ్గ రకు 'బ్రిక్స్ సమ్మిట్'గా వచ్చాయి! ఈ సమ్మిట్ వల్ల నిజమైన ఆర్థికాభివృద్ధి తోపాటు దేశాలలో శాంతి సుస్థిరతను సాధించే ప్రయత్నంలో ఇండియా చాలా ఉత్సాహంగా 2012లో మొదటి సమ్మిట్‌ను నిర్వహించే దేశంగా ముందుకు వచ్చింది! 'గ్లోబల్ స్టెబిలిటీ, సెక్యూ రిటీ, ప్రోస్పరిటీ' లపై దృష్టి పెట్టా లని ఆశయ సాధనలో భాగంగా 'బ్రిక్స్' నిర్ణయించుకుంది. రష్యా అధ్యక్షుడు వాల్డిమిర్ పుతిన్ శుక్రవారం సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చినప్పుడు ప్రధాని మోడీ ఒకే కారులో ప్రయాణం చేశారు. దౌత్యమే సరియైన దారి అనివారు భావిస్తున్నారు. వివాదాల పరిష్కరంలో తోడుగా వారు ఉండటం తథ్యం. యుయన్ సెక్రటరీ జనరల్ కూడా సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. పుతిన్ మోడీ ద్వైపాక్షిక సమా వేశంలో కీలక ప్రాంతీయ అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. మాస్కోను సందర్శించడానికి మోడీ అంగీకరించారు. ఈ ఆహ్వానం మోడీ భారత్ రష్యాను విలువైన స్నేహదేశంగానే భావిస్తున్నదని అనటా నికి తార్కాణంగా నిలుస్తుంది. సుస్థిరత, సహకారం బ్రిక్స్ లక్ష్యంగా బ్రిక్స్ కార్యాచరణ ప్రకటించింది. సంక్షోభాలను తట్టుకోవటమే ప్రథమ ప్రాధాన్యతగా ఈ సమ్మిట్ గుర్తించింది. ఈ సమ్మిట్ చాలా క్లిష్టపరిస్థితుల నేపథ్యంలో జరగబో తున్నది. ఎనర్జీ వ్యవసాయం సప్లయి చైన్ వెస్ట్ ఏషియా, ఉక్రెయిన్ యుద్ధాల వల్ల దాదాపు తెగిపోయింది. దానిని పునరుద్ధరించేందుకు





*నిజానికి భారత్ కొన్నిబలమైన దేశాలు, ఈ వెసులుబాటు కుదుర్చుకోవటానికి అంగీ కరించేందుకు కొంత తెర వెనుక ప్రయత్నాలు చేసినట్లు, అంతర్జాతీయ ఆర్థిక నిపు ణులు విశ్లేషిస్తున్నారు. 2018 బ్రిక్స్ సమ్మిట్ (సౌత్ ఆఫ్రికాలో జరిగింది) 'రిఫార్మ్డ్ మల్టీ లేటరిలి జం'ను గురించిన ఆలోచన మోడీ వ్యక్తపరి చారు! 2019 బ్రిక్స్ సమ్మిట్ వర కల్లా కొన్ని దేశాలు విడుదలచేసిన డాక్యుమెంట్లలో ఆ వెసులుబాటు చేర్చబడింది కూడా! ఈ 'మల్టీ లేటరి లిజం' మల్టీ ఎలైన్మెంట్ ఆలోచనలను భారత్ మరింతగా ప్రభావితం చేసే విధంగా బ్రిక్స్ సమ్మిట్ చర్చలు దోహదం చేయటంతోపాటు దృఢమైన నిర్ణయాలు ప్రపంచ శాంతి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడటానికి అనుకూల వాతావరణం కల్పించాలి!*

సమ్మిట్ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ముఖ్యంగా చమురు దిగుమతులు హార్మజ్ జల సంధి దగ్గర జరుగుతున్న గొడవల వల్ల చాలా దేశాలకు ఎన్నో కష్టాలు తెచ్చిపెట్టున్నాయి. మన దేశానికి ఈ పరిస్థితివల్ల ఆర్థిక పురోగతి కుంటుపడే అవకా శం మరింతగా పెరిగింది! బ్రిక్స్ ఏర్పాటు చేసిన అతిథి దేశంగా భారత్ ప్రపంచ స్థాయిలో తన పాత్ర ఏమిటో స్పష్టపరుచుకుంది. చైనా, ఇరాన్, రష్యా దేశాల నాయకులు కొత్తగా పేరు పెట్టిన భారత మండపంలో చర్చలు ఆరంభించటం ముదావహం. అంతకు మునుపే షాంగై కోపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్లో ప్రధాని మోడీ, ఇరాన్ ప్రసిడెంట్ సమావేశం ఆగస్టు 31 నాడు జరిగింది! బయటకు విషయం పొక్కటం లేదు కానీ యు.యస్ డాలర్ మీద ఇతర దేశాలు ఆధారపడి ఆర్థికంగా కష్టాలపాలవుతున్నాయి. డాలర్ మారకం విలువ అంతర్జాతీయంగా ఇంతకు మునుపు అన్ని దేశాల కరెన్సీని అధిగమించి వుండేది! దానితో అమెరికా దేశం ఆర్థిక విషయాలల్లో ముఖ్యంగా ఎగుమతులూ దిగుమతుల సంబంధాలలో ప్రభావంతనకు అనుకూలంగా వుండేట్లు చూసుకొనేది. ఇప్పుడు కొన్ని దేశాలు ముఖ్యంగా చైనా, రష్యా, ఇండియా, యూరప్ దేశాల కరెన్సీ మాదిరి వారివారి దేశాల కరెన్సీలు ఆర్థిక వెసులుబాటు కోసం చెల్లించుకొనే ఒప్పందం దృఢపర్చుకొనే అవకాశం ఈ సందర్భంగా తీసుకో వచ్చు! ఫైనాన్స్‌కు సంబంధించిన అధికారులు 'బ్రిక్స్' సమ్మిట్ ముందు కలుసుకొని 'క్రాస్ బార్డర్ పేమెంట్స్' వెసులుబాటు కల్పించుకోవటం ద్వారా జాతీయ కరెన్సీలను కొన్ని దేశాలు బలోపేతం చేసుకోవాలని అనుకున్నట్లు తెలుస్తున్నది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా, ఈజిప్ట్, ఇథో పియా, ఇండోనేషియా, ఇరాన్, యు.ఏ.ఇ దేశాలు ట్రేడ్‌తో పాటు దౌత్య సంబంధాలు గ్లోబల్ సౌత్లో పెంపొందించుకొనే అవకాశాలు అభివృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాయి. దీనివల్ల 'క్రాస్ బార్డర్ పేమెంట్' కోరుకున్న రీతిలో మెరుగవుతుందని ఈ దేశాలు నమ్ముతున్నట్లు బహిర్గతమవుతున్నది. ఇప్పుడు దేశాల మధ్య చెల్లింపులు జరగాలంటే సంబంధిత బ్యాంకు లలో దేశాలకు ఎకౌంట్లు వుండటం తప్పనిసరి! రెండు దేశాల మధ్య సంబంధిత బ్యాంక్‌లు లేకపోతే చెల్లింపులు అంతర్జాతీయ బ్యాంక్ ద్వారా చెయ్యాలి! చెల్లించే దేశం కరెన్సీని కన్వర్ట్ చేసి (డామినెంట్ కరెన్సీతో అంటే డాలర్స్ మార్చుకొని) తిరిగి కరెన్సీ పొందే దేశ కరెన్సీలో మార్చు కోవాలి. ఈ లావాదేవీలు చాలా కష్టతరంగా మారటమే కాకుండా ఎక్కువగా మారకం విలువ నిన్న మొన్నటి దాకా ఎక్కువగా వున్న డాలర్ మీద ఆధారపడాల్సిన స్థితి వుంటు న్నది! ఒకవేళ ఈ మారకాల విషయాల్లో వచ్చే ఇబ్బందుల ను తొలిగించుకో వటానికి 'క్రాస్ బార్డర్ పేమెంట్' పద్ధతి గాడిలో పడితే ఆర్థిక వెసులుబాటు ఈ దేశాలకు ఏర్పడుతుంది! 2026లో జరుగుతున్న బ్రిక్స్ సమ్మిట్లో ఇలాంటి వెసులుబాట్లు కుదుర్చుకొనే అవకాశాలు ఎక్కువగా వున్నాయి! నిజానికి భారత్ కొన్నిబలమైన దేశాలు, ఈ వెసులుబాటు కుదుర్చుకోవటానికి అంగీకరించేందుకు కొంత తెర వెనుక ప్రయత్నాలు చేసినట్లు, అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2018 బ్రిక్స్ సమ్మిట్ (సౌత్ ఆఫ్రికాలో జరిగింది) 'రిఫార్మ్డ్ మల్టీ లేటరిలిజం'ను గురించిన ఆలోచన మోడీ వ్యక్తపరిచారు! 2019 బ్రిక్స్ సమ్మిట్ వర కల్లా కొన్ని దేశాలు విడుదలచేసిన డాక్యుమెంట్లలో ఆ వెసులుబాటు చేర్చబడింది కూడా! ఈ 'మల్టీ లేటరిలిజం' మల్టీ ఎలైన్మెంట్ ఆలోచనలనుభారత్ మరింతగా ప్రభావితం చేసే విధంగా బ్రిక్స్ సమ్మిట్ చర్చలు దోహదం చేయటంతోపాటు దృఢమైన నిర్ణయాలు ప్రపంచ శాంతి ఆర్థిక పురోభివృద్ధికి

13-9Pg5:13-9Pg5.qxd 9/12/2026 10:42 PM Page 1





# జిన్‌పింగ్ వెంటే 'అంకుల్ కై'

## భారత్‌కు వచ్చిన ఈ పొడగరి ఎవరు?

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత పర్యటనపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. ఆయనతోపాటు సూటుబూటూ ధరించిన ఎత్తయిన వ్యక్తిపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఆయనే కై క్వి. చైనాలో 'అంకుల్ కై'గా ఫేమస్ అయిన ఆయనను జిన్‌పింగ్‌కు నమ్మకస్తుడు. కుడిభుజంగా చెబుతుంటారు. అధ్యక్షుడి తర్వాత శక్తిమంతమైన నేతగా చూస్తున్నారు. ఆయన ఆ స్థాయికి ఎదిగిన తీరూ చర్చనీయాంశమే? మామూలుగా తెరవెనక ఉండి రహస్యంగా పనులు చక్కబెట్టే కై క్వి.. కమ్యూనిస్ట్ పార్టీ పొలిటికల్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు. చైనా ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసే జనరల్ ఆఫీస్ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ కై క్వి ఎక్కువగా మీడియా కంట్లో పడుతున్నారు. గతేడాది ప్రధాని మోడీ ఎస్‌సిఒ సదస్సు కోసం చైనా వెళ్లారు. వారిద్దరి మధ్య భేటీ జరగడాన్ని కీలకాంశంగా పరిగణించారు. అదే యేడాది దక్షిణ కొరియాలో ట్రంప్-జిన్‌పింగ్ భేటీలో కూడా కనిపించారు. ఇక ఈ యేడాది చైనా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ను మొదట పలకరించింది కూడా ఈయనే. ఎవరీ కై క్వి? 1966 నుంచి 1976 మధ్య నాటి కమ్యూనిస్ట్ పార్టీ ఛైర్మన్ మావో జెడాంగ్ ప్రారంభించిన సాంస్కృతిక విప్లవంతో జిన్‌పింగ్, క్వై క్వి ప్రస్థానం మొదలైంది. అప్పుడు మొదలైన వీరి స్నేహం విడదీయరానిదిగా మారింది. 2013లో జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడు కాగా.. 2017 నుంచి కై క్వి అతివేగంగా ఉన్నతస్థానాలకు ఎదిగారు. బీజింగ్ కమ్యూనిస్ట్ పార్టీ చీఫ్‌గా నియమితులైన కొన్ని నెలల తర్వాత నేరుగా పొలిట్ బ్యూరో (పార్టీ రెండో అత్యున్నత నిర్ణయాధికార సంస్థ) సభ్యుడిగా ప్రమోషన్ పొందారు. మామూలుగా ఇలాంటి స్థానాలకు ఎదగాలంటే కనీసం ఐదేళ్లు పడుతుంది. 2022లో పార్టీకి చెందిన ఏడుగురు సభ్యుల పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా మారారు. అత్యున్నత స్థాయి నిర్ణయాలు తీసుకునే ఒక రాజకీయ శక్తి కేంద్రం అది. ఈ యేడాది ప్రారంభంలో పార్టీకి సెంట్రల్ ఐడియాలజీ స్కూల్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఒకే వ్యక్తికి ఇన్ని పదవులంటే.. అధికారమంతా ఒక దగ్గరే కేంద్రీకృతమైందని అర్థమవుతోంది.

# గ్లోబల్‌సౌత్ బలమైన వాణి వినిపించాలి

## 'రూల్ షేపర్'గా బ్రిక్స్ దేశాలు వ్యవహరించాలి

## సదస్సు ప్రారంభ సభలో ప్రధానిమోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** గ్లోబల్ సౌత్‌కు అంతర్జాతీయ నిర్ణయాల్లో మరింత బలమైన స్వరం ఉండాలని ప్రధానిమోడీ పిలుపునిచ్చారు. ఆర్థికంగా బలహీనమైన, అభివృద్ధి చెందుతున్న దేశాలను గ్లోబల్ సౌత్‌గా వ్యవహరిస్తారు. ఇతరులు రూపొందించే నిబంధనల్ని అనుసరించే రూల్ టేకర్‌గా కాకుండా, నిబంధనలను రూపొం దించే రూల్ షేపర్‌గా ఉండాలని ప్రధాని పిలుపు నిచ్చారు. న్యూఢిల్లీలో ప్రారంభమయిన బ్రిక్స్ 18వ సమావేశాల్లో ప్రధాని నరేంద్రమోడీ సద స్సుకు అధ్యక్షత వహిస్తూ, కీలక ప్రసంగం చేశారు. ఈ మార్పుకు నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోడీ స్పష్టం చేశారు. సవాళ్లను ఎదుర్కోవడంలో గ్లోబల్ సౌత్ ముందు వరసలో ఉన్నప్పటికీ, అంతర్జాతీయ నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనక వరసలో ఉందని అన్నారు. బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు , ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని మోడీ అన్నారు. ప్రస్తుత పాలనా వ్యవస్థను అధికార పిరమిడ్‌తో పోల్చారు. ఇందులో అధికారం, నిర్ణయాధికారం పైస్థాయిలో కొన్ని దేశాలు వద్ద కేంద్రీకృతమై ఉంటుందని, దిగువ స్థాయిలో ఉన్న దేశాలు ఆ నిర్ణయాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని రూపొందించే అవకాశం మాత్రం వారికి రావడం లేదని వివ రించారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచ పాలనలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమానమైన, ప్రభావ వంతమైన భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని మోడీ తన ప్రసంగంలో చెప్పారు. 12, 13 తేదీల్లో జరిగే ఈ సమావేశాలకు బ్రిక్స్ సభ్యదేశాలతో పాటు బ్రిక్స్ అవుట్‌రీచ్ దేశాలు హాజరయ్యాయి. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మహ్మద్ పెజెష్కియాన్ వంటి నేతలు హాజరయ్యారు. బ్రిక్స్ కేవలం ఆర్థిక సహకార వేదికగా కాకుండా, ప్రపంచ వ్యవస్థలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్ ప్రయోజనాలకు బలమైన వేదిగాగా మారాలనే భారత వైఖరిని ప్రధాని మోడీ సభ్యదేశాధినేతల ముందు చెప్పారు. రాబోయే 20 ఏళ్ల కోసం కొత్త, ప్రతిష్టాత్మక కార్యాచరణ అవసరమని మోడీ అన్నారు. ఇందు కోసం ప్రాతినిధ్యం, స్పందనాత్మ కత, నిబంధనల రూపకల్పన ఆధారంగా 10 అంశాలతో రోడ్‌మ్యాప్ ప్రతిపాదించారు. ఇందులో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కర ణలను మోడీ ప్రస్తావించారు. భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయడం సాధ్యం కాదని ఆయన అన్నారు. ప్రపంచ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ స్థానాలు, విధాన ప్రాధాన్యతలు ప్రస్తుత ఆర్థిక వాస్తవాలకు అను గుణంగా ఉండాలని మోడీ అన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే దేశాలకు ప్రపంచ నిర్ణయ ప్రక్రియలో తగిన పాత్ర ఉండాలని అన్నారు.



## ప్రధానిమోడీతో ఫొటో దిగేందుకు ప్రతినిధుల ఆసక్తి

### కోరినవెంటనే డెలిగేట్స్‌తో ఫొటో దిగిన ప్రధాని

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీకి అరుదైన గౌరవం లభించింది. మోడీతో ఒక గ్రూప్ ఫొటో దిగేందుకు విదేశీ ప్రతినిధులు ఎంతో ఉత్సాహం చూపారు. ఈ ఆసక్తికర ఘటన న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు వేదికగా కనిపించింది. భారత ప్రభుత్వం విడుదల చేసిన ఒక వీడియోలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. సదస్సు ముగిశాక, పలువురు విదేశీ డెలిగేట్లు ప్రధాని మోడీ వద్దకు వచ్చి, మేము ఒక ఫోటో దిగొచ్చా అని అడిగారు. అందుకు ప్రధాని నవ్వుతూ తప్పకుండా అని సమాధాన మిచ్చారు. మరికొందరు అంటూ ఆయన్ను కోరారు. ఈ సమయంలో అక్కడే ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్.. డెలిగేట్లు ఫొటో దిగేందుకు వీలుగా పక్కకు జరిగి దారి ఇవ్వడం విశేషం. ప్రతినిధులందరూ ఫొటో కోసం సర్దుకుంటుండగా, ప్రధాని మోడీ అక్కడున్న మహిళా ప్రతినిధులను చూసి సరదాగా మీరు అదృష్టవంతులు, ఇంతమంది మహిళలున్నారు అని వ్యాఖ్యానించారు.

# అహంకారానికి, బెదరింపులకు తలొగ్గేది లేదు

## అమెరికాకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ హెచ్చరిక




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్.. అమెరికాను మరోసారి హెచ్చరించారు. బెదరింపులకు పాల్పడే వారికి ఇరాన్ ఎన్నటికీ తలొగ్గని పెజెష్కియాన్ అన్నారు. మరోవైపు వైపు ప్రధాని నరేంద్రమోడీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌లు ఢిల్లీలో సమావేశమయ్యారు. బ్రిక్స్ సమావేశాల సమయంలో ఇరు దేశాధినేతల భేటీ ఆసక్తికరంగా మారింది. ఈ సమావేశంలో ఇద్దరు దేశాధినేతలు పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఒక స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'బెదరింపులకు', 'అహంకారానికి' ఇరాన్ తలొగ్గదని, తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి దృఢంగా నిలబడుతుందన్నారు. బ్రిక్స్ కూటమి దేశాల బలం ఆర్థిక వ్యవస్థలకే పరిమితం కాలేదని.. వాణిజ్యం, పెట్టుబడులు, ఉమ్మడిగా నిధుల సమీకరణలో బ్రిక్స్ దేశాల సామర్థ్యాలు మరింత స్పష్టం అవుతున్నాయన్నారు. అలాగే భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం సంక్లిష్టంగా మారాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల సమయంలో ఇరాన్ అధ్యక్షుడి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అలాగే భారత ప్రధాని నరేంద్రమోడీతో పెజెష్కియాన్ ఢిల్లీలో సమావేశం అయ్యారు. ప్రధానంగా ఇరు దేశాల సంబంధాల బలోపేతంపై చర్చించారు. అలాగే భారత ప్రధాని మోడీ, పెజెష్కియాన్ సమావేశంపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పందించారు. భారత్-ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని తాను భావించడం లేదన్నారు. అమెరికా ఆంక్షలను తప్పించుకోవడంలో ఇరాన్‌కు ఇతర దేశాలు సహాయం చేయొద్దని మార్కో హెచ్చరించారు. అమెరికా దాడుల తర్వాత, రెండు అమెరికా నౌకలను ముంచేశామని.. అలాగే ఎనిమిది చమురు ట్యాంకర్లను ధ్వంసం చేశామని ఇరాన్ పేర్కొంది. అంతకుముందు, అమెరికా సైన్యం దాడి చేసి ఐదు ఇరాన్ ట్యాంకర్లను ధ్వంసం చేయగా, ఈ ఘటనలో లక్షల లీటర్ల ముడి చమురు కాలిపోయింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఓ కీలక ప్రకటన చేశారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ముగిసిన వెంటనే ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం ముగుస్తుందని చెప్పుకొచ్చారు.

# యేడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్!న- వాణిజ్య పెట్టుబడులే భేటీలో కీలకం..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ శనివారం న్యూఢిల్లీ చేరుకున్నారు. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. సుమారు 24 గంటల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా, ఆయన శనివారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో జరిపే ద్వైపాక్షిక చర్చల్లో ప్రధానంగా వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలో దేశ రాజధానిలో అపూర్వమైన భద్రతా ఏర్పాటు చేశారు. ఆయన బస చేస్తున్న హోటల్ పరిసర ప్రాంతాలను ఇప్పటికే నోఫ్లై జోన్‌గా ప్రకటించారు. బాంబ్ డిటెక్షన్, యాంటీ టెర్రర్ బృందాలతో పాటు అణు, రసాయన దాడులను గుర్తించే ప్రత్యేక దళాలను కూడా మోహరించారు. చైనాకు చెందిన భద్రతా సిబ్బంది కొద్ది రోజుల ముందే ఢిల్లీకి చేరుకుని, హోటల్ పరిసరాలను తమ పర్యవేక్షణలోకి తీసుకున్నారు. ఆయన పర్యటనకు పది రోజుల ముందే చైనా నుంచి ఒక కార్గో విమానం ఢిల్లీకి చేరుకుంది. ఈ విమానంలో జిన్‌పింగ్ ఉపయోగించే ప్రత్యేక హాంగ్‌కీ కారు, ఒక బ్యాకప్ వాహనంతో పాటు అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలను తీసుకువచ్చారు. శాటిలైట్ కమ్యూనికేషన్ పరికరాల వంటి వాటిపై భారత నిబంధనలు కచ్చితంగా వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. జిన్‌పింగ్ ప్రయాణించే బోయింగ్ 7478 విమానం క్షిపణి నిరోధక వ్యవస్థలతో కూడిన ఒక మొబైల్ కమాండ్ సెంటర్‌గా పనిచేస్తుంది. బ్రిక్స్ సదస్సు భద్రత కోసం ఢిల్లీ వ్యాప్తంగా 15,000 మందికి పైగా పోలీసులు, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. విమానాశ్రయం నుంచి సదస్సు వేదికైన భారత్ మండపం వరకు 700కు పైగా సీసీటీవీ కెమెరాలు, యాంటీడ్రోన్ వ్యవస్థలతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు జిన్‌పింగ్ తన పర్యటనను ముగించుకుని తిరిగి వెళ్లనున్నారు.

# బ్రిక్స్ కూటమికి గ్రోత్ ఇంజిన్‌గా భారత్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** ఒకప్పుడు బలహీనమైన బంధంగా విమర్శలు ఎదుర్కొన్న భారత్, నేడు అదే కూటమికి వృద్ధి ఇంజిన్‌గా మారింది. 2012లో ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు, అసలు ఈ వర్ధమాన దేశాల కూటమిలో భారత్‌కు స్థానం ఉందా అనే ప్రశ్నలు తలెత్తాయి. కానీ పద్నాలుగేళ్ల తర్వాత 2026లో విస్తరించిన కూటమికి భారత్ మరోసారి ఆతిథ్యం ఇస్తున్న వేళ, పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు బ్రిక్స్ భవిష్యత్తును నిర్దేశించే కీలక శక్తిగా భారత్ అవతరించింది. 2012 నాటి పరిస్థితులను పరిశీలిస్తే, భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంది. 2012-13లో వృద్ధి రేటు 5 శాతం కంటే దిగువకు పడిపోయింది, ద్రవ్యోల్బణం ఆందోళనకర స్థాయిలో ఉంది, రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ స్టాండర్డ్ పూర్స్ అయితే, భారత్ తన ఇన్వెస్ట్‌మెంట్‌గ్రేడ్ సార్వభౌమ రేటింగ్‌ను కోల్పోయే తొలి బ్రిక్ దేశంగా మారవచ్చని హెచ్చరించింది. బ్రిక్ అనే పదాన్ని సృష్టించిన ప్రముఖ ఆర్థికవేత్త జిమ్ ఓ నీల్ సైతం, ఆ నాడు బ్రిక్ దేశాల్లో పెట్టుబడులకు భారత్ అత్యంత ఆకర్షణీయం కాని దేశంగా పేర్కొన్నారు. కొందరైతే భారత్ స్థానంలో ఇండోనేషియాను చేర్చాలనే వాదనలు కూడా వినిపించారు. 2026 నాటికి ఈ చిత్రం సమూలంగా మారిపోయింది. ప్రస్తుతం భారత ఆర్థిక మూలాలు అత్యంత పటిష్ఠంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అత్యంత వేగవంతమైన వృద్ధి రేట్లలో ఒకటి. ఇటీవలే, 2026 సెప్టెంబరులో జపాన్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్ సార్వభౌమ రేటింగ్‌ను ట్రిపుల్‌బిప్లస్ నుంచి ఏకేటగిరీకి కి పెంచుతూ స్థిరమైన అవుట్‌లుక్‌ను ప్రకటించింది. పటిష్ఠమైన వృద్ధి, మెరుగైన ద్రవ్య క్రమశిక్షణ, బలపడిన ఆర్థిక వ్యవస్థ, జీఎస్టీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి సంస్కరణలు ఈ రేటింగ్ పెంపునకు కారణాలని ఆ సంస్థ వివరించింది. 2010లో దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్ కాస్తా బ్రిక్స్‌గా మారింది. ఆ తర్వాత ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, ఇండోనేషియా వంటి దేశాలు కూడా ఇందులో భాగమయ్యాయి. దీంతో ఈ కూటమి ఆర్థిక, భౌగోళిక రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ విస్తృత కూటమిలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కానప్పటికీ, దాని వృద్ధి వేగం, భారీ మార్కెట్, సాంకేతిక సామర్థ్యాలు, భౌగోళిక రాజకీయ విభేదాలకు అతీతంగా అన్ని వర్గాలతో సత్సంబంధాలు నెరపగల సామర్థ్యం ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఈ మార్పు అడిగే ప్రశ్నల్లోనే స్పష్టంగా కనిపిస్తోంది. 2012లో చర్చంతా అసలు బ్రిక్స్‌లో ఉండే అర్హత భారత్‌కు ఉందా అనే దానిపై కేంద్రీకృతమైంది. కానీ 2026 నాటికి, ఈ విస్తరించిన కూటమి భవిష్యత్తును భారత్ ఎంతవరకు నిర్దేశించగలదనే దానిపై దృష్టి సారించడం గమనార్హం.

# కాంగ్రెస్ పార్టీ పదవుల నుంచి తప్పుకున్న ఉత్తరాఖండ్ మాజీ సిఎం హరీష్ రావత్



**డెహ్రాడూన్, సెప్టెంబరు 12:** ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ పార్టీ పదవుల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తన మాజీ సహాయకుడు, ప్రస్తుతం పిఎగా పనిచేస్తున్న చందన్ సింగ్ జీనా నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించిన మరుసటి రోజే హరీశ్ రావత్ ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. తన వల్ల కాంగ్రెస్ పార్టీ అవినీతికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంపై ఎలాంటి ప్రశ్నలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పదవుల నుంచి తప్పుకుంటున్నట్లు రావత్ తెలిపారు. ఈ మేరకు ఫేస్‌బుక్ పోస్టు ద్వారా తన నిర్ణయాన్ని వెల్లడించారు. 2016లో జరిగిన గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పరీక్షలో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ సహా పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సోదాల్లో చందన్ సింగ్ జీనా నివాసం కూడా ఉందని ఈడీ పేర్కొంది.

# హఠాత్తుగా సముద్రం ఎండిపోయిందంటూ అర్జెంటీనాలో హల్‌చల్

## అదేమీ నిజం కాదన్న సముద్ర జలవనరుల నిపుణులు

**బ్యూనస్ ఎయిర్స్, సెప్టెంబరు 12:** అర్జెంటీనాలో రాత్రికి రాత్రే సముద్రం ఎండిపోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తలు తీవ్ర కలకలం రేపాయి. ఇది అవాస్తవమని, ప్రకృతి వైపరీత్యం కాదని, కేవలం ఒక తాత్కాలిక సహజ ప్రక్రియ మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అర్జెంటీనాలోని మార్ డెల్ ప్లాటా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రం నీరు సుమారు 23 కిలోమీటర్ల మేర వెనక్కి తగ్గినట్టు వార్తలు వచ్చాయి. సముద్రం వెనక్కి తగ్గడం వల్ల, సాధారణంగా నీటిలో మునిగి ఉండే రెస్టింగా డెల్ ఫారో అనే భారీ శిలా ప్రదేశం పూర్తిగా బయటపడింది. తీరంలో నిలిచిపోయిన పడవలు, వెనక్కి వెళ్ళిన సముద్ర గర్భం దృశ్యాలను చూసి స్థానికులు, పర్యాటకులు విస్మయానికి గురయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, సముద్రం ఎండిపోయిందనే తప్పుడు ప్రచారం జోరందుకుంది. ఇది సునామీ హెచ్చరిక గానీ, సముద్రం శాశ్వతంగా ఎండిపోవడం గానీ కాదని నిపుణులు తేల్చిచెప్పారు. తీరం నుంచి సముద్రం వైపు బలమైన గాలులు వీయడం, అదే సమయంలో సముద్రపు పోటు తక్కువగా ఉండటం వల్ల నీరు తాత్కాలికంగా వెనక్కి వెళ్లిందని వివరించారు. కొన్ని గంటల వ్యవధిలోనే నీటిమట్టం తిరిగి సాధారణ స్థాయికి చేరుకుందని అర్జెంటీనా మీడియా వెల్లడించింది. సాధారణంగా భూకంపం సంభవించినప్పుడు నీరు వేగంగా వెనక్కి వెళ్లి, తిరిగి భారీ అలలతో విరుచుకుపడితే దానిని సునామీగా పరిగణిస్తారు. కానీ ఇక్కడ కేవలం వాతావరణ మార్పుల వల్లే నీరు వెనక్కి వెళ్లి, అనంతరం తిరిగి ప్రశాంతంగా యథాస్థితికి చేరుకుంది. కాబట్టి, సముద్రం అదృశ్య మైందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నిపుణులు స్పష్టం చేశారు.

# వచ్చే వారమే రష్యాపై ఆంక్షల బిల్లు.. భారత్‌కు టారిఫ్‌లు తప్పవా?



**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** రష్యాపై ఆంక్షలు కఠినతరం చేసే బిల్లుపై అమెరికా ప్రతినిధుల సభ సోమవారం ఓటింగ్ చేపట్టేందుకు సిద్ధమైంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై టారిఫ్‌లు విధించేలా అమెరికా ప్రత్యేక బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 'లిండ్సే గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026'ను అమెరికా సెనెట్ గత నెలలో భారీ మెజారిటీతో ఆమోదించింది. ఈ బిల్లును డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది ట్రంప్‌నకు విస్తృతమైన అధికారాలను ఇస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే.. రష్యా నుంచి పెద్దఎత్తున ఇంధనం కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై టారిఫ్‌ల భారం పడే అవకాశం ఉంది. భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలపైనా ప్రభావం పడొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్‌కు తాము అందించే మద్దతు విషయంలో వెనకడుగు వేయబోమని డెమోక్రటిక్ నేతలు పునరుద్ఘాటించారు. అయితే ఈ బిల్లు మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికన్లపైనా ధరల భారం పెరుగుతుందని హెచ్చరించారు. మరోవైపు రష్యా ఆంక్షల బిల్లును ఆమోదించాలని సెనెట్ డెమోక్రటిక్ సభ్యురాలు జీన్ షహీన్ కోరడం గమనార్హం.

పుతిన్ యుద్ధంతో ఉక్రెయిన్‌లోని అమాయక పౌరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. క్రెమ్లిన్ ఆదాయాన్ని దెబ్బతీసే ఈ బిల్లును ఆమోదించి, పుతిన్‌ను చర్చలకు తీసుకురావాలని ఆమె కోరారు.



# 4500 యేళ్లనాటి పిరమిడ్‌లో గణిత సంకేతాలు..

## కొత్త పరిశోధన తెరపైకి తెచ్చిన సైంటిస్టు సెఫీ లెవీ

**కైరో, సెప్టెంబరు 12:** ఈజిప్టులోని గిజా మహా పిరమిడ్ మరోసారి చర్చలోకి వచ్చింది. 4,500 ఏళ్ల నాటి ఈ అద్భుత నిర్మాణంలో చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలకు సంబంధించిన గణిత సంకేతాలు దాగి ఉండొచ్చని ఓ కొత్త సిద్ధాంతం చెబుతోంది. స్వతంత్ర పరిశోధకుడు సెఫీ లెవీ ఈ వాదనను తెరపైకి తెచ్చారు. పిరమిడ్ ఎత్తు, పునాది, వాలుదిశల కొలతలను ప్రాచీన ఈజిప్టు గణిత పద్ధతులకు సంబంధించిన భిన్నాలతో లెవీ విశ్లేషించారు. కొన్ని లెక్కల్లో వచ్చిన సంఖ్యలు ఖగోళ చక్రాలకు దగ్గరగా ఉన్నాయని ఆయన చెబుతున్నారు. ఓ లెక్కలో 27.5 అనే సంఖ్య వచ్చిందని లెవీ తెలిపారు. ఇది చంద్రుడు భూమికి అత్యంత దగ్గరగా వచ్చే వరుస కక్ష్య బిందువుల మధ్య సగటు 27.55 రోజుల వ్యవధికి దగ్గరగా ఉందని ఆయన అంటున్నారు. మరో లెక్కలో 70 అనే సంఖ్య వచ్చింది. సూర్యకాంతి కారణంగా సిరియస్ నక్షత్రం కనిపించని దాదాపు 70 రోజుల వ్యవధితో దీనికి సంబంధం ఉండొచ్చని చెబుతున్నారు. గురు, శని, శుక్రుడు, అంగారక గ్రహాల కదలికలతోనూ కొన్ని లెక్కలు సరిపోతున్నాయని లెవీ వాదిస్తున్నారు. పై విలువలు, గోల్డెన్ రేషియో వంటి గణిత స్థిరాంకాలతోనూ పిరమిడ్ కొలతలకు సంబంధం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నమూనాలు యాదృచ్ఛికంగా ఏర్పడ్డాయా, కావాలనే రూపొందించారా అన్నది పరిశీలించేందుకు 1 లక్ష కంప్యూటర్ నమూనాలను రూపొందించారు. వాటిలో 2.4 శాతం నమూనాల్లో ఇలాంటి పోలికలు కనిపించాయని లెవీ తెలిపారు. ఇది పిరమిడ్ కొలతలు ఉద్దేశపూర్వకంగా రూపొందించి ఉండొచ్చన్న వాదనకు బలం ఇస్తుందని ఆయన అభిప్రాయం. అయితే ఈ పరిశోధనకు ఇంకా శాస్త్రీయ సమీక్ష జరగలేదు. ప్రధానంగా, ఈజిప్టు పురావస్తు నిపుణులు ఈ వాదనను అంగీకరించలేదు. పిరమిడ్‌ను గణిత, ఖగోళ సంకేతాల కోసం నిర్మించారనే స్వతంత్ర ఆధారాలు కూడా ఇప్పటివరకు లేవు.

ఫారో ఖుఫు పాలనలో నిర్మించిన మహా పిరమిడ్‌ను సాధారణంగా ఆయన సమాధి సముదాయంలో భాగంగా భావిస్తారు. కానీ లెవీ మాత్రం ఇది ప్రాచీన జ్ఞానాన్ని శాశ్వతంగా భద్రపరిచే నిర్మాణం అయి ఉండొచ్చని అంటున్నారు.

ప్రాచీన ఈజిప్టు సృష్టి పురాణాల్లో చెప్పే బెన్‌బెన్ అనే ఆదిమ కొండతోనూ దీనికి సంబంధం ఉండొచ్చని ప్రతిపాదిస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించిన ఉత్తర కొరియా



**ప్యాంగ్యాంగ్, సెప్టెంబరు 12:** కొరియా ద్వీపకల్పంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ కలిసి నిర్వహించిన "ఫ్రీడమ్ ఎడ్జ్" త్రైపాక్షిక సైనిక విన్యాసాలు ముగిసిన ఒక్క రోజుకే ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వారి విన్యాసాలను రెచ్చగొట్టే చర్యగా భావిస్తున్న ప్యోంగ్‌యాంగ్, తనదైన శైలిలో ప్రతిస్పందించింది. ఉదయం 5:20 గంటలకు ఉత్తర కొరియాలోని వోన్‌సాన్ ప్రాంతం నుంచి అనేక స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. అవి సుమారు 250 కిలోమీటర్లు ప్రయాణించి తూర్పు సముద్రంలో కూలిపోయాయి.

## ఈస్ట్‌వెస్ట్ చమురుపైప్‌లైన్‌పై ఇరాన్ దాడులు



**దుబాయి, సెప్టెంబరు 12:** సౌదీ అరేబియాలోని కీలకమైన ఈస్ట్‌వెస్ట్ చమురు పైప్‌లైన్‌పై పలు దాడులు జరిగాయి. దీంతో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా పైప్‌లైన్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ దాడులు ఇరాక్ భూభాగం నుంచి డ్రోన్ల ద్వారా జరిగాయని సౌదీ విదేశాంగ శాఖ ఆరోపించింది.

సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, రియాద్, మదీనా ప్రాంతాల గుండా వెళ్లే ఈ పైప్‌లైన్‌పై ఈ దాడులు జరిగాయి.

## బిన్‌లాడెన్ కుమారుడి విడియో విడుదల చేసిన అల్‌కాయిదా




**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** ఒసామా బిన్ లాడెన్ కుమారుడు హమ్జా బిన్ లాడెన్ సజీవంగా ఉన్నాడా లేదా మరణించాడా అనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా మరోసారి చర్చ మొదలైంది. అమెరికాపై జరిగిన 9/11 దాడుల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అల్ ఖైదా ఉగ్రవాద సంస్థ విడుదల చేసిన తాజా వీడియో ఈ అనుమానాలకు తావిస్తోంది. కొన్ని ఏళ్ల క్రితమే హమ్జాను మట్టుబెట్టినట్లు అమెరికా ప్రకటించినప్పటికీ, గతంలో ఎప్పుడూ వెలుగులోకి రాని అతడి ఫుటేజీని అల్ ఖైదా ఇప్పుడు విడుదల చేయడం గమనార్హం.

## ప్రజ్వల్ రేవణ్ణ మొబైల్‌లో వందలాది పోర్న్ విడియోలు

**బెంగళూరు, సెప్టెంబరు 12:** మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జైలు గదిలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో వందలాది పోర్న్ వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్ధారించింది. మొత్తం 173 వీడియో ఫైళ్లు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వాటిలో ప్రజ్వల్‌కు సంబంధించినవిగా భావిస్తున్న మూడు అశ్లీల వీడియోలు ఉన్నట్లు సమాచారం. బెంగళూరు కేంద్ర కారాగారంలో ఆగస్టు 11న పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

## బార్బర్‌డైమ్ నాణేనికి వేలంలో రూ.10.4 కోట్లు రాబడి




**వాషింగ్టన్, సెప్టెంబరు 12:** ఒకప్పుడు కేవలం 10 సెంట్ల (సుమారు రూ. 8) విలువ కలిగిన ఒక చిన్న నాణెం, నేడు కోట్లాది రూపాయల విలువైన మహా సంపదగా మారింది. అమెరికాకు చెందిన అత్యంత అరుదైన 1894ఎస్ బార్బర్ డైమ్ నాణెం ఇటీవల జరిగిన వేలంలో ఏకంగా 12,50,500 డాలర్లకు (సుమారు రూ. 10.4 కోట్లు) అమ్ముడుపోయింది. సెప్టెంబర్ 1న స్టాక్స్ బోవర్స్ గ్యాలరీస్ నిర్వహించిన ఈ వేలంలో పురాతన నాణేల సేకరణకారులు దీనిని దక్కించుకోవడం కోసం తీవ్రంగా పోటీపడ్డారు. ఈ నాణేనికి ఇంత భారీ ధర పలకడానికి ప్రధాన కారణం అది అత్యంత అరుదైనది కావడమే.

## రేపటి నుండి కాణిపాకం బ్రహ్మోత్సవాలు



**కాణిపాకం, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో రేపటి నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆలయంలో 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా ఈనెల 14న వినాయకచవితి, 15న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు ఈనెల 23న జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగుస్తాయి. అలాగే 24న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు అక్టోబర్ 4న జరిగే తెప్పోత్సవంతో ముగియనుంది. ఈమేరకు సెప్టెంబర్ 14న వినాయక చవితి, 15న ధ్వజారోహణం,హంసవాహనసేవ, 16న బంగారు నెమలివాహన సేవ, 17న మూషికవాహన సేవ, 18న బంగారు చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేషవాహనసేవ, 19న చిలుక వాహనం (పగలు), వృషభవాహనసేవ (రాత్రి), 20న గజవాహన(ఏనుగు)సేవ, 21న రథోత్సవం, 22న బిక్షాండి, తిరుకళ్యాణం, అశ్వవాహన సేవ, 23న ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ జరుగనుంది. అదేవిధంగా ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 24న అధికార నందివాహనసేవ,25న రావణ బ్రహ్మ వాహనసేవ, 26న విమానోత్సవం,27నసూర్యప్రభ వాహనసేవ, 28న చంద్రప్రభ వాహనసేవ, 29న యాళివాహనసేవ,30నకల్పవృక్ష వాహనసేవ,అక్టోబర్ 1న పూలంగిసేవ, 2నకామధేనువాహనం,3న పుష్పపల్లకిసేవ, 4న తెప్పోత్సవం జరగనుంది.

## 19న ఆన్‌లైన్‌లో డిసెంబర్ నెల దర్శన కోటా టిక్కెట్లు విడుదల



**తిరుమల,సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆర్జితసేవ దర్శనాలకు సంబంధించి మూడునెలల ముందు విడుదల చేసే ఆన్‌లైన్ సేవా టిక్కెట్లను ఈనెల 19వతేదీ శనివారం టిటిడి అధికారులు అందుబాటులో ఉంచనున్నారు. రానున్న డిసెంబర్ నెలకు సంబంధించి టిటిడి విడుదల చేసే వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలను వెల్లడించింది. శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల(సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను ఈనెల 19న శనివారం ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.ఈ టికెట్లు పొందిన వారు 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. ఇక కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 22న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 22న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను (ఎస్ఇడి)24న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇక తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు టిటిదేవస్థానమ్స్.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి



## రేపు కపిలేశ్వరాలయంలో వినాయక చవితి వేడుకలు

**తిరుమల,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధీనంలోని తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరాలయంలో రేపు వినాయక చవితిని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి.ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, వినాయక స్వామివారి మూలవర్లకు అభిషేకం, అర్చన చేపడతారు. సాయంత్రం 5.30 గంటలకు వినాయకస్వామికి మూషికవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే తిరుమలకు వచ్చే రెండోఘాట్ రోడ్డులోని వినాయకస్వామి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా ఆరోజు ఉదయం 8 గంటలకు మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. మొదటిఘాట్‌లోని వినాయకునికి ప్రత్యేక పూజలు జరిపిస్తారు.

## ఆధారాలు ఉన్నందునే మాట్లాడుతున్నాం: మాజీ సిఎం జగన్

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:**ఆధారాలు ఉన్నందునే మెగా డీఎస్సీపై మాట్లాడుతున్నామని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెల్లండించారు. క్రీడా కోటా అవకతవకలు జరిగాయిన కచ్చితమైన సాక్ష్యాలను ముందు ఉంచినా, ప్రభుత్వం దాట వేత వైఖరికి పాల్పడుతుందని ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వం చెబుతున్న ఏడు దశల వెరిఫికేషన్ ప్రక్రియపై ఇన్ని దశల తనిఖీలు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ, అక్రమాలు వెలుగుచూడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం తేలికగా వ్యవహ రిస్తోందని సోషల్ మీడియా "ఎక్స్"వేదికగా ఆరోపించారు.ఈ సందర్భంగా జగన్ కొన్ని నిర్దిష్ట ఘటనలను ఉటంకించారు. కొందరు విజేతల పేర్లు జాబితాలో గల్లంతవడం, కొన్ని సర్టిఫికెట్లు నకిలీవని స్వయంగా ఖోఖో క్రీడా సమాఖ్య అధికారులు చెప్పడం, ఒక అభ్యర్థి పేర్కొన్న క్రీడా ఈవెంట్‌ను తాము అసలు నిర్వహించలేదని నాగార్జున విశ్వవిద్యాలయం స్పష్టం చేయడం వంటి ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.

## సిఎం పిలుపు సరైనది కాదు: విజయసాయిరెడ్డి

**విజయవాడ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో యువత ఎక్కువ మంది పిల్లల్ని కనాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన విజ్ఞప్తి చేయడం సరైన విధానం కాదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పిలుపు నిచ్చినంత మాత్రాన ప్రజలు ఎక్కువ మంది పిల్లల్ని కనరని, అందుకు అనువైన పరిస్థితులు కల్పించాల్సి న బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు.చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్లోని వైరుధ్యాన్ని విజయసాయిరెడ్డి ప్రస్తావించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒకే సంతానం, ఆయన కుమారుడికి కూడా ఒకే సంతానం. అలాంటప్పుడు ఇతరులను ఎక్కువ మంది పిల్లల్ని కనమని కోరడం హాస్యాస్పదంగా ఉంది" అని ఆయన విమర్శించారు.

## నెల్లూరులో దారుణ హత్య

**నెల్లూరు క్రైమ్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ పరిధిలోని నాలుగో మైలు సమీపంలో అశోక్ నగర్ వద్ద యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు నెల్లూరు నాలుగో మైలు అంబేద్కర్ నగర్‌కు చెందిన చెన్నయ్య, బుజ్జమ్మల కుమారుడు కె.చందు (20) దారుణ హత్యకు గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు బయలుదేరిన చందు శనివారం ఉదయం శవమై తేలాడు. అతని స్నేహితులకు కొందరు పిలవడంతో అతను బయటికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెపుతున్నారు. నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు రూరల్ సీఐ వెంకటరెడ్డి తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల ద్వారా వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు.

# అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు


### రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి.సెప్టెంబరు 12.ప్రభాతవార్తప్రతినిధి:** వినాయక చవితి సందర్భంగా ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. పండుగ రద్దీ దృష్ట్యా ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అధిక ఛార్జీల వసూళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులను దోపిడీ చేస్తే సహించేది లేదని స్పష్టం చేసిన మంత్రి, వాహనాలు 80 కిలోమీటర్ల వేగం దాటకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించే బస్సులను సీజ్ చేయాలని ఆదేశించారు. అధిక ఛార్జీలు వసూలు చేసే ప్రైవేట్ బస్సులపై ప్రయాణికులు వెంటనే ఫిర్యాదు చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితి పండగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, ప్రజా భద్రత కోసం కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నీటి కాలుష్యానికి దారితీస్తాయి. విసర్జన సమయంలో కృత్రిమ చెరువులు లేదా అధికారులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే చేయాలని సూచించారు. విద్యుత్ దీపాలు, డెకరేషన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. శబ్ద కాలుష్యం నివారించి, లౌడ్ స్పీకర్లను నిర్ణీత సమయాల్లోనే ఉపయోగించాలి. పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ జాగ్రత్తలు పాటిస్తే పండగ ఆనందంగా, సురక్షితంగా జరుగుతుందని మంత్రి వ్యాఖ్యానించారు.

# ఆపదలో అండగా.. ప్రజలకు భరోసాగా కూటమి ప్రభుత్వం

### 106 మంది లబ్ధిదారులకు రూ.64.19 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,సెప్టెంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం సహాయనిధి అంటే కేవలం ఆర్థిక సహాయం కాదని.. ఆపదలో ఉన్న కుటుంబానికి కూటమి ప్రభుత్వం అందించే భరోసా అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం, వారి కన్నీళ్లు తుడవడం, సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.నందిగామ పట్టణం పాత బస్టాండ్ సెంటర్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ నందు శుక్రవారం కూటమి నేతలతో కలిసి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.64,19,305 విలువైన చెక్కులను 106 మంది లబ్ధిదారులకు తంగిరాల సౌమ్య నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని సౌమ్య తెలిపారు. అనారోగ్యం, వైద్య ఖర్చులు వంటి అనుకోని పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకుని.. వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తాం".. అని తంగిరాల సౌమ్య గారు స్పష్టం చేశారు. నందిగామ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా తన వంతు సహకారం అందిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమం పేరుతో జరిగిన రాజకీయాలకు భిన్నంగా.. కూటమి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అందిస్తోందని కూటమి నేతలు పేర్కొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# పవన్‌ను అడ్డుకునే కుట్రలు సాగనివ్వం

### కూటమి ధర్మం పాటించాలి, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి: బొలిశెట్టి శ్రీనివాస్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు 12 ప్రభాత వార్త:** జనసేన ఎదుగుదలను అడ్డుకోవాలని, పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా వెనక్కి లాగాలని చూస్తున్న వారికి ఖబడ్దార్ అంటూ జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు.డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో రాజగోపాల్ సెంటర్లో నిర్వహించిన జనసేన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశంలో బొలిశెట్టి ఘాటుగా మాట్లాడారు. జనసైనికులను కూలీలుగా, పనికిమాలినవారిగా చూసే ధోరణి మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. జనసైనికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.కూటమి అంటే ఒకరి పెత్తనం కాదు అందరి భాగస్వామ్యం అని వ్యాఖ్యానించారు. జనసేన బలంగా ఉన్న చోట్ల ఆ పార్టీనే పోటీ చేయాలని,టీడీపీ బలంగా ఉన్న స్థానాలను ఆ పార్టీకి వదిలేయాలని సూచించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా సత్తా చాటాలని జనసైనికులకు పిలుపు నిచ్చారు. రాజ్యాధికారం దిశగా పవన్ కల్యాణ్ అడుగులు వేస్తుంటే వాటిని అడ్డుకోవాలని చూస్తున్న అంబటి రాంబాబు, పేర్ని నానిలను ఉద్దేశించి ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. జగన్‌ను అధఃపాతాళానికి తొక్కేస్తానని గతంలో పవన్ కల్యాణ్ చెప్పారని, ఆ మాటను ఆచరణలో చూపించారని పేర్కొన్నారు. రాజకీయంగా జనసేనను బలహీనపర్చే ప్రయత్నాలను కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇచ్చే అధికారం తనకు లేదని బొలిశెట్టి స్పష్టం చేశారు. జనసేన జిల్లా కోఆర్డినేటర్లు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు,జిల్లా కలెక్టర్లతో మాట్లాడి జనసైనికులకు గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతకుముందు జనసేననేత కొండ్రెడ్డి శ్రీనివాస్ ఏర్పాటు చేసిన పార్టీ స్థూపాలను బొలిశెట్టి ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భవిష్యత్‌లో సైబర్ ఫోరెన్సిక్స్, డిఎన్ఏ ప్రొఫైలింగ్ సేవల విస్తరణ

### రాజమహేంద్రవరంలో రీజినల్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ ప్రారంభం:డిజిపి హరీష్ కుమార్ గుప్తా



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫోరెన్సిక్ సేవలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఆర్ఎఫ్ఎస్ఎల్)ను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శనివారం ప్రారంభించారు. ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్‌కుమార్, ఏపీ ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ పిహెచ్ డి. రామకృష్ణ, తూర్పుగోదావరి ఎస్పీ డి నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. 2025లో రాష్ట్రంలో 1,87,721 ఎఫ్ఐఆర్‌లునమోదయ్యాయని తెలిపారు. 7 సంవత్సరాలు లేదా అంత కంటే ఎక్కువ శిక్ష పడే నేరాలకు సంబంధించిన 16,847 కేసులు ఉన్నాయని, ఫోరెన్సిక్ పరీక్షల కోసం 25,602 కేసులను ఏపీఎఫ్ఎస్ఎల్/ఆర్ఎఫ్ ఎస్ఎల్ లకు పంపినట్లు వివరించారు. 23,682 కేసులను పరిశీలించి 92.5 శాతం డిస్పోజల్ రేటు సాధించినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ఎఫ్ఎస్ఎల్లో ప్రస్తుతం బయాలజీ, సెరోలజీ, టాక్సికాలజీ విభాగాలు పనిచేస్తున్నాయని చెప్పారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాలకు ఈ ల్యాబొరేటరీ సేవలు అందించనుంది. ఏడాదికి సుమారు 2,300 కేసులను స్వీకరించే సామర్థ్యం ఉందన్నారు.రూ.3.60 కోట్ల వ్యయంతో జి+2 భవనాన్ని నిర్మించగా, రూ.2.80 కోట్ల విలువైన ఆధునిక పరికరాలను ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. భవిష్యత్‌లో సైబర్ ఫోరెన్సిక్స్, డిఎన్ఏ ప్రొఫైలింగ్ సేవలను విస్తరించే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు.

# 33/11 కేవి సబ్ స్టేషన్ శంకుస్థాపన



**చిల్లకూరు (నెల్లూరు), సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోధనం గ్రామపంచాయతీలో శనివారం గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ రూ. 3.02 కోట్ల రెండు లక్షల రూపాయలతో 33, 11 కేవీ సబ్ స్టేషన్‌కి భూమి పూజ చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఇది ఓర్వలేకే వైసిపి నాయకులు ఎక్కడ అభివృద్ధి జరగటం లేదని అసత్య ప్రసాదం చేయడం సరైన పద్ధతి కాదని మీ కళ్ళముందే ఎన్నో వేల కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే ఎక్కడ అభివృద్ధి లేదు అనడం బాధాకరం అన్నారు. కొన్ని పత్రికల్లో భూములు కుంభకోణం చేశాడు ఎమ్మెల్యే, నాయక్ల్వు చిల్లకూరు మండలంలో భూకుంభకోణం జరిగిందని అసత్యాలు రాస్తున్నారని సక్రమంగా విచారణ చేసుకుని న్యాయబద్ధంగా రాయాలని కొంత మంది విలేకరులకు సూచించారు ఎక్కడైనా భూ కుంభకోణం జరిగి ఉంటే విచారణకి మేమంతా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి, ఎంపీడీవో వెంకటరావు, నాయకులు సురనేని రామచంద్రరావు, సుమిత్ర, చిట్టేటి నారాయణ, గుండాల లీలావతి, చిట్టేటి కీరవాణి, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో భక్తులతో ముచ్చటించిన ఇఒ

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన అన్నదాన భవనంలో భక్తులకు అన్నప్రసాదం శనివారం అందించారు. ఇఒ వికె శీనా నాయక్ ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడి సంతృప్త స్థాయి తెలుసుకున్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం విజయవాడకు చెందిన రాంపిళ్ల పద్మజ, ఆర్ వెంకట రమణలు రు.1,00,116ల విరాళం అందించారు. శ్రీకాకుళంకు చెందిన సవ్వాన శ్రీనివాసరావు, బుర్రా రాంబాయి, వారి కుటుంబసభ్యులతో కలిసి రు.1లక్ష విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. విజయవాడకు చెందిన ఆర్ వెంకట సన్యాసిరావు కుమారుడు ఆర్ విశ్వసాయి హవిష్ రు.1,5లక్ష నిత్యాన్నదానంకు, శివాలయాభివృద్ధికి రు.1,02,000లు, బంగారు అభివృద్ధి ట్రస్టుకు రు.1లక్షల వెరసి రు.3.52లక్షల విరాళం అందిం చారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.





## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

### చిన్న పంచాయతీల్లోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు: సోమిరెడ్డి

**నెల్లూరు. సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** తోటపల్లిగూడూరు మండలం విలుకానిపల్లిలో అభివృద్ధి పనుల ప్రారం భోత్సవం సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆర్డీఎస్ఎస్‌లో భాగంగా రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన త్రీఫేజ్ లైన్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన సోమిరెడ్డిఏకే నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించబోతున్న దేవాలయం నిర్మాణానికి భూమి పూవిలుకానిపల్లిలో ప్రధాన గ్రామంతో పాటు లక్ష్మీపురంలో మిన రల్ వాటర్ ప్లాంట్ల ప్రారంభోత్సవం సోమిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా ముందుకు సాగుతున్నాయి.ఒక్క విలుకానిపల్లే కాదు చిన్నచిన్న గ్రామాల్లోనూ కోట్లాది రూపాయలతో అభి వృద్ధి పనులు చేపడుతున్నాం అదే సమయంలో ప్రతి గ్రామంలోనూ ప్రజలకు కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాల లబ్ధి



## కోనలో నృసింహుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

### రూ.4,60,807 రాబడి

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు,క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఇన్‌చార్జ్ ఇఒ జనార్ధన్ రెడ్డి పర్యవేక్షించారు.శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.4,60,807 రాబడి వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఇఒ జనార్ధన్ రెడ్డి తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలి: ప్రతాప్ స్వామి

**తిరుపతి,సెప్టెంబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి, రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.విఘ్నేశ్వరుడి ఆరాధనలో భక్తితో బాటు ప్రకృతి పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయని, అందువల్ల ప్రతి కుటుంబం సహజ సిద్ధమైన మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.పీ. ఆనంద్, పురోహితుడు సురేష్ స్వామి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొట్టే సుబ్రమణ్యం, కే.ఎన్. రాజా, లక్ష్మయ్య, చంగల్ రాయులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## నెల్లూరు 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాకు ప్రారంభం

**నెల్లూరు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాకుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయ వాడలో నిర్వహించగా, గౌరవ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్రిటి కల్ కేర్ సదుపాయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు క్రిటికల్ కేర్ ఆస్పత్రి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది వర్చువల్ విధానంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. మాధవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 12, ప్రభాత వార్త:** వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో చెన్నై నుంచి గన్నవరం వెళ్తున్న ఇండిగో విమానం రాజమండ్రి విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలో మొత్తం 65 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.చెన్నై నుంచి బయలుదేరిన విమానం గన్నవరం విమానాశ్రయం వైపు వెళ్తుండగా అక్కడ వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో విమానాన్ని గన్నవరం విమానాశ్రయంలో ల్యాండ్ చేయడం సాధ్యం కాకపోవడంతో పైలట్ రాజమండ్రి విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు నిర్ణయించినట్లు సమాచారం.విమానాన్ని రాజమండ్రి విమానాశ్రయంలో సురక్షితంగా దించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంలో విమానాశ్రయ అధికారులు, సిబ్బంది అప్రమత్త మయ్యారు. ప్రయాణికులకు అవసరమైన ఏర్పాట్లు చేసారు.వాతావరణం సాధారణ స్థితికి వచ్చిన అనంతరం విమానాన్ని గన్నవరం తరలించే అవకాశం ఉందని సమాచారం.

13-9Pg7exHMNWJQE:13-9Pg7exHMNWJQE.qxd 9/13/2026 12:01 AM Page 1



## కొడుకు కోసం చేసిన పోరాటమే.. తల్లికి చివరి ప్రయాణం



**ఒంగోలు క్రైమ్ ప్రభాతవార్త:** తన కొడుకు తౌషిక్ (11) మృతికి న్యాయం చేయాలంటూ సుమారు ఏడు నెలలుగా కన్నీళ్లతో, ఆవేదనతో, అలుపెరగని పోరాటం చేసిన ఓ తల్లి చివరకు అదే పోరాటంలో తన ప్రాణాలను కోల్పోయింది. కనిగిరి ప్రాంతానికి చెందిన మోలాబీ కుమారుడు తౌషిక్ సింగరాయకొండ మండలం ములగుంట పాడులోని శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో నవోదయ ప్రవేశ పరీక్షకు ప్రత్యేక శిక్షణ పొందుతూ వసతిగృహంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బాత్ రూమ్‌లో హ్యాంగర్‌హుక్‌కు టవల్‌తో ఉరివేసుకున్న స్థితిలో తౌషిక్ మృతదేహం లభించడంతో తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేశారు. తన కుమారుడి మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తిచేసి, నిజాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ మోలాబీ అప్పటి నుంచి న్యాయపోరాటం ప్రారంభిం చారు. అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మోలాబీ రెండు రోజుల క్రితం సింగరాయకొండలోని అదే కోచింగ్ సెంటర్‌ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డారు. అంతకుముందు తన ఆవేదనను సెల్ఫీ వీడియో ద్వారా భర్త, బంధువు లకు తెలియజేసి,తన రెండో కుమారుడిని జాగ్రత్తగా చూసుకోవాలని కోరినట్లు సమాచారం. తనచావుకు కారణమైనవిషయాలనులేఖలో రాసినట్లు పేర్కొన్నారు.



## ఒంగోలు జిజిహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త:** పేదలు, సామాన్య ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యవసర వైద్య సేవలను ఉచితంగా అందించడమే లక్ష ్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో మౌలిక వసతులను విస్తరిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రాంగణంలో పీఎంఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల పథకం కింద రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక 50 పడకల అత్యవసర చికిత్సా విభాగాన్ని శనివారం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యక్షంగా ప్రారంభించారు. అంతకుముందు అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జే.పి. నడ్డా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాష్ట్రంలోని క్రిటికల్ కేర్ కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు.



## అధైర్య పడొద్దు... మీకు అండగా ఉంటాం

### స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

**విజయనగరం, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం మరియు విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలోశాసన మండలి ప్రతిపక్ష నాయకులు మాజీ మంత్రి వర్యులు బొత్సా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలన సగం సమయం పూర్తి చేసుకుంది. టీడీపీ సినిమాకు ఇంటర్వెల్ అయిపోయింది. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా వైఎస్ జగన్ పరిపాలనే బాగుం దేది అనే చర్చ జరుగుతోంది. వైసీపీ హయాంలో ఎక్కడా లేనివి ధంగా ఒకే నోటిఫికేషన్‌తో పెద్ద ఎత్తున సచివాలయ ఉద్యోగుల నియామకాలు పూర్తి చేస్తే ఒక్క ఆరోపణ కూడా రాలేదు. కానీ కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించింది. రెండేళ్లుగా రైతాంగం కష్టాలు అన్నీఇన్నీ కావు. విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ర్యాలీలు చేస్తున్న పరిస్థితి ఉంది. తెలుగుదేశం పార్టీ ఇంటింటికీ టీడీపీ చేపడితే ప్రజలెవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఎంతో మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారు. వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకుంటునే క్యాడర్‌కు న్యాయం జరుగుతుంది. ప్రతి నియోజకవర్గంలో 9 వేలు నుంచి 10 వేల మంది వరకు ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్నాం. మన కష్టానికి గుర్తింపు ఈ ఐడీ కార్డు. ప్రతీ ఒక్కరికీ ఈ కార్డులను అందజేస్తాం. రెండేళ్ల కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పటిష్టమైన నెట్‌వర్క్ ఏర్పడింది. రెండేళ్ల కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ఈ ప్రభుత్వంలో అమరావతిలో తప్పితే ఎక్కడ అభివృద్ధి లేదు. ఇతర ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. విజయనగరం జిల్లాలో స్థానిక సంస్థల స్థానాల్లో మనం విజయకేతనం ఎగురవేద్దాం.పెద్దలు శాసన మండలి ప్రతిపక్ష నాయకులు ఏమన్నారంటే స్థానిక సంస్థల ఎన్నికలను బలంగా ఎదుర్కొందాం. ప్రతిపక్షం మనకు కొత్త ఏమీ కాదు. 2014లో మన పార్టీ గెలవకపోయినా, ఎవరూ అధైర్యపడలేదు. కలిసికట్టుగా పనిచేసి 2019లో విజయం సాధించాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశాం. కుల, మత, ప్రాంత, రాజకీయాలు చూడకుండా పథకాలు అందజేశాం. ప్రజా సేవే పరమావధిగా పని చేశాం. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చాం. కానీ ఐదేళ్లలో మనం చేసిన మంచిని బలంగా చెప్పుకోలేకపోయాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొన్ని విషయాల్లో మనం వెనుకపడ్డాం. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితి రాకుండా చూసుకుందాం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తే అధినేత.ఈ విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు. పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుదాం. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల సమయంలో అందరూ జాగ్రత్తగా ఉండాలి. సమర్థవంతులైన అభ్యర్థులను నిర్ణయించుకుని గెలిపించుకుందాం. బహుశా అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఎన్నికలు ఉంటాయి.సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి వైయస్సార్ సీపీకార్యకర్తలపై కేసులు పెట్టడమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు.

## రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

### సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ..

**రాప్తాడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతాంగం కోలుకోలేని దెబ్బతిన్నందున జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి అనంత రైతులను ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం రాప్తాడు మండలంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి. జాఫర్ , జిల్లా కార్యదర్శి పి. నారాయణస్వామి, ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణలతో కలిసి ఎండిపోయిన వేరుశనగ, కంది పంటలతో పాటు నీరు లేక ఎండిపోతున్న పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని 31 మండలాల్లోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# 35 వేల మంది విద్యార్థులు గైర్హాజరు

## వరుస సెలవులతో ముందురోజే ఇళ్ల బాట పట్టిన విద్యార్థులు

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో అనంతపురం జిల్లాలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరైన ఘటన విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. సుమారు 35 వేల మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాలేదన్న సమాచారం జిల్లాలో విద్యార్థుల హాజరు పరిస్థితిపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల గైర్హాజరు నమోదైన జిల్లాల్లో అనంతపురం రెండో స్థానంలో నిలిచినట్లు తెలుస్తోంది.

వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో కొంతమంది విద్యార్థులు సెలవులు ప్రారంభం కాకముందే ఇళ్లకు వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు గణనీయంగా తగ్గింది. అయితే సెలవులకు ముందు రోజే విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, పాఠశాలల స్థాయిలో ముందస్తు పర్యవేక్షణ, తల్లిదండ్రులతో సమన్వయం ఎంతవరకు జరిగిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.




అనంతపురం జిల్లాలో దాదాపు 2 వేల పైగా పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఒకటవ తరగతి నుండి ఇంటర్ వరకు దాదాపు 3 లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతిరోజు విద్యార్థులు పాఠశాలకు వచ్చిన వెంటనే ఆయా తరగతుల టీచర్లు లీప్ యాప్ లో అటెండెన్స్ వేస్తున్నారు. అయితే ఈ విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటి నుండి గైరహాజరు శాతం పెరుగుతూనే ఉంది. అందులో భాగంగానే ఈనెల 11వ తేదీ 35 వేల మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆ రిపోర్టును జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అందులో భాగంగా శనివారము సెలవు రోజు అయినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారి డిప్యూటీ డీఈఓ లు, ఎంఈఓలు తో వెబెక్స్ నిర్వహించారు. ఏదైనా అడిగితే హెచ్ఎంలు స్పందించడం లేదని డిప్యూటీ డీఈఓ లు, ఎంఈఓలు జిల్లా విద్యాశాఖ అధికారికి తెలిపారు.

**గైర్‌హాజరు శాతాన్ని తగ్గిస్తాం : డీఈఓ డా.ఎన్. అయూబ్ హుస్సేన్**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడం సంతోషంగా ఉంది. అయితే పాఠశాలకు వస్తున్న విద్యార్థులలో విద్యార్థి అయిన మూడు రోజులు పాఠశాలకు రాకపోతే సంబంధిత టీచర్ ఆ విద్యార్థి ఇంటికి వెళ్లి ఆరా తీయాలి. అలా బాధ్యతగా పనిచేసినప్పుడే గైరహాజరు శాతం తగ్గుతుందన్నారు.

## బిసి రక్షణ చట్టం అమలుకు చర్యలు : మంత్రి సవిత

**విజయవాడ, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బీసీల రక్షణకు పటిష్టమైన చట్టాన్ని రూపొందిస్తున్నామని, ఈచట్టానికి తుదిమెరుగులు దిద్దుతున్నట్లు రాష్ట్ర బీసీ, చేనేత జౌళిశాఖామ ంత్రి ఎస్.సవిత బీసీలకు భరోసా ఇచ్చారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో శనివారం వివిధ కార్పోరేషన్‌ల చైర్మన్‌లతో బీసీ రక్షణ చట్టంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోర్టుల్లో బలంగా నిలబడేలా బీసీరక్షణ చట్టాన్ని తయారు చేస్తున్నామని, దీనిలో భాగంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, యంపిలు, ఎమ్మెల్సీ లతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించినట్లు చెప్పారు. ఎన్నికల ముందు పాతయాత్రలో లోకేష్ ఇచ ్చిన హామీమేరకు ఈచట్టం రూపుదిద్దుకుంటున్నట్లు మంత్రి వివరించారు. బీసీలను కులం, వృత్తులపేరుతో దూషించినా, సంఘ బహిష్కరణలు చేసినా, చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి బీసీలపై జరిగే దాడుల కేసులను రెండు నెలల్లో కేసుల దర్యాప్తు పూర్తిచేసేలా నిబంధనలు రూపొందిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో బీసీల ఆత్మగౌరవం పెంపొందించేలా కూటమి ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. టిడిపి బీసీల పార్టీగా పేర్కొన్న ఆమె చంద్రబాబునాయుడు బీసీల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తున్నారని తెలియచేసారు. అన్న ఎన్‌టిఆర్ తొలిసారి బీసీలకు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించగా, చంద్రబాబు వాటిని 34శాతానికి పెంచితే జగన్‌మోహన్‌రెడ్డి వాటిని 24శాతానికి తగ్గించి బీసీలకు అన్యాయం చేసారని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో 90శాతం హామీలను తమ ప్రభుత్వం అమలు చేసిందని మంత్రి ధీమా వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో బీసీలకు ఎక్కువ శాతం అందుతున్నాయన్నారు. అమరావతి, పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలో ఆదరణ 3.0ను అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సూచించారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసిన జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేసారు. ఈసందర్భంగా మంత్రిని కార్పోరేషన్‌ల చైర్మన్‌లు శాలువలతో సత్కరించారు. ముందుగా ఎన్‌టిఆర్, మహాత్మజ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యన్నారాయణ, బీసీసంక్షేమ కార్పోరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, నందం అబద్దయ్య, పేరేపి ఈశ్వరరావు, నర్సింహయాదవ్, మల్లెల ఈశ్వర్, దేవేంద్రప్ప, చిలకలపూడి పాపారావు, కొల్లు పెద్దిరాజు, సిఆర్.రాజన్,తదితరులు పాల్గొన్నారు.

## స్టైపెండ్ ఇవ్వాలంటూ పారామెడిసిన్ విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

**తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** తిరుపతి అలిపిరి గరుడ విగ్రహం వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ పేరామెడికల్ విద్యార్థులు యస్‌యఫ్ఐ విద్యార్థి నాయకులు రోడ్లపై బైఠాయించి నిరసన తెలుపారు. వెస్ట్ పోలీసులు సమాచారం మేరకు తిరుపతి పేరామెడిసిన్ విద్యార్థులు తమకు స్టైఫండ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గత పది రోజులుగా నిరసనలు తెలియజేస్తున్న సంగతి విధితమే. ఇందులో భాగంగా శనివారం ఎస్‌ఎఫ్ఐ విద్యార్థులతో కలిసి పేరా మెడిసిన్ విద్యార్థులు రూయ ఆసుపత్రి నుంచి ర్యాలీగా ప్రారంభమై గరుడ విగ్రహం వరకు చేరుకున్నారు. అనంతరం ఎస్‌ఎఫ్ఐ విద్యార్థులు రోడ్లపై బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. యాత్రికులు మరియు ఆస్పత్రులకు వచ్చే రోగుల వాహనాలకు ఆటంకం కలగడంతో పోలీసులు హుటాహుటిన రోడ్లపై నుండి విద్యార్థులను బలవంతంగా తొలగించారు. ఇందులో భాగంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలను పోలీసులు చెయి బట్టి రోడ్లపై నుండి తొలగిస్తున్న సందర్భంలో పొరపాటున తన చేతితోపాటు నాయకురాలి జుట్టు కూడా పట్టుకోవడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనంతరం బాధితురాలు ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు సుధా పాత్రికేయులతో మాట్లాడుతూ పోలీస్ వారు తన చేతులు మాత్రమే లాగారని పొరపాటున జుట్టుని కూడా కలిపి పట్టుకోవడంతో యాదృచ్ఛికంగా జరిగిందని వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో తన విధులను నిర్లక్ష్యంగా వ్యవహరించి సాంఘిక మాధ్యమాల ద్వారా వైరల్ అయినందుకు ఏఎస్ఐ లక్ష్మీ కుమారిని పోలీసులు విఆర్‌కు తరలించి శాఖ పరమైన చర్యలు చేపట్టారు. నిరసనలు బాధ్యతాయుతంగా వ్యవహారించాలి: నిరసనకారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏఎస్‌పి రవి మనోహర్ ఆచారి సూచించారు. నిరసన తెలుపడం ప్రతి ఒక్కరు హక్కు అని దానిని ఎవరికి ఇబ్బంది కలగకుండా సక్రమమైన మార్గంలో నిర్వహించాలని తెలిపారు. సామాన్య ప్రజల జీవన విధానానికి అడ్డుపడితే వారిపై శాఖ పరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

## దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలు: ముగ్గురు నిందితుల అరెస్ట్

### పలు కేసులు ఛేదించిన శ్రీకాకుళం రూరల్ పోలీసులు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను శ్రీకాకుళం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారని కేసు వివరాలు టౌన్ డీఎస్పీ వివేకానంద వివరించారు. దేవాలయాల్లోని హుండీలు, విలువైన బంగారు, వెండి ఆభరణాలు మరియు ఇతర వస్తువులను అపహరించడమే లక్ష్యంగా నిందితులు నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కేసు ప్రాపర్టీ స్వాధీనం : రూ.16 లక్షల విలువైన 1 తులం బంగారం,6 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం. అరెస్టు చేసిన నిందితులు :1.ఇజ్జాడ గౌరీప్రసాద్ విజయ్, 2.తమిరి రాజారావు, 3.కరిమజ్జి గోవింద్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించిన వివరాలు : పాత్రునివలస దుర్గాదేవి ఆలయంలో బంగారు, వెండి ఆభరణాలు, పూజా సామగ్రి దొంగతనం, ఎస్.ఎం.పురం, ఎచ్చెర్ల రామాలయంలో రాములవారి, సీతమ్మవారి వెండి కిరీటాలు, శఠగోపం, పూజా సామగ్రి తదితర వెండి వస్తువుల దొంగతనం, కేశవరావుపేట, ఎచ్చెర్ల ఆంజనేయస్వామి ఆలయంలో వెండి శఠగోపం, కాసులహారం, సీతా రాముల వారి బల్ల తదితర వస్తువుల దొంగతనం, లచ్చన్నపేట, బూర్జ నీలమణి దుర్గాదేవి ఆలయంలో రెండు హుండీలు పగులగొట్టి సుమారు రూ.5,000/ నగదు అపహరణ, సింగన్నపాలెం, బూర్జ: ఆంజనేయస్వామి ఆలయంలోకి ప్రవేశించి సుమారు రూ.10,000/ నగదు దొంగతనం, శ్రీకాకుళం: గైనేటి వీధిలో పల్సర్ మోటార్‌సైకిల్ దొంగతనం, వింజంపాడు, కోటబొమ్మాళి: బాబా దేవాలయంలో కిరీటం దొంగతనం చేసి, హుండీ పగులగొట్టి సుమారు రూ.500 నగదు అపహరణ ఇలా పలు దొంగతనాలు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో నిందితులు రాత్రి వేళల్లో ఒంటరిగా లేదా జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలను గుర్తించి, తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి విలువైన వస్తువులను అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.

నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, పలు దేవాలయ దొంగతనం కేసుల్లో వారి ప్రమేయం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారిని శనివారం రణస్థలం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి కేసు ప్రాపర్టీగా సుమారు రూ.16 లక్షల విలువైన ఒక తులం బంగారం మరియు 6 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దేవాలయాల వద్ద భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయడంతో పాటు, రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని శ్రీకాకుళం జిల్లా పోలీసులు ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు మరియు దేవాలయాల భద్రతకు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

ఈ కేసును టౌన్ డీఎస్పీ సీహెచ్. వివేకానంద పర్యవేక్షణలో రూరల్ సీఐ పైడప్పు నాయుడు, రూరల్ ఎస్సై సురేష్ మరియు పోలీసు కానిస్టేబుల్ జగదీశ్, త్రినాథ్, బాబురావు, సూరిబాబు,వేణు రవి అను పోలీసు సిబ్బంది సమర్థవంతంగా ఛేదించారు. వారి కృషిని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## డేటింగ్ యాప్‌లో లాభాలంటూ హైదరాబాద్‌వాసికి రూ.3.5 కోట్ల టోకరా

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా వుండాలని పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా మోసపోతున్న వా రి సంఖ్య పెరుగుతూనే వుంది. హైదరాబాద్‌కు చెందిన ఓ మధ్య వయస్కుడిని గుర్తు తెలియని మహిళ డేటింగ్ యాప్ పేరిట నమ్మించి మూడు కోట్ల 35 లక్షల రూపాయలు కాజేసింది. మొదట సదరు మహిళ ఫేస్ బుక్, మెటాకు సంబంధించిన ప్రకటనలతో అమాయకులకు ఎరవేసి ంది. దీనిని నమ్మిన నగర వాసి ఒకతను ఆమెతో మాట్లాడగా తీయటి మాటలతో సదరు మహిళ బురిడి కొట్టించింది. తాను సూచించిన డేటిం గ్ యాప్‌లో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించింది.

మొదట్లో లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వర కు సదరు వ్యక్తి నుంచి తీసుకుని ఐదు వేల రూపాయలు, పది వేల రూపాయలు లాభాలు ఇచ్చిన ఆ మహిళ ఆ తరువాత మరింత లాభాల పే రిట 55 రోజుల వ్యవధిలో మూడు కోట్ల 35 లక్షల రూపాయలను వసూలు చేసింది. లాభాల కోసం అడిగితే మరింత డిపాజిట్ చేయాలని చెప్పింది.

దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన టిజిసిఎస్‌బి అధికారులు బాధితుడి ఖాతా నుంచి నగదు ఏ ఖాతాకు వెళ్లిందనే దానిపై విచారణ చేబట్టారు.

## డిగ్రీ కాలేజీల పోస్టులకు సంబంధించి టిజిపిఎస్ నోటిఫికేషన్‌లు రద్దు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిగ్రీ కాలేజీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022 డిసెంబర్ నెలలో విడుదల చేసిన బ్రీఫ్ నోటిఫి కేషన్‌ని కమిషన్ రద్దు చేసింది. 33/2022 నెంబర్‌తో 2022 డిసెంబరు 31న జారీచేసి ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సమగ్రంగా చర్చించి, అన్ని పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత 544 ఖాళీల కోసం ఇచ్చిన ఈ బ్రీఫ్ నోటిఫికేషన న్ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

ఈ నిర్ణయానికి అనుగుణంగా కొత్త రోస్టర్ ద్వారా త్వరలోనే సరికొత్త నోటిఫికేషన్ విడుదల చేయబడుతుందని అభ్యర్థులందరికీ టిజిపిఎస్‌సి తెలియజేసింది. ఈ సమాచారాన్ని టిజిపి ఎస్ సి కార్యదర్శి వెబ్ నోట్ ద్వారా తెలియజేశారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ సందర్శించి తెలుసుకోవచ్చు.



## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

### 100 కోట్లతో తొంభై ఆరు పనులకు ప్రతిపాదనలు సిద్ధం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు12, ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, సంబంధిత అధికారులు హాజరయ్యారు. గోదావరి పుష్కరాల నేపథ్యం లో రాజమహేంద్రవరంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, అభివృద్ధి పనుల ప్రారంభంపై మంత్రి నారాయణ అధికారుల తో చర్చించారు. పుష్కరాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నగర అభివృద్ధికి సంబంధించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు సుమారు రూ. వంద కోట్లతో తొంభై ఆరు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రి నారాయణకు వివరించారు. ఆయా పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి ప్రాధాన్యతపై మంత్రి సమీక్షి ంచారు.అదేవిధంగా హెచ్ఏఎం పథకం కింద రూ. మూడు వందల కోట్లతో చేపట్టిన పనుల పురోగతిపై మంత్రి అధికారులతో చర్చించారు. ఆయా పనులు నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగంగా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజాప్రతినిధులతో చర్చించి నగరానికి అవసరమైన పనులను గుర్తించి వెంటనే ప్రారంభించాలని మంత్రి నారాయణ అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయిన్లు, డివైడర్లు, లైటింగ్, గ్రీనరీ వంటి మౌలిక వసతుల పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు.గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అభివృద్ధి, మౌలిక వసతుల పనులను సమన్వయంతో చేపట్టాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల, సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న టిటిడి ఎస్వీ అన్నన్రసాదం ట్రస్ట్‌కు దాత విరాళమిచ్చారు. బెంగుళూరు దాత గిరియప్ప దయానంద వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 50 లక్షలు, ప్రాణదాన ట్రస్టుకు 50 లక్షలు కలపి కోటిరూపాయలు విరాళంగా అందించారు. తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కులను అందజేశారు.

## వినాయక చవితి మండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

### జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, ఉత్సవ కమిటీలు జిల్లా పోలీసులకు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా కోరారు. వినాయక విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను గణేష్‌ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్‌లో పొందవచ్చని తెలిపారు. పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతులను ఒకే వేదిక ద్వారా సమన్వయం చేసే విధంగా సింగిల్ విండో విధానం అందుబాటులో ఉందన్నారు. వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా పొందాలని, అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ఉత్సవ నిర్వాహకులు విద్యుత్ వైరింగ్, జనరేటర్ల ఏర్పాటులో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ సూచనలు పాటించాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని, మహిళలు మరియు చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, అధిక శబ్దం నిచ్చే డీజేలు వినియోగించరాదు అని, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో నిర్దేశిత సమయాలు, శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం చేయరాదని, పటాకుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు వారు సూచించిన నదులు, చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేసే సమయంలో పోలీసు, సంబంధిత శాఖల సూచనలు పాటించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి వినాయక చవితి పండుగను ఆనందంగా, సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు.

# సినిమా అవకాశాల పేరుతో మోసం

### ఢీ-10 విన్నర్ రాజు అరెస్ట్

**హైదరాబాద్ (మియాపూర్), సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ఢీ10 డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. లైంగికంగా వేధించాడని, సినిమా అవకాశాల పేరుతో మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 9న కేసు నమోదు అయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు రాజును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అయితే రాజుపై కేసు నమోదు చేసిన విషయాన్ని మియాపూర్ పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడంతో డ్యాన్స్ షో వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



రాజు (ఫైల్)

13-09pg10:13-09pg10.qxd 9/12/2026 10:44 PM Page 1






## మహిళల ఆసియా కప్..
# ఫైనల్‌కు భారత్
### దక్షిణ కొరియా ఓటమి

**హులున్‌బుయిర్ (చైనా):** దక్షిణ కొరియాను ఓడించిన భారత్, మహిళల జూనియర్ ఆసియా కప్ 2026 ఫైనల్‌కు చేరింది. చైనాలోని హులున్‌బుయిర్ నగరంలో జరుగుతున్న మహిళల జూనియర్ ఆసియా కప్ 2026, భారత్ శనివారం దక్షిణ కొరియాను 5-1 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. మ్యాచ్ ప్రారంభం ఉత్కంఠభరితంగా సాగడంతో, ఇరు జట్లు జాగ్రత్తగా ఆటను ప్రారంభించాయి. భారత్ 13వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించింది. ఈ దాడిలో మధు సిదర్ తుది మెరుగులు దిద్ది భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండవ క్వార్టర్‌లో (17వ నిమిషం) పెనాల్టీ కార్నర్ లభించగా, సుప్రియ ముందుకు వచ్చి కొరియా రక్షణ శ్రేణిని దాటుకుంటూ ఒక కచ్చితమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. నిమిషంలో మరోసారి ప్రతిఫలం లభించింది.

కొరియా పంపిన బంతి (21వ) భారత వింగర్‌కు చేరగా, ఆమె అందించిన క్రాస్‌ను సుఖ్‌వీర్ కౌర్ గోల్‌గా మలచి స్కోరును 3-0కి చేర్చింది. విరామం తర్వాత భారత్ దూకుడుగా ఆడి (33వ) తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మరో పెనాల్టీ కార్నర్ లభించడంతో సుప్రియ తన రెండవ గోల్‌ను సాధించి భారత్‌ను 4-0 ఆధిక్యంలో నిలిపింది. చివరకు (41వ) ముందడుగుతో యూరి జియోంగ్ ఒక సెట్‌పీస్‌ను గోల్‌గా మలిచి కొరియా లోటును 4-1కి తగ్గించింది. ఆఖరి పావుగంటలో భారత్ తమ రక్షణ వ్యవస్థను పటిష్టం చేసుకుని, కొరియన్లకు పోటీలోకి తిరిగి వచ్చేందుకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా (56వ) మరో పెనాల్టీ కార్నర్ ద్వారా సుప్రియ తన హ్యాట్రిక్‌ను పూర్తి చేసి, 5-1 తేడాతో ఘన విజయాన్ని ఖాయం చేసింది.




## ప్రపంచ ఛాంపియన్‌షిప్..
# ఎయిర్ పిస్టల్‌లో భక్తికి కాంస్యం

**చాంగ్వాన్:** డబ్ల్యూఎస్‌పిఎస్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ 2026, 10మీ ఎయిర్ పిస్టల్ భక్తి శర్మ కాంస్యం గెలుచుకోవడమే కాకుండా జూనియర్ క్వాలిఫికేషన్ ప్రపంచ రికార్డును కూడా నమోదు చేసింది. చాంగ్వాన్‌లో జరుగుతున్న వరల్డ్ షూటింగ్ పారా స్పోర్ట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, శనివారం భారత క్రీడాకారిణి భక్తి శర్మ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 ఫైనల్‌లో 213.1 స్కోరు సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్‌లో సృష్టి కంటే ఒక స్థానం దిగువన ఆరో స్థానంలో నిలిచినప్పటికీ, భక్తి 565 స్కోరుతో కొత్త జూనియర్ ప్రపంచ రికార్డును నమోదు చేసింది. సృష్టి 566 స్కోరు సాధించింది. టీమ్ ఈవెంట్‌లో సృష్టి, భక్తి, సుమేధల ముగ్గురి సంయుక్త స్కోరు 1690తో భారత్ రజతం గెలుచుకుంది. ఇరాన్ 1707 స్కోరుతో కొత్త రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. చైనా టీమ్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఇరాన్‌కు చెందిన నస్రీన్ షాహి సమఖౌన్, భక్తిని స్వల్ప తేడాతో ఓడించి రజత పతకాన్ని గెలుచుకోగా, ఆమె సహచరి ఫైజే అహ్మాది 238.3 స్కోరుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే ఫైనల్‌లో ఉన్న ఏకైక మరో భారతీయ క్రీడాకారిణి అయిన సృష్టి అరోరా ఐదవ స్థానంలో నిలిచింది. ఒకే ఒక్క పాయింట్ తక్కువ పడటంతో సుమేధా పాఠక్ టాప్ ఎనిమిది స్థానాల వెలుపల నిలిచారు. మరోవైపు, 2024 పారాలింపిక్స్ కాంస్య పతక విజేత రుబీనా ఫ్రాన్సిస్ 554 స్కోరు సాధించి, 18వ స్థానంతో ఈ పోటీలను ముగించారు

## వియత్నాం ఓపెన్..
# ఫైనల్‌కు ఇషా..
### తన్వి ఓటమి

**వియత్నాం:** భారత్ అథ్లెట్ ఇషారాణి బారువా స్వదేశానికి చెందిన రక్షితను ఓడించి వియత్నాం ఓపెన్ 2026 ఫైనల్‌కు చేరుకుంది. ఇదే సమయంలో వితిద్‌సర్న్ చేతిలో తన్వి శర్మ ఓడిపోయింది. ఇషా శనివారం ఇక్కడ తన తోటి క్రీడాకారిణి రక్షిత శ్రీ రామ్‌రాజ్‌ను సునాయాసంగా ఓడించింది. మూడో సీడ్ క్రీడాకారిణి 39 నిమిషాల్లో 21-10, 21-18 తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఇషా గత రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ చింగ్ పింగ్‌ను 21-15, 21-18 తేడాతో ఓడించగా, మొదటి రౌండ్‌లో బై లభించడంతో రౌండ్ ఆఫ్ 16లో మలేషియాకు చెందిన గో జిన్ వెయిని ఓడించింది. మరో సెమీఫైనల్‌లో టాప్ సీడ్ తన్వి శర్మ, థాయ్‌లాండ్‌కు చెందిన సరున్రాక్ విటిడ్సార్న్ చేతిలో 19-21, 20-22 తేడాతో ఓడిపోయింది. ఇక పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ జియా హెంగ్ టెహ్ చేతిలో 13-21, 8-21 తేడాతో ఓడిపోవడంతో హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా సెమీఫైనల్ దశలోనే టోర్నమెంట్ నుండి నిష్క్రమించాడు.











## మహిళల ఆసియా కప్..
# నేడు భారత్, శ్రీలంక మహా సమరం
### ఎనిమిదో టైటిల్‌కై హర్మన్‌ప్రీత్ సేన దృష్టి

**దుబాయ్:** ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్, దుబాయ్‌లో ఆదివారం రాత్రి 8 గంటలకు జరిగే 2026 మహిళల టీ20 ఆసియా కప్ ఫైనల్‌లో ఎనిమిదో టైటిల్‌ను సాధించేందుకు హర్మన్‌ప్రీత్ సేన పట్టుదలతో ఉంది. శ్రీలంకతో తలపడనున్న నేపథ్యంలో, మరోసారి షఫాలీ వర్మ, దీప్తి శర్మల ప్రదర్శనపై ఆశలు పెట్టుకుంది. రెండు అర్ధశతకాలతో సహా 168 పరుగులు చేసిన షఫాలీ ఖండాంతర టోర్నమెంట్‌లో భారత అత్యుత్తమ బ్యాటర్‌గానే కాకుండా, అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా కూడా నిలిచింది. స్మృతి మంధాన (154) సెంచరీ చేసి రెండుసార్లు సింగిల్ డిజిట్ స్కోర్లు కూడా చేసి నిలకడలేని ప్రదర్శన కనబరుస్తున్నప్పటికీ, షఫాలీ మాత్రం బ్యాటింగ్‌లో స్థిరత్వాన్ని కొనసాగించగలిగింది. మరీ ముఖ్యంగా, తన చుట్టూ ఉన్నవాళ్లు ఇబ్బంది పడిన ఆటలలో కూడా షఫాలీ తన స్ట్రోక్‌లను చాలా సునాయాసంగా ఆడింది. పొదుపుగా ఆడే శ్రీ చరణీ జట్టులో చేరడం, ప్రేమా రావత్ కూడా లయ అందుకోవడంతో అత్యంత ముఖ్యమైన స్పిన్ బౌలింగ్ విభాగానికి పటిష్టంగా ఉంది. 2024లో జరిగిన గత ఎడిషన్ ఫైనల్‌లో తమను 8 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలు చేసిన పట్టుదల గల శ్రీలంక జట్టు పట్ల భారత్ అప్రమత్తంగా ఉండనుంది. కెప్టెన్ తన ఒడిదుడుకుల కెరీర్ పొడవునా ప్రదర్శించిన అదే పట్టుదలను అథపత్తు జట్టు కూడా కనబరుస్తోంది. సెమీఫైనల్‌లో ప్రతికూల పరిస్థితుల్లో పాకిస్థాన్‌పై విజయం సాధించడానికి వారు చూపిన పట్టుదలే ఇందుకు ఇటీవలి ఉదాహరణ. హర్షిత సమరవిక్రమ 36 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, మరో ఎండ్‌లో కవిషా దిల్హరి (33) అందించిన బలమైన సహకారంతో శ్రీలంక తిరిగి గాడిలో పడింది. ఇక క్లిష్టమైన ముగింపులో నీలక్షిక సిల్వా, కౌశిని నుత్యాంగన జోడి ప్రశాంతంగా, నిలకడగా ఛేజింగ్‌ను పూర్తి చేసింది. కాగా బలహీనమైన బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్‌లో భారత్ 4 క్యాచ్‌లు జారవిడవడంతో ఫీల్డింగ్ ఇప్పటికీ ఒక ప్రధాన ఆందోళనగా మిగిలిపోయింది. అంతకుముందు, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో, భారత్ మూడు క్యాచ్‌లను జారవిడిచి, తమ చిరకాల ప్రత్యర్థులను టీ20ఐ చరిత్రలోనే అత్యల్ప స్కోరుకే పరిమితం చేసింది. థాయ్‌లాండ్ పోరులో కూడా భారత్ రెండు క్యాచ్‌లను జారవిడిచింది, దీంతో ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచ్‌లలో జారవిడిచిన అవకాశాల సంఖ్య మొత్తం తొమ్మిదికి చేరింది. ఈ నేపథ్యంలో ఆదివారం భారత్, శ్రీలంక మధ్య జరిగే ఫైనల్ పోరు ఉత్కంఠత కలిగిస్తోంది.

# నేటి నుండి భారత్, అఫ్ఘాన్ టి20
### ఆధిపత్యం కోసం రెండు జట్ల దృష్టి

**న్యూఢిల్లీ:** భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ప్రతిష్టాత్మక మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఈ నెల 13 నుంచి రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు అధికారికంగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తున్నప్పటికీ, మ్యాచ్‌లన్నీ ఢిల్లీ వేదికగానే జరగనున్నాయి. సీనియర్లతో పాటు యువ ప్రతిభతో కూడిన భారత జట్టు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి సిరీస్ సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉండగా, బలమైన అఫ్గాన్ జట్టు గట్టి సవాల్ విసిరేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఈ సిరీస్‌లో భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. విధ్వంసకర ఓపెనర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్‌లతో పాటు, బ్యాటింగ్ విభాగానికి ప్రధాన బలంగా నిలవనున్నారు. దీనికి వైభవ్ సూర్యవంశీ జతకానున్నాడు. మిడిలార్డర్‌లో శివం దూబే, నితీశ్ కుమార్ రెడ్డి వంటి పవర్ హిట్టర్లు జట్టుకు భారీ స్కోర్లు అందించే సత్తా కలిగి ఉన్నారు. బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, లెఫ్టార్మ్ పేసర్ అర్షదీప్ సింగ్ భారత్‌కు ప్రధాన అస్త్రాలుగా మారనున్నారు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ ప్రత్యర్థిని కట్టడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. భుజం గాయం కారణంగా చాలా కాలం పాటు జట్టుకు దూరమైన స్టార్ పేసర్ నవీన్‌ఉల్‌హక్ పూర్తి ఫిట్‌నెస్‌తో తిరిగి వచ్చాడు. అతని రాక ఆఫ్ఘనిస్తాన్ ఫాస్ట్ బౌలింగ్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ గుల్బదిన్ నైబ్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. గుల్బదిన్ నైబ్ మిడిల్ ఆర్డర్‌ను బలోపేతం చేయడంతో పాటు మంచి బౌలింగ్ ఆప్షన్‌గా నిలుస్తాడు. శీయ క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న యువ వికెట్ కీపర్‌బ్యాటర్ నూర్ రహ్మాన్‌కు తొలిసారిగా జట్టులో చోటు దక్కింది. అతను రహ్మానుల్లా గుర్బాజ్‌కు బ్యాకప్‌గా వ్యవహరిస్తాడు. ఆఫ్ఘనిస్తాన్ ప్రధాన బలం ఎల్లప్పుడూ వారి స్పిన్ బౌలింగే. ఈసారి కూడా రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, ముజీబ్ ఉర్ రెహమాన్ వంటి సీనియర్ ఆటగాళ్లు భారత పిచ్‌లపై తమ స్పిన్ మాయాజాలాన్ని ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్నారు. అనుభవజ్ఞుడైన మహమ్మద్ నబీ కూడా జట్టులో సమతుల్యతను కాపాడటానికి కృషి చేస్తాడు.




# క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో సెబి సంస్కరణలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో లిక్విడిటీ, పారదర్శకత, ధరల నిర్ణయ ప్రక్రియను మరింత మెరుగుపరిచేందుకు భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డుసెబీ ఏడు ప్రతిపాదనలను చేసింది. సెబి కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసి, వాటిపై ప్రజల నుంచి అక్టోబర్ 3, 2026 వరకు అభిప్రాయాలను ఆహ్వానించింది. డెరివేటివ్ కాంట్రాక్టుల సెటిల్‌మెంట్ ధరను నిర్ణయించేందుకు సెబి రెండు మార్గాలను ప్రతిపాదించింది. మొదటి విధానంలో నిరంతర ట్రేడింగ్ సెషన్, క్లోజింగ్ ఆక్షన్ సెషన్ లో జరిగిన లావాదేవీలను కలిపి సెటిల్‌మెంట్ ధరను నిర్ణయిస్తారు. రెండో విధానంలో కనీసం ఏడాది పాటు నిరంతర ట్రేడింగ్ సెషన్ ఆధారంగానే సెటిల్‌మెంట్ కొనసాగించి, ఆ తర్వాత ముగింపు వేలం డేటాను కూడా పరిగణన లోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ముగింపు వేలం సమయంలో చూపిస్తున్న ఇండికేటివ్ ఇండెక్స్ విలువను తొలగించాలని సెబి ప్రతిపాదించింది. ఈ విలువను ఇండికేటివ్ ఈక్విలిబ్రియం ప్రైస్ ఆధారంగా నిర్ణయిస్తున్నారు. క్లోజింగ్ ఆక్షన్ సెషన్ సమయాల్లోనూ రెండు ప్రత్యామ్నాయాలను సెబి సూచించింది. నిరంతర వేలం వ్యవస్థకు అర్హత ఉన్న షేర్లలో మధ్యాహ్నం 3:30 గంటల వరకు ట్రేడింగ్ కొనసాగుతుంది. 3:31 నుంచి 3:40 గంటల వరకు సిఎఎస్ నిర్వహిస్తారు. అనంతరం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ 3:45 గంటల వరకు కొనసాగుతుంది. షేర్ల ట్రేడింగ్‌ను మధ్యాహ్నం 3:15 గంటలకు ముగించి, 3:15 నుంచి 3:25 గంటల వరకు సిఎఎస్ నిర్వహిస్తారు. అనంతరం ఎఫ్అండ్ఒ ట్రేడింగ్ 3:30 గంటలకు ముగుస్తుంది. ప్రస్తుతం సిఎఎస్ ప్రారంభానికి ముందు ఉన్న ఐదు నిమిషాల ట్రాన్సిషన్ సమయాన్ని కేవలం ఒక నిమిషానికి తగ్గించాలని సెబీ ప్రతిపాదించింది. రిఫరెన్స్ ధరకు ప్లస్ లేదా మైనస్ 1 శాతం పరిధికి వెలుపల ఉంచిన లిమిట్ ఆర్డర్లను వేలం ముగింపు సమయంలో ఆర్డర్ సమర్పించిన తర్వాత రద్దు చేసేందుకు అనుమతించకూడదని సెబీ ప్రతిపాదించింది. అయితే ధరను మరింత అనుకూలంగా మార్చే విధంగా వాటిని సవరించుకునే అవకాశం ఉంటుంది. సిఎఎస్‌లోకి సాధారణ, పూర్తిగా వెల్లడయ్యే లిమిట్ ఆర్డర్లుగా తీసుకెళ్లేందుకు అనుమతించాలని కూడా సెబి ప్రతిపాదించింది. లిస్టెడ్ సెక్యూరిటీల తుది ముగింపు ధరను నిర్ణయించడంలో సిఎఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇదే ధర ఆధారంగా డెరివేటివ్స్ సెటిల్‌మెంట్ కూడా ప్రభావితమవుతుంది. అందువల్ల సిఎఎస్‌లో లిక్విడిటీ, పారదర్శకత, ధరల నిర్ణయ ప్రక్రియను మెరుగుపరచడమే ప్రతిపాదిత మార్పుల ప్రధాన ఉద్దేశమని సెబీ తెలిపింది. వివిధ వర్గాల నుంచి వచ్చే అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం ఈ మార్పులను సెబీ తుది రూపంలో ఖరారు చేసే అవకాశం ఉంది.

వాణిజ్యం

## ఇయు, భారత్ ఒప్పందంతో
# భారత్ కార్లకు భారీ ఎగుమతి అవకాశం




### మారుతి, టాటా, మహీంద్రాకు ప్రయోజనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే భారత ఆటోమొబైల్ మార్కెట్లో పోటీ మరింత పెరగనుంది. ఎగుమతుల పరంగా మారుతి, టాటా, మహీంద్ర వంటిసంస్థలకు మేలుచేస్తుందని అంచనా. ఈ ఒప్పందం కింద యూరప్ కార్ల తయారీ సంస్థలకు భారత్‌లో ఐసిఇ, హైబ్రిడ్ కార్లను రాయితీ సుంకాలతో దిగుమతి చేసుకునేందుకు తొలి యేడాదిలో 1 లక్ష వాహనాల కోటా లభించనుంది. ఈ కోటా పదో యేడాదికి 1.60 లక్షల వాహనాలకు చేరుతుంది. 2025లో భారత్ ఇయు నుంచి కేవలం 17,191 కార్లను దిగుమతి చేసుకుంది. దీనితో పోలిస్తే తొలి యేడాది 1 లక్ష కార్ల కోటా దాదాపు ఆరు రెట్లు అధికం కావడం గమనార్హం. దీంతో దేశీయ కార్ల తయారీ దారులపై, ముఖ్యంగా ప్రీమియం విభాగంలో పోటీ పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో భారత్‌లో తయారయ్యే కార్లకు యూరోపియన్ మార్కెట్లో భారీ ఎగుమతి అవకాశం లభించనుంది. తొలి యేడాదిలో 2.50 లక్షల భారతీయ ఐసిఇ, హైబ్రిడ్ కార్లకు ఇయు కోటా కల్పించనుంది. పదో యేడాదికి 4 లక్షలకు పెరుగుతుంది. ఈ కోటాలోని వాహనాలపై సుంకం ఐదో యేడాది నుంచి పూర్తిగా సున్నా కానుంది. రూ.15 వేల యూరోల లోపు కార్లకు రక్షభారత్ తన సామూహిక మార్కెట్ కార్ల విభాగాన్ని రక్షించేలా రాయితీలను రూపొం దించింది.

15 వేల యూరోల కంటే తక్కువ ధర ఉన్న ఐసిఇ, హైబ్రిడ్ కార్లకు ఎలాంటి సుంక రాయితీ ఉండదు. 15వేల నుంచి 35వేల యూరోల మధ్య ధర ఉన్న కార్లపై ప్రస్తుతం ఉన్న 110 శాతం ప్రాథమిక సుంకం తొలి యేడాదిలో 35 శాతానికి, ఐదో యేడాదికి 10 శాతానికి తగ్గుతుంది. 35వేల యూరోల కంటే ఎక్కువ ధర ఉన్న కార్లపై రాయితీ సుంకం తొలి ఏడాదిలో 30 శాతంగా ఉండి, ఐదో ఏడాదికి 10 శాతానికి చేరుతుంది. దీంతో పోటీ ప్రభావం చిన్న కార్ల కంటే ప్రీమియం, లగ్జరీ కార్ల విభాగంలోనే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. భారత్‌లో విడిభాగాల రూపంలో దిగుమతి చేసి స్థానికంగా అసెంబుల్ చేసే కంప్లీట్లీ నాక్‌డ్ డౌన్ వాహనాలకు కూడా ఎఫ్‌టీఏలో రాయితీలు ఉన్నాయి. ఐఇసి, హైబ్రిడ్ సికెడి వాహనాలకు తొలి ఐదేళ్లలో యేడాదికి 75,000 యూనిట్ల కోటా ఉంటుంది.


పదో యేడాది నుంచి ఇది 50,000 యూనిట్లకు తగ్గుతుంది. ప్రస్తుతం 16.5 శాతంగా ఉన్న సికెడి దిగుమతి సుంకం తొలి ఏడాదిలో 13.75 శాతానికి, రెండో ఏడాదిలో 11 శాతానికి, మూడో ఏడాది నుంచి 8.25 శాతానికి తగ్గుతుంది. దీంతో యూరోపియన్ కంపెనీలకు పూర్తిగా తయారైన కార్లను దిగుమతి చేసుకోవడంతో పాటు, భారత్‌లో తక్కువ సుంకంతో కార్లను అసెంబుల్ చేసే అవకాశం కూడా లభిస్తుంది. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో భారత్ మరింత జాగ్రత్తగా వ్యవహరించింది. ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన తొలి నాలుగేళ్లలో యూరోపియన్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు ప్లగ్‌ఇన్ హైబ్రిడ్లు తదితర కొత్త టెక్నాలజీ వాహనాలకు రాయితీ దిగుమతి కోటా ఉండదు. ఐదో యేడాదినుంచి రాయితీలు ప్రారంభ మవుతాయి.

# ఫిన్‌టెక్ రంగంలోకి ఇండియాబుల్స్
### రూ.1,050 కోట్లతో 70% వాటా కొనుగోలు




**ముంబయి, సెప్టెంబరు 12:** ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించడంతో పాటు నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల కోసం టెక్నాలజీ సొల్యూషన్స్ వ్యాపారాన్ని విస్తరించే లక్ష్యంతో ఇండియాబుల్స్ ఫిన్‌టెక్ క్లౌడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 70 శాతం వాటాను రూ.1,050కోట్లకు కొనుగోలుచేస్తోంది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో ఇండియాబుల్స్ నిర్ణయాన్ని వెల్లడించింది. ప్రతిపాదిత కొనుగోలుకు సంబంధించి ఫిన్‌టెక్ క్లౌడ్‌తో తుది ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ డీల్‌లో ఫిన్‌టెక్ క్లౌడ్ ఈక్విటీ విలువ రూ.1,500 కోట్లుగా నిర్ణయించారు. ఎన్‌సిఎల్‌టి ఆమోదించే స్కీమ్ ద్వారా ఈ కొనుగోలు ప్రక్రియ చేపట్టనున్నారు. ఫిన్‌టెక్ క్లౌడ్‌లో 70 శాతం వాటా కలిగిన షేర్‌హోల్డర్లతో కలిసి ఈ లావాదేవీని పూర్తి చేయనుంది. కొనుగోలు ప్రతిఫలంగా ఇండియాబుల్స్ గరిష్ఠంగా 21కోట్ల పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. దీనికి వర్తించే ధర నిర్ణయ నిబంధనలు సహా అన్ని నియంత్రణలు వర్తిస్తాయి. ఫిన్‌టెక్ క్లౌడ్‌అనేది లోన్‌సర్వీస్ ప్రొవైడర్. నియంత్రిత ఆర్థిక సంస్థలు, ముఖ్యంగా ఎన్బీఎఫ్‌సిలకు రుణాల ప్రారంభ ప్రక్రియ, అండర్‌రైటింగ్, రుణాల నిర్వ హణవంటి కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు, సేవలను అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఫిన్‌టెక్ క్లౌడ్ రూ.133.77 కోట్ల స్థూల ఆదాయాన్ని నమోదు చేయగా, పన్నుకు ముందు లాభం రూ.30.31 కోట్లుగా నమోదైంది. ఐదేళ్ల క్రితమే ఫిన్‌టెక్ క్లౌడ్ సంస్థ ఏర్పాటైంది. గత యేడాది సుమారు రూ.133.77 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఫిన్‌టెక్ క్లౌడ్ కొనుగోలు ద్వారా ఎన్‌బిఎఫ్‌సిలకు టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే వ్యాపారం ద్వారా ఫిన్‌టెక్ విభాగంలోకి ప్రవేశించేందుకు అవకాశం లభిస్తుందని ఇండియాబుల్స్ తెలిపింది.

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో కొత్తగా
# ఇద్దరు పూర్తికాలపు డైరెక్టర్లు




**ముంబై, సెప్టెంబరు12:** హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. వి. శ్రీనివాస రంగన్, జిమ్మీ టాటాలను మరోసారి పూర్తికాల డైరెక్టర్లుగా నియమించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని బ్యాంక్ శనివారం స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. అదే సమయంలో బ్యాంక్ ఎండిసిఇఒ పదవికోసం ఇద్దరు అభ్యర్థుల పేర్లను కూడా సమర్పించింది. శ్రీనివాస రంగన్‌ను 2026 నవంబర్ 23 నుంచి 2027 నవంబర్ 22 వరకు పూర్తికాలపు డైరెక్టర్‌గా నియమించారు. జిమ్మీ టాటా నియామకం మూడు సంవత్సరాల కాలానికి ఉంటుంది. బ్యాంక్‌లో మరో అదనపు పూర్తికాలపు డైరెక్టర్ పదవిని సృష్టించేందుకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది. బ్యాంక్‌లోని వివిధ విభాగాల మధ్య మరింత సమన్వయం, పర్యవేక్షణను మెరుగుపరచడంతో పాటు భవిష్యత్ వారసత్వ ప్రణాళిక కోసం బలమైన వ్యవస్థనుఏర్పాటు చేయడం ఈ నిర్ణయం ఉద్దేశ్యం. ఈ అదనపు పదవి భర్తీ అయిన తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో మొత్తం నలుగురు హోల్‌టైమ్ డైరెక్టర్లు ఉంటారు. కొత్త ఎండి సిఇఒతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ అదనపు పదవిని భర్తీ చేయనున్నారు. శ్రీనివాస రంగన్‌శ్రీనివాస రంగన్ ప్రస్తుతం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆయన బ్యాంక్‌లో మానవ వనరులు, లీగల్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ఎథిక్స్, ఫ్రాడ్ విజిలెన్స్ వంటి కీలక విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. రంగన్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. అలాగే ఐసిఎఐలో అసోసియేట్‌గా ఉన్నారు. జిమ్మీ టాటాజిమ్మీ టాటాగా అర్హత సాధించారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లో ఆయనకు 35 యేళ్లకు పైగా అనుభవం ఉంది. 1987లో స్ట్రాటజిక్ కన్సల్టెంట్స్ సంస్థలో కన్సల్టెంట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1989లో చేరిన ఆయన అక్కడ విభాగానికి హెడ్‌గా పనిచేశారు.

# ఫారెక్స్ నిల్వల్లో రష్యాను వెనక్కినెట్టిన భారత్




**ముంబయి, సెప్టెంబరు 12:** భారతదేశ ఆర్థిక వ్యవస్థ మరో కీలక మైలురాయిని అందుకుంది. ఆర్బీఐ చేపట్టిన ప్రత్యేక పథకం కారణంగా దేశంలోకి డాలర్ల రాక రికార్డు స్థాయిలో పెరగడంతో, విదేశీ మారక నిల్వలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరాయి. దీంతో ఫారెక్స్ నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానానికి ఎగబాకింది. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో భారత ఫారెక్స్ నిల్వలు ఏకంగా 44.9 బిలియన్ డాలర్లు పెరిగి, 785.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 75,07,796 కోట్లు) రికార్డు స్థాయికి చేరాయి. ఈ భారీ పెరుగుదలతో ఇప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న రష్యాను భారత్ వెనక్కి నెట్టింది. ప్రస్తుతం ఈ జాబితాలో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. ఆర్బీఐ ఈ యేడాది జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారెన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ల స్పెషల్ స్వాప్ పథకానికి అనూహ్య స్పందన లభించడమే ఈ డాలర్ల వరదకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ పథకం ద్వారా కేవలం 11 వారాల్లోనే దేశంలోకి 73 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. నిర్దేశిత లక్ష్యం గడువు కంటే ముందే నెరవేరడంతో, ఆర్బీఐ ఈ పథకాన్ని సెప్టెంబర్ 30కి బదులుగా ఆగస్టు 31నే ముగించింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడంతో దేశ పసిడి నిల్వల విలువ 2.59 బిలియన్ డాలర్లుతగ్గినా, డాలర్ల ప్రవాహం అధికంగా ఉండటంతో మొత్తం నిల్వలు భారీగా పెరిగాయి. విదేశీ మారక నిల్వలు ఇంత భారీగా పెరగడం దేశ ఆర్థికవ్యవస్థ పటిష్ఠతకు సంకేతమని, ఇది రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు స్థిరీకరించేందుకు ఆర్బీఐకి మరింత బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

13 -9Pg9th cheli:13 -9Pg9th cheli.qxd 9/12/2026 10:43 PM Page 1



# చెలి

# వినాయక నైవేద్యాలు

వినాయకచవితి పండుగను తెలుగు రాష్ట్రాల్లో కొంతమంది రెండు రోజులు జరుపుకుంటారు. ఒక రోజు నోము చేసుకుని తరువాతి రోజు వ్రత కథ చెప్పుకుంటారు. ఉండ్రాళ్లు, వడపప్పు, పానకం, చలిమిడి, పులిహోర, శనగలు, పాల తాలికలు, కుడుములు , శనగ గుగ్గిళ్లు ఇలా ఎన్నో రకాలను స్వామికి నైవేద్యంగా సమర్పిస్తారు.



## ఉండ్రాళ్లు

బియ్యప్పిండి: 1 కప్పు, నెయ్యి: కొద్దిగా ఉప్పు, చిటికెడు నీళ్లు : 1 కప్పు. ఉండ్రాళ్లలో నింప డానికి... పచ్చికొబ్బరి కోరు: 1 కప్పు కొబ్బరి పొడి: 1/2 కప్పు, వేయించిన గసాలు, కొద్దిగా యాలకుల పొడి: 1/2 స్పూను.

**తయారు చేసే విధానం :** కొబ్బరి, బెల్లం, యాలకుల పొడి, గసాలు కలిపి ఒక పాన్‌లో వేడి చేయ్యాలి. ఈ మిశ్రమం కాస్త ఉండకట్టే మాదిరి అయ్యేవరకు ఉంచి దించాలి. ఒక గిన్నెల్లో నీళ్ల తీసుకుని వేడి చెయ్యాలి. కప్పు నెయ్యివేసి మరిగిన తరవాత బియ్యప్పిండి కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. తక్కువ మంట పైన పిండిని ఉడికించి గట్టిపడిన తరువాత దీన్ని ఒక వెడల్పాటి పళ్లెంలోకి తీసుకుని చల్లార్చాలి. పిండిని నెయ్యి రాసుకున్న చేత్తో కలిపి చిన్న ఉండను తీసుకుని బాల్‌లాగా తయారుచేసి అందు లో కొబ్బరి పాకాన్ని కొద్దిగా ఉంచి మూసివేసి గుండ్రంగా ఉండ్రాళ్లలా చుట్టాలి. వీటిని వేడిగా/ చల్లారాక నేతితో కలిపి తింటే ఎంతో రుచిగా ఉంటాయి.





## ఆవిరి కుడుములు

**కావలసిన పదార్థాలు :** నానబెట్టిన బియ్యం రెండు కప్పులు, బెల్లం తురుం ఒకటిన్నర కప్పులు, కొబ్బరి ముక్కలు అర కప్పు, నెయ్యి నాలుగు చెంచాలు, యాలకుల పొడి చిటికెడు

**తయారీ విధానం:** నానిన బియ్యాన్ని మెత్తటి పిండిలా చేసుకోవాలి. కొబ్బరి ముక్కలను నేతిలో వేయించి పెట్టుకోవాలి. వెడల్పాటి గిన్నెలో బెల్లం తురుం వేసి ఒకటిన్నర కప్పుల నీటిని పోసి కలుపుతూ కరిగించాలి. ఆపైన బియ్యప్పిండిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు రాకుండా కలపాలి.తరువాత వేయించిన కొబ్బరి ముక్కలు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరువాత ఈ పిండిని పిడికిలితో తీసుకుని కుడుముల మాదిరి చేసి నెయ్యి రాసిన ఇడ్లీ ప్లేట్లలో ఉంచాలి. ఇడ్లీ పాత్రలో కొన్ని నీళ్ల పోసి ఈ ప్లేట్లు పెట్టి పావు గంటసేపు ఆవిరి మీద ఉడికించి దించాలి.



## పాల తాలికలు

**కావలసినవి :** గోధుమపిండి : 1/4 కప్పు, నీళ్లు: సరిపడినన్ని, యాలకులపొడి: చిటికెడు, బియ్యపిండి : ఒక కప్పు. **తయారు చేసే విధానం :** గోధుమ పిండి, చపాతీ పిండిలా కలుపుకొని సేమియాలా సన్నగా పాలికలు తయారు చేసుకొని వెడల్పాటి పళ్లెంలో వేసుకొని ఆరనివ్వాలి. ఒక గిన్నెలో రెండు కప్పుల నీళ్ల పోసి తాలికలు ఉడికించాలి. తరువాత పొడిగా చేసిన బెల్లం వేసి మరికొంతసేపు ఉడికించి, తర్వాత బియ్యప్పిండి నీళ్లల్లో కలిపి పాలు మరిగే నీళ్లల్లో ఉండలు కట్టకుండా వేసుకోవాలి. కొద్దిగా ఉడికిన తరువాత యాలకుల పొడి వేయాలి.



## పాకం పూరీలు

మైదాపిండి: ఒక కప్పు, ఉప్పు: తగినంత, నెయ్యి: పావు కప్పు, చక్కెర: ఒక కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం** ఒక గిన్నెలో మైదా, కొద్దిగా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ గోరువెచ్చని నెయ్యి వేసి బాగా కలిపి తగినన్ని నీళ్ల పోసి ముద్దలా కలిపి అరగంటపాటు పక్కన పెట్టాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి చక్కెర వేసి అరగ్లాసు నీళ్లపోసి తీగపాకం వచ్చేవరకు కలపాలి. పాకం వచ్చాక యాలకుల పొడి వేసి బాగా కలపాలి. పిండిని కొద్దికొద్దిగా

తీసుకుని పూరీలా ఒత్తి మధ్యలో నెయ్యి రాసి నాలుగు మడతలు వేసి మళ్లీ ఒత్తుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి, బాగా వేడయ్యాక.. అప్పటికే చేసి పెట్టుకున్న పూరీలను రెండువైపులా కాల్చి చక్కెరపాకంలో వేయాలి. ఒక నిమిషం చక్కెర పాకంలో నానిన తర్వాత తీసి ప్లేట్లో పెట్టుకుంటే నోరూరించే పాకం పూరీలు సిద్ధం. మైదా ఇష్టపడని వాళ్ల గోధుమపిండితోనూ చేసుకోవచ్చు



## గుగ్గిళ్లు

పెద్ద శనగలు అర కప్పు, అలసందలు అర కప్పు, పల్లీలు అర కప్పు, చిన్న శనగలు అర కప్పు, పచ్చి కొబ్బరి తురుం పావు కప్పు, ఎండు మిరపకాయలు రెండు, ఇంగువ చిటికెడు, ఉప్పు తగినంత, కరివేపాకు ఓ రెమ్మ, కొత్తిమీర తరుగు కొద్దిగా, ఆవాలు పావు చెంచా, నెయ్యి రెండు చెంచాలు

**తయారీ విధానం:** పెద్ద శనగలు, చిన్న శనగలు, పల్లీలను విడివిడిగా శుభ్రంగా కడిగి అవి మునిగే వరకు నీటిని పోసి ఎనిమిది గంటలు నానబెట్టాలి. అలాగే అలసందలను కూడా కడిగి నాలుగు గంటలు నాననివ్వాలి. తరువాత వీటన్నింటినీ ఉప్పు వేసి మరీ మెత్తగా కాకుండా ఉడికించాలి. ఆపైన నీటిని వంచేయాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నెయ్యి వేసి కరిగించి అవాలు, ఎండు మిర్చి ముక్కలు, ఇంగువ, కరివేపాకు వేయాలి. తరువాత ఉడికించిన శనగలు, పల్లీలు, అలసందలు వేసి కలపాలి. ఉప్పు సరిచూసుకుని చివరగా పచ్చి కొబ్బరి తురుం, కొత్తిమీర తరుగు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.



ఆహార భద్రత... ప్రతి వ్యక్తికీ తగినంత ఉత్పత్తిలో, సురక్షి తమైన, పోషకాలతో కూడిన ఆహారం లభించే హక్కు దీన్లో ఆహారంతోపాటు నిల్వ, పంపిణీ, వినియోగం... ఇలా అన్ని అంశాలూ ఉంటాయి. వీటిని సాధించడంలో మహిళది కీలకపాత్ర. కానీ కష్టానికి తగ్గ ప్రతిఫలం, గుర్తింపు, ప్రోత్సాహం ఆ అన్నపూర్ణకు లభించడం లేదు.

# ఆహార భద్రతలో కీలకపాత్ర మహిళలే

భారతదేశ జనాభాలో సుమారు 70 శాతం మంది మహిళలు గ్రామీణ ఉత్పత్తులను సమకూర్చారు. వీరిలో చాలా మంది వ్యవసాయ రంగంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. వ్యవసాయ శ్రామికశక్తిలో సుమారు మూడో వంతు మహిళల విత్తనాలు నాటడం, కలుపు తీయడం, కోత, విత్తన సంరక్షణ, పశుపోషణ, పంటల వంటి నిల్వ బాధ్యతల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. ఆహార ఉత్పత్తిలోనే కాదు, వినియోగం, పోషణ, కుటుంబ ఆరోగ్యంలో కూడా మహిళలదే ప్రధాన బాధ్యత. మహిళలు స్థానిక విత్తన వైవిధ్యాన్ని, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను పాటిస్తూ పర్యావరణ మార్పును కాపాడుతున్నారు. చిన్న స్థాయి కూరగాయలు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు కుటుంబాలు, సమాజ స్థాయిలో ఆహార భద్రతను బలోపేతం చేస్తున్నారు. ప్రపంచ ఆహార సంస్థ(ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ఎఫ్ఎఓ) ప్రకారం, మహిళలకు పురుషులతో సమాన స్థాయిలో వనరులు, సాంకేతిక పరి జ్ఞానం అందిస్తే, వ్యవసాయం ఉత్పాదకత 20-30 రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఆహార భద్రత పరంగా మహిళల సహకారం ఎంతో ఉంటుంది, ఆ విధంగా వారు అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. భారత్‌లో మహిళల పేరుపై 13 వ్యవసాయ భూమి ఉంది. సాగుపై ఆసక్తి ఉన్నప్పటికీ సామాజిక నిబంధనలు వారిని చాలాచోట్ల గృహాపరమైన పనులకు పరిమితం చేస్తున్నాయి.

**ఆ ప్రోత్సాహం సరిపోతుందా? ...**

దేశ ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే మహిళలకు వనరులు, విద్య, ఆరోగ్యం, నిర్ణయ శక్తి అందించాలి. వారు సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాల ద్వారా కలిసి పనిచేస్తే, సామూహిక శక్తి పెరుగుతుంది. వారి మాటకు విలువ వస్తుంది. మహిళలకు భూమి హక్కులు, రుణ సౌకర్యాలు, శిక్షణా కార్యక్రమాలు, పోషకాహార అవగాహన కార్యక్రమాలు అందించడం ద్వారా ఆహార ఉత్పత్తి, నిల్వ, పంపిణీ వ్యవస్థలు బలోపేతం అవుతాయి. తారలుగా మహిళలు ఆహార భద్రతకు వెన్నెముకగా నిలుస్తున్నారు. హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఫర్ బెటర్ ఫుడ్ అండ్ ఎ బెటర్ ఫ్యూచర్ 2025 ఆహార దినోత్సవ నినాదం. ఆహార భద్రతను సాధించడానికి ప్రభుత్వాలూ, ఎన్జీఓలూ, బోర్డులలూ... చేతులు కలపాలంటోంది ప్రపంచ ఆహార సంస్థ. అందులో మహిళలకూ చోటుండాలి. మహిళా సాధికారతకు సహకరించడం వల్ల ఆకలి, పేదరికం, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించవచ్చు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం స్థిరమైన అభివృద్ధి దిశగా



# పూజగది శుభ్రత ఇలా !

వాస్తు శాస్త్రం ప్రకారం పూజగదిని ఈశాన్యం ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల ధ్యానం, పూజ ప్రశాంతంగా సాగిపోతాయి. అంతేకాదు, ఇంట్లో ప్రసరించే సూర్యుడి లేలేత కిరణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎక్కువ స్థలం ఉన్నట్లయితే ఇంటి మధ్యలో పూజగది ఉంటే మంచిది. స్థలం లేకుంటే వంటింట్లోనే ఈశాన్య దిక్కున పూజమందిరాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఎట్టి పరిస్థితిలో పడక గదుల్లో పూజగది ఉండకూడదు. పూజ గదిలో విగ్రహాలను ఈశాన్యం, తూర్పు లేదా పడమర దిక్కున పెట్టుకోవచ్చు. దీనికి కారణం సూర్యకిరణాలు ఉదయం ఈశాన్య, తూర్పు దిక్కు నుంచి, సాయంత్రం పడమర నుంచి ప్రసరిస్తాయి. ఇవి విగ్రహాల మీద పడి భక్తి భావనను పెంపొందిస్తాయి. విగ్రహాలను ఉత్తర దిక్కున పెడితే ప్రార్థించేవారు దక్షిణ ముఖంగా కూర్చోవలసివస్తుంది. ఇది వాస్తు రీత్యా మంచిది కాదు. దేవుడిగదిలో విరిగిన విగ్రహాలు, చిరిగిన చిత్రపటాలు ఉండకూడదు. అలాగే విగ్రహాలను ఒకదానికి ఎదురుగా ఒకటి పెట్టకూడదు. మనం విగ్రహాలను చూస్తూ పూజించాలే గానీ అవి ఒకదాన్ని మరొకటి చూస్తున్నట్టుగా ఉంచకూడదు. పూజ సామాన్లను గదిలో ఆగ్నేయ దిక్కున భద్రపరచాలి. అవి విగ్రహాలకు, మనం కూర్చోవడానికి అడ్డు లేకుండా చూడాలి. కొందరు మరణించిన పెద్దల మీది గౌరవ భావంతో వారి పాటలు పూజగదిలో పెడతారు. అది సరి కాదు. అవి మన దృష్టిని మరల్చడమే కాదు.. బాధాకరమైన విషయాలను జ్ఞాపకం తెచ్చే అవకాశం ఉంది. పూజగదిలో బంగారం, ధనం లాంటి విలువైన వస్తువులను దాచకూడదు. పూజగదిని సదా పరిశుభ్రంగా ఉంచాలి. ఆ గదికి తలుపులున్న ద్వారానే రెండు ఎంచుకోవాలి. గడప తప్పనిసరిగా ఉండాలి. గోడలకు తెలుపు, లేత పసుపు, లేతనీలం లాంటి లేత రంగులే వేయాలి. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉండి దేవుడిపై దృష్టి నిలుస్తుంది.

# తెర

## ఆదర్శ కుటుంబం టీజర్ విడుదల



వెంకటేష్ - త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో మరో వినోదాత్మక చిత్రం:విక్టరీ వెంకటేష్, స్టార్ రైటర్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం ఆదర్శ కుటుంబం - AK47e టీజర్ తాజాగా విడుదలైంది. కుటుంబ నేపథ్యంతో కూడిన వినోదం, యాక్షన్, చమత్కారమైన సంభాషణలతో టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. మధ్యతరగతి కుటుంబం.. ఆ కుటుంబంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు.. వాటి చుట్టూ అల్లుకున్న వినోదం.. ఇలా ఆదర్శ కుటుంబం - AK47e ప్రపంచాన్ని టీజర్ ఆసక్తికరంగా పరిచయం చేసింది. వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో అలరించగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ మార్క్ చమత్కారమైన రచన, పదునైన సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే సమయంలో టీజర్‌లోని ఎనర్జిటిక్ యాక్షన్ సన్నివేశాలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, నివేదా పేతురాజ్, యువినా, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, ఉదయ్‌బీర్ సంధు, వెన్నెల కిషోర్, రఘుబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆదర్శ కుటుంబం - AK47e చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ అందిస్తున్నారు. వెంకటేష్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఒక కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది.సంగీతం థమన్ ఎస్, ప్రొడక్షన్ డిజైన్ ఏ.ఎస్. ప్రకాష్, ఎడిటింగ్ నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ రవి కె. చంద్రన్.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మక బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో పలు విజయవంతమైన, బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన ఈ సంస్థ నుంచి వస్తున్న మరో ఆసక్తికరమైన చిత్రంగా ఆదర్శ కుటుంబం - - AK47e రూపొందు తోంది.టీజర్‌కు లభిస్తున్న స్పందనతో పాటు వెంకటేష్ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ మార్క్ రైటింగ్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్, యాక్షన్ అంశాలు, భారీ తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి.

## ప్యారడైజ్ కష్టపడి చేసిన సినిమా: నాని




న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సంద ర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మీ అందరినీ కలిసి చాలా రోజులవుతుంది. ఎప్పుడూ నా కెరీర్‌లో ఒక సినిమాకి మరో సినిమాకి ఇంత గ్యాప్ రాలేదు. ఈ ప్రెస్ మీట్‌కి వస్తూ ఉంటే నా ఫస్ట్ సినిమాకి ఎంత నెర్వస్‌గా ఉన్నానో అంతే నెర్వస్‌గా ఉన్నానని అనిపించింది. మైక్‌లో మాట్లాడడం అలవాటు తప్పింది. ఫైనల్‌గా సెప్టెంబర్ 24న వస్తున్నాం. డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమా మొదలైనప్పటి నుంచి మీడియా వారు చాలా సపోర్ట్ చేస్తున్నారు. సినిమా రిలీజ్ అయ్యే వరకు ఈ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సినిమా నుంచి ఏది వచ్చినా సరే ఆడియన్స్‌లో బ్లాస్ట్ అవుతుంది. సాంగ్స్, టీజర్‌ను చాలా పాజిటివ్‌గా తీసుకుంటున్నారు. నా సినిమా అనేకంటే జనం సినిమా అనడం కరెక్ట్ అని నాకు అనిపిస్తుంది. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు నాని టీమ్ సమాధానాలు ఇచ్చారు.శ్రీకాంత్.. ఈ సినిమాలో చాలా ఇంటెన్స్ పదాలు ఉన్నాయి కదా.. సెన్సార్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు? ఇందులో చాలా అద్భుతమైన ఎమోషన్ ఉంది. ఆ ఎమోషన్ చూపిస్తే అందరూ కన్విన్స్ అవుతారు.

## 'సీక్రెట్ సోల్జర్'18న విడుదల




నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా సీక్రెట్ సోల్జర్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఖైనా పీస్‌గా మొదలైన ప్రయాణం సీక్రెట్ సోల్జర్‌గా ఎలా మారింది? చైనా పీస్ పేరుతోనే టీజర్ రిలీజ్ చేశాను. అలాగే రెండు పాటలు కూడా విడుదల చేశాను. అదే పేరుతో చాలా మార్కెటింగ్ చేశాం. మార్చిలో సినిమా రిలీజ్ చేద్దామని సెన్సార్‌కు పంపించాను. సెన్సార్ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. రివ్యూ కమిటీలు, ఈబీసీ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్.. ఇలా అన్ని స్థాయిలు దాటుకుని లిస్టు పంపించారు. సెన్సార్‌లో దాదాపు 8 నెలలు ఈ సినిమా ఉన్నప్పటికీ, మేం ఏ ఆలోచనతో సినిమా తీశామో.. ఆ ఆలోచన విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. మా డైరెక్టర్ విశ్వనాథ్ చాలా కష్టపడ్డారు. ఇందులో యాక్షన్ ఏ రేంజ్‌లో ఉంటుంది? ఇది స్పై డ్రామా. ఇందులో స్పై యాక్షన్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఈ కథ ఏమిటి? ఇండియాకి సంబంధించిన ఓ కీలక ఇన్ఫర్మేషన్ లీక్ అయింది. ఆ సంఘటనకి నెల్లూరులో చాలా సాదాసీదాగా బతికే ఇద్దరు కుర్రాళ్లకి లింక్ ఏమిటి? ఆ సమస్యను పరిష్కరించగలిగారా లేదా? అనేది ఒక లైన్.

## 'అలియాస్ రుక్మిణీ' ఫస్ట్ షెడ్యూల్ పూర్తి



కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ అద్భుత విజయం తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్, నితిన్ హీరో నటిస్తున్న 'అలియాస్ రుక్మిణీ' సరికొత్త ప్రాజెక్ట్‌తో వస్తోంది. తన తొలి చిత్రం దండోరాతో విమర్శకులను ఆకట్టుకున్న మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. అలియాస్ రుక్మిణి 10 రోజుల మొదటి షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకుంది. చిత్ర బృందం ప్రధాన తారాగణంతో కూడిన కొన్ని కీలక సన్నివేశా లను చిత్రీకరించింది. యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నాని ఈ చిత్రానికి జోమోన్ టి. జాన్ ఐఎస్‌సి సినిమాటో గ్రాఫర్‌గా పనిచేస్తుండగా, విజయ్ బల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్. తారాగణం: నితిన్, సాయి కుమార్, హర్ష వర్ధన్సాంకేతిక సిబ్బంది:సమర్పణ: నేచురల్ స్టార్ నానిప్రొడక్షన్ బ్యానర్: యూనానిమస్ ప్రొడక్షన్స్రచన, దర్శకత్వం: మురళీ కాంత్ దేవాసోత్నిర్మాత: దీప్తి గంటాసినిమాటోగ్రఫీ: జోమోన్ . జాన్ ।ఓసిసంగీతం: విజయ్ బుల్గానిన్ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా ఎడిటర్: సృజన అడుసుమిల్లిఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ప్రశాంత్ మండవకాస్ట్యూమ్ డిజైనర్: రేఖ బొగ్గరపుపబ్లిసిటీ డిజైనర్: భరణిధరన్మార్కెటింగ్: ఫస్ట్ షో పిఆర్ఓ: వంశీశేఖర్

## రామ్ పోతినేని చిత్రంలో సంయుక్త



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మక RAPO23లో ఎక్సయిటింగ్ స్టార్ చేరారు. టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్.. టాలీవుడ్ లక్కీ చార్మ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ బర్త్‌డే పోస్టర్ సంయుక్తకు టీమ్ తరఫున శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు.. ఆమె ఈ సినిమాలో భాగమైన విషయాన్ని అధికారి కంగా ప్రకటించింది. ఆమె చేరికతో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్యూరియాసిటీ పెరిగింది. RAPO23ను నియోనోయిర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. RAPO23తో రామ్ పోతినేని దర్శకుడిగా తొలిసారి పరిచయం అవుతున్నారు. తన విజన్‌ను తెరపైకి తీసుకొచ్చే బాధ్యతను ఆయనే పూర్తిగా తీసుకున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.RAPO23కు సరిపోయేలా క్యాస్ట్, టెక్నికల్ టీమ్‌ను ఎంపిక చేయడంలో రామ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుక్కరసు (తిరు) విజువల్స్ అందిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా విక్రమ్ మోర్, పీటర్ హెయిన్ యాక్షన్ సీక్వెన్స్‌లకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

## 'ఇడుపు కాయితం' 'శ్రీలత' సాంగ్‌కు ప్రశంసలు:

### మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి, గీత రచయిత అలరాజు



మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ..

శ్రీలత.. పాట మా ఫ్యామిలీ మెంబర్స్ కు బాగా నచ్చింది. వాళ్లు ఫోన్స్ చేసి పాట బాగుందని చెబుతున్నారు. ఇండస్ట్రీ నుంచి కూడా మా సాంగ్ కు రెస్పాన్స్ బాగుంది. పాట కంపోజిషన్, సౌండింగ్, లిరిక్స్ , ఇద్దరు సింగర్స్ పాడిన విధానం తమను ఆకట్టుకుందని చెబు తున్నారు. ఈ పాటలో నేను నటించాను. ఈ ఆలోచన బన్నీ వాస్‌ది. మీరు ఇన్ని సాంగ్స్‌కు మ్యూజిక్ చేశారు. మీరు ఎవరో ప్రేక్షకులకు తెలియాలి కదా అని ఈ సాంగ్‌లో నేను కూడా నటించేలా చేశారు. ఈ పాట కోసం డిస్కషన్స్ జరుగుతున్నప్పుడే సినిమాలోని కథలో భాగమవుతూ, ప్రమోషన్ కు కూడా ఉపయోగపడేలా ఉండాలని అనుకున్నాం. పాటలో క్యాచీ లిరిక్స్ కూడా కుదిరాయి. లిరిక్ రైటర్ అలరాజు మాట్లాడుతూ.. నేను ఇప్పటిదాకా దాదాపు 40 చిత్రాలకు సాంగ్స్ రాశాను. నేను రాసిన పాటల్ల మైల్స్ ఆఫ్ లవ్ మూవీలోని తెలియదే తెలియదే పాట మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఈ పాటను సిధ్ శ్రీరామ్ పాడారు. బాపు సినిమాలో కంగారే పడకురా అనే పాట కూడా బాగా హిట్ అయ్యింది. ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. శ్రీలత పాట రిలీజ్ కాగానే కాసర్ల శ్యామ్ గారు మెసేజ్ పంపారు. లిరిక్స్ చాలా గొప్పగా ఉన్నాయి. కొన్ని లైన్స్ బాగున్నాయని అభినందించారు. ఈ పాట రాసేప్పుడు డైరెక్టర్ వంశీ రెడ్డి గారు కథతో సంబంధం లేకుండా ఈ పాట అందరికీ నచ్చేలా ఉండాలి. సినిమా చూశాక ఇంకా శ్రోతలకు కనెక్ట్ కావాలని చెప్పారు. మీరు ఇప్పుడు ఆడియో వింటుంటే నచ్చుతుంది. కానీ సినిమాలో చూసినప్పుడు నాలుగు రెట్లు ఎక్కువగా ఈ పాటను ఇష్టపడతారు. టైటిల్ రివీల్ చేసేందుకు ముందుగానే ఈ పాట ఫైనల్ అయ్యింది. ఈ పాటలోని పదాలను పూర్తిగా ఫోక్ స్టైల్ లో కాకుండా అందరికీ కనెక్ట్ అయ్యేలా రాశాను.

13-9Pg8exFHMNWJQE:13-9Pg8exFHMNWJQE.qxd 9/12/2026 11:59 PM Page 1



# 'మిలటరీ'లో తూతూ మంత్రంగా భద్రత

**- బొల్లారంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీలో వెలుగుచూసిన డొల్లతనం - ఉగ్రవాదులకు సమాచారం అందితే అంతే సంగతులు - రక్షణ శాఖకు హోం శాఖ నివేదిక - 55 మంది అధికారులపై చర్యలకు రక్షణ శాఖ సన్నద్ధం**

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** దేశ రక్షణ శాఖలో భద్రతా వ్యవస్థ డొల్లగా వుందని బొల్లారంలో మిలటరీ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ తేటతెల్లం చేసింది. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ కేసులో విశ్రాంత సైనికుడు నిందితుడుగా తేలడం రక్షణ శాఖను షాక్‌కు గురిచేసింది. బ్రిగేడియర్ (సివిల్ విభాగంలో ఐజి స్థాయి అధికారి) స్థాయి పర్యవేక్షణ లో కొనసాగే మిలటరీ విభాగాలకు ఉప అధికారులుగా లెఫ్టినంట్ కల్నల్ (సివిల్‌లో ఎస్‌పి స్థాయి అధికారి) స్థాయి అధికారులు వుంటారు. ఈ క్రమంలో అనేక రక్షణ వ్యవస్థలు వుంటాయి. ఈ వ్యవస్థలను దాటుకుని చీమకూడా వెళ్లేందుకు వీలుండదు. బయటి వ్యక్తులు వచ్చేందుకు అవకాశం అసలు వుండదు. సాధారణ విభాగాల్లోనే ఇంతటి రక్షణ వుంటే ఆయుధ గోదాముల వద్ద మరింత భద్రత వుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇంతటి భద్రత వున్న మద్రాస్ రెజిమెంట్ విభాగం ఆయుధ గోదాము నుంచి ఒక విశ్రాంత సైనికుడు (ఇతన్ని గత జూన్ నెలలో బలవంతంగా పదవీ విరమణ చేయించారు) ఎకె 47 తుపాకులు, ఇన్సాస్ తుపాకి, పిస్టళ్లు, తుటాలు, రాత్రిల్లో చూడగలిగే బైనాకులర్లు చోరీ చే యడం, రెండవసారి మళ్లీ రావడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఇంత జరుగుతున్నా అక్కడ పహారాకాస్తున్న సాయుధ గార్డులు ఒక్క రు కూడా గమనించలేదంటే భద్రత ఎంత డొల్లగా వుందో ఊహించుకోవచ్చు. అర్థరాత్రి వేళ ఒంటరిగా బైక్‌పై వచ్చిన మల్లేష్ అలియాస్ రాజు అనే విశ్రాంత సైనికుడు ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని దానిపైనే తీసుకువెళ్లాడు. అతను అక్కడ దాదాపు రెండు గంటల పాటు వున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయినా కూడా ఎవరూ గమనించలేదు. ఈ సమయంలో ఇక్కడ సిసి కెమెరాలు పనిచేయలేదు. సిసి కెమె రాలు పనిచేయక పోవడం వెనుక మరో వింత కథ వెలుగు చూసింది. ఇక్కడ పనిచేసే సిబ్బంది రాత్రి ఎనిమిది లేదా తొమ్మిది గంటల తరువా త వెళ్లిపోయే సమయంలో లైట్లు, ఫ్యాన్‌లను ఆపివేసేందుకు స్విచ్ ఆఫ్ చేస్తారు. ఈ స్విచ్ ఆఫ్ చేస్తే సిసి కెమెరాలు కూడా ఆగిపోతాయి. దీ ని కనెక్షన్లు లైట్లు, ఫ్యాన్‌లకు వుండే కనెక్షన్‌కు అనుసంధానంగా వుంది. ఇలాంటి అపసవ్య వ్యవస్థ దేశంలో ఆ మాటకు వస్తే ప్రపంచంలో ఎక్కడా వుండక పోవచ్చు. ఈ విషయం విశ్రాంత సైనికుడు రాజుకు ముందుగానే తెలుసు. అతను ఇదే విభాగంలో గతంలో పనిచేసి వుండడంతో ఇక్కడి భద్రతా వ్యవస్థలోని అన్ని లోపాలు అతనికి తెలుసు. సరిగ్గా ఈ క్రమంలోనే అతను అతి సులభంగా ఇక్కడి నుంచి ఆయుధా రాలు, మందుగుండు సామాగ్రిని చోరీ చేయగలిగాడు. బొల్లారం మిలటరీ విభాగంలో దొంగతన చేసిన విశ్రాంత సైనికుడు వాటిని ఏం చేయాలో తే ల్చుకోలేక పోయాడు. తనను బలవంతంగా పదవీ విరమణ చేయించినందుకు పై అధికారులపై కక్షతో అతనే ఈ నేరం చేశాడు. ఒకవేళ ఇక్కడి భద్రతా వ్యవస్థలోని డొల్లతనాన్ని ఉగ్రవాదులు, అసాంఘీక శక్తులు తమకు అనుకూలంగా మలచుకుంటే దానికి బాధ్యులెవరనే దానికి రక్షణ శా ఖ అధికారులే సమాధానం చెప్పాలి.

**ఆయుధాల చోరీపై రక్షణ శాఖకు హోం శాఖ నివేదిక...55 మందిపై చర్యలకు రక్షణ సన్నద్ధం**

మరోవైపు బొల్లారంలో మిలటరీ ఆయుధాల చోరీపై హోం శాఖ రక్షణ శాఖకు ఒక నివేదికను అందజేసింది. ఆయుధాల చోరీ ఎలా జరిగింది ..? ఇందులో వెలుగుచూసిన వైఫల్యాలు, నిందితుడి వివరాలు అన్నీ వున్నాయి. ఈ నివేదికను రక్షణ శాఖ పరిశీలించి 55 మంది మిలటరీ అ ధికారులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



'జాతీయ హిందీ దివాస్' వేడుకలను ప్రారంభిస్తున్న బి.మహేష్‌కుమార్‌గౌడ్, చిత్రంలో సచిన్ సావంత్, వి.హెచ్, రాజేష్ అగర్వాల్ తదితరులు

## హిందీ భాషను పరిరక్షించుకోవాలి:

### బి.మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

**సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** హిందీ జాతీయ భాష అని, దీనిని అందరూ గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. సెక్యులర్ దేశమైన భారతదేశంలో అన్ని భాషలు, ప్రాంతాలు, కులాలు, మతాలకు సమానమైన గౌరవం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగుతోపాటు హిందీ, ఉర్దూ భాషలు కూడా విస్తృతంగా వాడుకలో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనార్టి సెల్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటి ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'జాతీయ హిందీ దివాస్'వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక వర్గాన్ని వెళ్ళగొట్టడమనేది సరికాదని, మార్వాడి గోబ్యాక్ అని ఉద్యమం జరగడం బాధాకరమన్నారు. మర్వాడీలు కూడా తెలంగాణలో అంతర్భాగమేనని స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో హిందీ చదివేవారి సంఖ్యతగ్గిపోవడం బాధాకరంగా ఉందని, హిందీ భాష ప్రచారంతోపాటు దీన్ని ప్రజలకు మరింతగా చేరువచేయడంలో ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనార్టి సెల్ చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ దేశంలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు మాటలు, కులాలు, భాష ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హిందీ దేశ భాష అని ఇది అందరిని కలుపుతుందని, పరిరక్షించుకోవాలని సూచించారు. మైనార్టి సెల్ ఛైర్మన్ రాజేష్ ఆగర్వాల్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణ రాష్ట్రంలో హిందీ భాష పరిరక్షణకు ప్రభుత్వాలే కృషి చేశాయని చెప్పారు. ఈ వేడుకల్లో బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్‌ఆలీ, సెల్ నాయకులు రాజేష్‌గోయల్, ప్రకాష్‌రతి, ప్రదీప్‌సురాన, ప్రకాష్‌జైన్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజయ్‌కుమార్‌శుక్ల, ఎం.ఎ.సర్వర్, కార్యదర్శి కన్నయ్యసింగ్, కోశాధికారి రమేష్, కార్యవర్గ సభ్యులు

# 19 మంది చిన్నారులకు గుండె చికిత్సలు

## నిమ్స్‌లో ఐదో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయవంతం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** నిమ్స్‌లో నిర్వహించిన ఐదో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్‌లో 19 మంది చిన్నారులకు క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు జరిగిన ఈ శిబిరంలో యూకేకు చెందిన వైద్య నిపుణుల బృందం, ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ ధన్నపునేని నేతృత్వంలో నిమ్స్ వైద్యులతో కలిసి సేవలందించింది. శిబిరంలో వెయ్యి మందికిపైగా చిన్నారులకు వైద్య పరీక్షలు, సలహాలు అందించారు. శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన చిన్నారులకు తదుపరి దశలో నిమ్స్‌లో చికిత్స అందించనున్నారు. యూకే నిపుణులు రోగుల పడకల వద్దకు వెళ్లి వైద్య సూచనలు అందించారు. శిబిరంలో అందించిన సేవలను ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ తదితర ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా అందించినట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద నిమ్స్‌లో ఈసీఎంఒ సేవలు అందించడం ప్రత్యేకమన్నారు. హీలింగ్ లిటిల్ హార్ట్స్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరం 2023, 2024, 2025లో జరిగిన క్యాంపులకు కొనసాగింపుగా జరిగిందన్నారు.



చికిత్స నిర్వహించిన వైద్య బృందంతో డాక్టర్ రాహుల్ దేవరాజ్

శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులను రాహుల్ దేవరాజ్ సన్మానించారు. కార్యక్రమంలో కార్డియోవాస్క్యులర్ అండ్ థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం. అమరేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో ఇళ్లు ఖాళీచేయిస్తున్నారని విషప్రచారం

## సోషల్‌మీడియా సందేశాలను నమ్మవద్దంటూ సైన్యం ప్రకటన

**శ్రీనగర్, సెప్టెంబరు 12:** జమ్మూకశ్మీర్లోని నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయని, అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయమని సైన్యం ఆదేశించిందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత సైన్యం తీవ్రంగా ఖండించింది. ఇదంతా నిరాధారమైన, తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇండియన్ ఆర్మీ అధికారిక ఫ్యాక్ట్‌చెక్ విభాగం నేడు ఖఎక్స్‌ఖ (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఉత్తర కశ్మీర్లోని కుప్వారా, బారాముల్లా జిల్లాల్లోని ప్రధాన సైనిక స్థావరాల సమీపంలో నివసించే వారిని ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ కోరినట్టుగా కొన్ని నివేదికలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ వార్తలకు, నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదుల కదలికలు పెరిగాయనడానికి సంబంధం ఉందంటూ కశ్మీరీ ఇంటెల్ ఖాతా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆర్మీ తెలిపింది. ఈ ఖాతా పాకిస్థాన్ ఆధారిత ప్రచార ఖాతా అని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే దీని లక్ష్యమని పేర్కొంది. నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయనడం, అసాధారణ స్థాయిలో సైన్యం మోహరింపు జరుగుతోందనడం పూర్తిగా అవాస్తవం" అని ఆర్మీ అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రచార ఖాతా ఐరోపా కేంద్రంగా పనిచేస్తూ, కశ్మీర్లోని పరిస్థితులపై తప్పుడు కథనాలను సృష్టించడానికి ప్రయత్నిస్తోందని వివరించారు. గతంలోనూ పలుమార్లు ఈ ఖాతా నుంచి ఇలాంటి నకిలీ వార్తలు వ్యాప్తి అయ్యాయని గుర్తుచేశారు. నిర్ధారణ లేని ఉగ్రవాద వాదనలు, ఆధారాల్లేని సైనిక మోహరింపు కథనాలు, ఊహాజనిత సంబంధాలను కలిపి తప్పుడు సమాచారాన్ని సృష్టిస్తున్నారని ఆర్మీ తన పోస్టులో పేర్కొంది. ఏదైనా సమాచారాన్ని ఇతరులకు చేరవేసే ముందు దానిని ధ్రువీకరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇటువంటి వదంతులను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయవద్దని సైన్యం ప్రజలను కోరింది.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసివినతి పత్రం అందిస్తున్న ఆటో సంఘాల జెఎసి నేతలు

# ఆటోల మీటర్ చార్జీలు పెంచాలి

### రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసిన ఆటో సంఘాల జెఎసి నాయకులు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** ఆటో మీటర్ చార్జీలు 40 రూపాయలకు పెంచాలని, కిలోమీటర్‌కు 18 రూపాయలుగా ప్రకటించాలని తెలంగాన ఆటో రాష్ట్ర సంఘాల యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం తెలంగాణ ఆటో రాష్ట్ర సంఘాల యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు రవాణాశాఖామంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వినతి పత్రం అందచేశారు. ఈనెల 7వ తారీఖు ఆటో యూనియన్ నాయకులు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలుచేస్తామని మంత్రి ప్రకటించినట్లు వారు తెలిపారు. ఆటో కార్మికుల వెల్ఫేర్ బోర్డును విధి విధానాలు రూపొందిస్తున్నామని, అదే విధంగా ప్రభుత్వం ఒక యాప్ రూపకల్పన చేయటం జరుగుతుందని అన్నారు. జీవో నెంబర్ 263లో గల మిగిలిన ఆటో పర్మిటీస్ వెంటనే ఇస్తామని మంత్రి తెలిపారు. మంత్రిని కలసిన వారిలో జేఏసీ నాయకులు బి.వెంకటేశం, ఏ.సత్తిరెడ్డి, ముఖేష్‌గౌడ్, ఎంఎ సలీం, వి.ప్రవీణ్, ఎండి మజీద్, అజయ్‌బాబు, రాంకిషన్ పాల్గొన్నారు.

# చలో అసెంబ్లీ ముట్టడి చేపట్టిన ఎబివిపి విద్యార్థుల అరెస్టు

**సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** విద్యా రంగ సమస్యలను పరిష్కారించాలని, ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని శనివారం గన్‌పార్కు నుంచి అసెంబ్లీ వైపుకు దూసుకువెళుతున్న ఆనేక మంది ఎబివిపి విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఎబివిపి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు అరెస్టుకు పూనుకోవడంతో విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వివాదం జరిగింది. తొక్కిసలాట జరిగి ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. దీంతో కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన విద్యార్థి రాకేష్‌కు ఊపిరి ఆడక స్పృహ తప్పి కిందపడిపోయారు. తోటి విద్యార్థులు, పోలీసులు అప్రమత్తమై ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం సమీప ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంబాబు, సహాయ కార్యదర్శి కల్యాణి తదితరులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నదని ఆరోపించారు. విద్యా సంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు ఆలివేలు, రాజు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలని స్వచ్ఛ కార్మికుల అసెంబ్లీ ముట్టడి

**సైఫాబాద్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** శ్రమశక్తిపై ఆధారపడి జీవిస్తున్న స్వచ్ఛ కార్మికులు ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ శనివారం చలో అసెంబ్లీ ముట్టడికి యత్నం చేసిన వందలాది మంది కార్మికులను పోలీసులు విడతల వారిగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. తొలుత ఎల్‌బి స్టేడియం సమీపంకు ఆనేక మంది కార్మికులు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అసెంబ్లీ వైపు వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి అసెంబ్లీ వైపు వెళ్ళడానికి ప్రయత్నించిన కార్మికులను పోలీసులు అడుగడుగున అడ్డుకున్నారు. అంతకు ముందు మహిళా కార్మికులు లక్ష్మి, సరోజ, జయమ్మ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తూ జీవనం కొనసాగిస్తున్నామని చెప్పారు. చెత్త సేకరణ పనులను ప్రభుత్వ రాంకీ అప్పగించే ప్రతిపాదనతో తమకు ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త సేకరణ బాధ్యతలను రాంకీ అప్పగించకుండా గతంలో వలే ప్రభుత్వం స్వచ్ఛా కార్మికులతోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నగర పరిశుభ్రతకు పాటుపడుతున్న కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని, గతంలో వలే చెత్త సేకరణ అవకాశాన్ని తమకు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



చలో అసెంబ్లీ ముట్టడికి ప్రదర్శనకు వెళుతున్న కార్మికులు

# తల్లి మృతి.. తట్టుకోలేక కొడుకు బలవన్మరణం

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** మండలంలోని మక్త లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటన తీవ్ర కలకలం రేపింది. కుటుంబ గొడవల నేపథ్యంలో భార్య నాగాధర్ బేతమ్మ (45) హైదరాబాద్‌లోని దుండిగల్ లో ఆత్మహత్యకు పాల్పడగా.. తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడు నాగాధర్ ప్రవీణ్ (21) కూడా మండల పరిధిలోని కోలపల్లి గ్రామ శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు.



మృతి చెందిన తల్లి బేతమ్మ, కొడుకు ప్రవీణ్

స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మక్త లక్ష్మాపూర్‌కు చెందిన నాగాధర్ శివయ్య, బేతమ్మ దంపతులు ఏడాది క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి బౌరంపేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతులు ఇద్దరూ వాచ్‌మెన్‌లుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శుక్రవారం కుటుంబంలో గొడవ జరిగిన అనంతరం బేతమ్మ ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. తల్లి మృతి విషయం తెలుసుకున్న కుమారుడు ప్రవీణ్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. తల్లి మరణాన్ని తట్టుకోలేక అదే రోజు రాత్రి సొంత గ్రామమైన లక్ష్మాపూర్ కు చేరుకొని, అక్కడినుండి కోలపల్లి శివారుకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కొద్ది గంటల వ్యవధిలోనే తల్లి, కుమారుడు మృతిచెందడంతో మక్త లక్ష్మాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు వేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

# హౌతీ యోధుల అధీనంలోకి పెరిమ్ ద్వీపం

**సనా, సెప్టెంబరు 12:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. యెమెన్‌లోని బాబ్ అల్‌మందేబ్ జలసంధికి సమీపంలో ఉన్న పెరిమ్ ద్వీపంపై ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ యోధులు పట్టు సాధించినట్లు వచ్చిన నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ఈ ప్రాంతంపై హౌతీల నియంత్రణ ఏర్పడితే ప్రపంచంలోని ముఖ్యమైన సముద్ర వాణిజ్య మార్గాల్లో ఒకటైన బాబ్‌అల్‌మందేబ్ ద్వారా నౌకల రాకపోకలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారుల్లో ఒకటైన సౌదీ అరేబియాకు ఈ పరిణామం పెద్ద సవాలుగా మారింది. ఇప్పటికే ఎర్ర సముద్రం, హార్ముజ్ జలసంధి ప్రాంతాల్లో రవాణాకు అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో పెరిమ్ ద్వీపంపై హూతీల పట్టు పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చే అవకాశం ఉంది. ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో కలిపే బాబ్‌అల్‌మందేబ్ జలసంధి ప్రపంచ సముద్ర వాణిజ్యంలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. యూరప్, ఆసియా, మధ్యప్రాచ్యాల మధ్య నౌకల రాకపోకలకు ఈ మార్గం ముఖ్యమైనది. ఈ ప్రాంతంలో సాయుధ సంఘర్షణలు పెరిగి నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడితే చమురు, గ్యాస్‌తో పాటు ఇతర సరుకుల రవాణాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. హౌతీ యోధులు యెమెన్ ప్రభుత్వ దళాల నుంచి ఎర్ర సముద్ర తీరంలోని పలు వ్యూహాత్మక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పెరిమ్ ద్వీపంతో పాటు తీర ప్రాంతంలోని ధుబాబ్ నగరం కూడా ఉన్నట్లు సమాచారం. అంతకుముందు కీలకమైన మోచా పోర్ట్ నగరాన్ని కూడా హౌతీలు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. దీనికి ప్రతిస్పందనగా సౌదీ అరేబియా యుద్ధ విమానాలు మోచా నగరంలోని విమానాశ్రయంపై దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నివేదికలు చెబుతున్నాయి. హౌతీలకు, సౌదీ మద్దతు ఉన్న భద్రతా బలగాలకు మధ్య జరిగిన పోరులో సౌదీ అరామ్‌కోకు చెందిన ఈస్ట్‌వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్ దెబ్బతిన్నట్లు సమాచారం. పైప్‌లైన్ ప్రాంతం నుంచి భారీగా నల్లటి పొగలు వెలువడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఈ పైప్‌లైన్ ద్వారా చమురు సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సౌదీ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్ సౌదీ అరేబియా చమురు రవాణా వ్యవస్థలో కీలకమైనదిగా భావిస్తారు. ఇలాంటి కీలక మౌలిక సదుపాయాలపై దాడులు లేదా నష్టం జరిగితే దేశ చమురు ఎగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇరాన్‌అమెరికా మధ్య కొనసాగుతున్న ఘర్షణల కారణంగా సౌదీ అరేబియా చమురు ఎగుమతులు భారీగా తగ్గినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. రోజుకు సుమారు 60 లక్షల బ్యారెళ్ల స్థాయి నుంచి 23 లక్షల బ్యారెళ్లకు ఎగుమతులు పడిపోయినట్లు సమాచారం. బాబ్‌అల్ మందేబ్, హార్ముజ్ అనే రెండు కీలక జలమార్గాల్లోనూ నౌకల రాకపోకలు తీవ్రంగా దెబ్బతింటే ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై భారీ ప్రభావం పడే అవకాశం ఉంది.



# ఆర్టీసి డ్రైవర్ కుటుంబానికి రూ.42 లక్షల పరిహారం..

**నందిగామ సెప్టెంబర్ 12, ప్రభాతవార్తప్రతినిధి:** డ్రైవర్‌గా పనిచేస్తూ ప్రమాదంలో మృతి ఘటనలో దాదాపు ఏడేళ్ళ తరువాత ఆయన కుటుంబానికి అదనపు జిల్లా కోర్టులో న్యాయం జరిగింది. బాధిత కుటుంబానికి రూ.42 లక్షల ఆర్థిక భరోసా అందింది. 2019లో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న శనగపాడు రమణ మృతి ఘటనకు సంబంధించి బాధ్యుల నుంచి ఎటువంటి పరిహారం అందలేదు. ఈ దశలో ఆయన కుటుంబ సభ్యులు న్యాయస్థానంను ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రూ.42,00,000 పరిహారం అందజేశారు. ఈ వ్యవహారంపై నందిగామ 16వ అదనపు జిల్లా కోర్టులో ఎంవిఒపి.50/2019 కేసు విచారణ జరిగింది. కోర్టు ఆదేశాల మేరకు ఇరు పక్షాల కక్షిదారులు, న్యాయవాదుల సమక్షంలో నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.42 లక్షల చెక్కును అందజేశారు. ఆర్టీసీ తరఫున న్యాయవాది చిరుమామిళ్ల శ్రీనివాసరావు సహకారం అందించారు.

# నాడు ధరణి,నేడు భూభారతి రెండు వ్యవస్థలు ఒక్కటే

### అసెంబ్లీలో బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** నాడు ధరణి, నేడు భూభారతి రెండు వ్యవస్థలు ఒక్కటేనని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో లక్షల ఎకరాలను బీఆర్ఎస్ నేతలు కొల్లగొట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో చెప్పారని.. కానీ ఆ భూములను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోట్లేదని ప్రశ్నించారు. శనివారం సాయంత్రం ఆయన అసెంబ్లీలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యుల మీద ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు.

గతంలో రిజిస్ట్రేషన్లు తప్పుడుగా జరిగినట్లే, భూభారతి తీసుకొచ్చాక కూడా రిజిస్ట్రేషన్లు అలాగే జరిగాయని ప్రస్తావించారు. ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టుపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. అవసరం లేని భూములను 22ఏ లో చేర్చడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. బాధితులు కాళ్ల అరిగేలా తిరుగుతున్నారన్నారు.

# బ్రిక్స్‌లో ఉమ్మడి కరెన్సీ ప్రతిపాదన లేదు: విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** బ్రిక్స్ దేశాల మధ్య ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టే ప్రతిపాదన ప్రస్తుతం లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం స్పష్టం చేసింది. బ్రిక్స్ దేశాలు పరస్పర వాణిజ్య లావాదేవీలను ఆయా దేశాల స్థానిక లేదా జాతీయ కరెన్సీల్లో నిర్వహించే అంశంపైనే దృష్టి సారిస్తున్నాయని తెలిపింది. బ్రిక్స్ దేశాలు ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన నేపథ్యంలో విదేశాంగ మంత్రిత్వ శాఖలో ఆర్థిక సంబంధాల కార్యదర్శి సుధాకర్ దలేలా ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం బ్రిక్స్‌లో ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏదీ లేదని దలేలా స్పష్టం చేశారు. సభ్య దేశాల మధ్య స్థానిక కరెన్సీల్లో వాణిజ్య లావాదేవీలను పరిష్కరించే అంశంపై కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయని, ఇది కొత్త పరిణామం కాదని తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో లావాదేవీల వ్యయాన్ని తగ్గించేందుకు స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు చేయడం ఆచరణాత్మక విధానమని భారత్ భావిస్తోందని దలేలా వివరించారు. ఇది ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ చెల్లింపులు, సెటిల్‌మెంట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదని, దానికి అనుబంధంగా పనిచేస్తుందని చెప్పారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యాన్ని మరింత పెంచే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం బ్రిక్స్‌లో బ్రిక్స్ కరెన్సీని ప్రవేశపెట్టే ప్రతిపాదన లేదు. స్థానిక కరెన్సీల్లో వాణిజ్య సెటిల్‌మెంట్లపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో లావాదేవీల ఖర్చును తగ్గించేందుకు స్థానిక కరెన్సీ సెటిల్‌మెంట్ ఒక ఆచరణాత్మక విధానం. ఇది ప్రపంచ చెల్లింపులు, సెటిల్‌మెంట్ వ్యవస్థకు అనుబంధంగా ఉండాలని దలేలా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్రిక్స్ దేశాల సమగ్ర 45 పేజీల ఢిల్లీ డిక్లరేషన్ పత్రాన్ని ఆమోదించినట్లు ప్రకటించారు.

# పుతిన్, జిన్‌పింగ్ చేతులు పట్టి కరచాలనంచేసిన ప్రధాని మోడీ

### తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటో పోస్టు

### బ్రిక్స్‌ప్రారంభం అని ట్యాగ్‌లైన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:** దేశరాజధానిలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లు చేతులు పట్టుకున్న ఫొటోను ప్రధాని మోడీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆసియా దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాలకు ఈ చిత్రం ప్రతీకగా నిలిచింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇండోనేషియా ప్రధాని ప్రబోవో సుబియాంటో కూడా ఈ ఫొటోల్లో కనిపించారు. బ్రిక్స్ సదస్సు 2026 ఢిల్లీలో ప్రారంభమైంది అంటూ ప్రధాని మోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. కీలక ద్వైపాక్షిక సమావేశాల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ నిర్ణయ ప్రక్రియలో నిర్ణయాత్మక పాత్ర పోషించాలి.

# సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనాలు

## మౌలిక సదుపాయాల నిధిలో మార్పులు

## రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయంలో విధాన నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త** రైతులకు ప్రయోజనాన్ని కలిగించే మౌలిక సదుపాయాల నిధి పథకంలో కేంద్రం మార్పులు తీసుకువస్తోంది. ప్రధానంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ప్రయోజనాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టింది. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం విషయంలో మార్పులు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ మౌలిక సదుపాయల నిధి పథకం కింద గల అర్హతను రాష్ట్ర ఏజెన్సీలు, ఏపీఎంసీలకు, జాతీయ, రాష్ట్ర సహకార సమాఖ్యలు, రైతు ఉత్పత్తి సంస్థల సమాఖ్యలు, స్వయం సహాయక బృందాల సమాఖ్యలకు విస్తరించడం జరిగింది. ఇప్పటి వరకూ 2 కోట్ల రూపాయల మేర రుణానికి సంబంధించిన నిబంధనల ప్రకారం ఈ పథకం కింద ఇచ్చే వడ్డీ సహాయాన్ని ఒక ప్రాంతంలో పని చేసే సంస్థకే ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం తీసుకురాబోతున్న మార్పుల ప్రకారం ఈ వడ్డీ సహాయాన్ని వివిధ ప్రాంతాల్లో పని చేసే అటువంటి అన్నిప్రాజెక్టులకు కూడా ఇవ్వడం జరుగుతుంది. అయితే ప్రైవేటు రంగ సంస్థ విషయంలో మాత్రం ఇటు వంటి ప్రాజెక్టులు 25కు మించి ఉండకూడదు. కానీ 25 ప్రాజెక్టు నిబంధన అనేది రాష్ట్ర సంస్థలు, జాతీయ సంస్థలు, రాష్ట్ర సహకార సమాఖ్యలు, ఎఫ్‌పిఓ సమాఖ్యలకు ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు వర్తించదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకానికి సంబంధించి ఏపీఎంసీల విషయంలో 2 కోట్ల రూపాయల వరకూ ఉండే రుణాలకు సంబంధించిన వడ్డీ సహాయాన్ని వివిధ మౌలిక సదుపాయల ప్రాజెక్టులకు ఇవ్వడం జరుగుతుంది. ఒకటే మార్కెట్ యార్డులోని కోల్డ్ స్టోరేజ్, సార్టింగ్, గ్రేడింగ్, అస్సెయింగ్ యూనిట్లు, సిలోస్ తదితర మౌలిక సదుపాయల ప్రాజెక్టుల కిందకు వస్తాయని తెలిపారు. కాగా లబ్దిదారులను తొలగించడం, చేర్చడానికి సంబంధించి స్ఫూర్తి.